



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక — ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 1 సంచిక : 142 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ శుక్రవారం 3 ఏప్రిల్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 142 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD FRI 3 APRIL 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


## ఫ్యూచర్ సిటీ కార్యాలయం త్వరగా పూర్తి చేయండి..

### అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం



**హైదరాబాద్ పెన్ పవర్:**ఫ్యూచర్ సిటీ కార్యాలయం, స్కిల్ యూనివర్సిటీ భవనాల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.ఫ్యూచర్ సిటీలో నిర్మాణాల పురోగతిని ఆయన పరిశీలించారు. ఫ్యూచర్ సిటీ కార్యాలయం, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు.

మిగతా 2లో

## నాడు హైదరాబాద్ అభివృద్ధికి చంద్రబాబు కృషి చేశారు

### తెలంగాణ బీజేపీ ఎంపీ



- విభజన తర్వాత అమరావతి రాజధానిగా సంకల్పం తీసుకున్నారన్న లక్ష్మణ్
- రెండు తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి ఎన్డీయే కట్టుబడి ఉందన్న లక్ష్మణ్
- జగన్ హయాంలో మూడు ముక్కలాడి రైతులు, మహిళలను ఇబ్బంది పెట్టారని మండిపాటు

మిగతా 2లో



## అమెరికా లొంగిపోయేవరకు యుద్ధం కొనసాగుతుంది

- ఇరాన్ నౌకాదళం, వాయుసేన తీవ్రంగా బలహీనపడ్డాయన్న ట్రంప్
- ట్రంప్ చెప్పినట్లు తమ సైనిక సామర్థ్యాలను దెబ్బతినలేదన్న ఇరాన్
- మా ఆయుధ సంపత్తి గురించి అమెరికాకు సమాచారం లేదన్న ఇరాన్

అమెరికా తమకు లొంగిపోయేవరకు ఈ యుద్ధం కొనసాగుతుందని ఇరాన్ హెచ్చరించింది. ఇరాన్ నౌకాదళం, వాయుసేన తీవ్రంగా బలహీనపడ్డాయని, వారి నాయకత్వాన్ని తీవ్రస్థాయిలో

మిగతా 2లో

# తెలంగాణలో 2 లక్షల కొత్త పెన్షన్లు..

## రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం

- చేయూత కింద 2 లక్షల కొత్త పెన్షన్లకు ప్రభుత్వం ఆమోదం
- బడ్జెట్‌లో రూ.233 కోట్లు కేటాయించిన రేవంత్ సర్కార్
- మూడేళ్లుగా పేరుకుపోయిన 12 లక్షలకు పైగా దరఖాస్తులు
- లబ్ధిదారుల ఎంపిక అధికారులకు అతిపెద్ద సవాల్






**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలో కొత్త పెన్షన్ల కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్న లక్షలాది మందికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. చేయూత పథకం కింద కొత్తగా మరో 2 లక్షల మందికి పెన్షన్లు మంజూరు చేయాలని నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగా 2026-27 వార్షిక బడ్జెట్‌లో రూ.233 కోట్లను కేటాయించడంతో, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియకు రంగం సిద్ధమైంది. అయితే, ఇప్పటికే పేరుకుపోయిన లక్షలాది దరఖాస్తుల నుంచి అర్హులను గుర్తించడం అధికారులకు పెను సవాల్‌గా మారనుంది.ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా వివిధ కేటగిరీలలో 42.23 లక్షల మంది నెలనెలా చేయూత పెన్షన్లు పొందుతున్నారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, గీత, చేనేత కార్మికులు, హెచ్ఐవీ, బోదకాలు బాధితులకు నెలకు రూ.2,016 చొప్పున ప్రభుత్వం అందిస్తోంది. దివ్యాంగులకు మాత్రం పెన్షన్‌ను రూ.4,016గా ఇస్తున్నారు. ఇప్పుడు ఈ జాబితాలోకి మరో 2 లక్షల మంది కొత్తగా చేరనున్నారు. గత మూడేళ్లుగా బోదకాలు, డయాలసిస్ బాధితులకు తప్ప కొత్తగా ఎలాంటి పెన్షన్లు మంజూరు కాకపోవడంతో అర్హులైన వారు తీవ్ర నిరాశలో ఉన్నారు.ఈ నేపథ్యంలో, రాష్ట్రవ్యాప్తంగా సుమారు 12 లక్షలకు పైగా దరఖాస్తులు ప్రభుత్వానికి చేరి పెండింగ్‌లో ఉన్నాయి. ఇటీవల బడ్జెట్‌లో కొత్త పెన్షన్ల ప్రకటన వెలువడిన తర్వాత, ఫిబ్రవరి 20 నుంచి ప్రజావాణి వంటి కార్యక్రమాల ద్వారా దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. దీనికి తోడు, గురువారం రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న గ్రామసభల్లో కూడా భారీగా దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.ప్రభుత్వం ఆమోదించినవి 2 లక్షల పెన్షన్లు కాగా, ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల సంఖ్య 12 లక్షలు దాటింది. వీటిలో వృద్ధాప్య పింఛన్ కోసం 4 లక్షలు, వితంతు, ఒంటరి మహిళల కోటాలో 3.5 లక్షలు, గీత, చేనేత కార్మికుల విభాగంలో 3 లక్షలు, దివ్యాంగుల పింఛన్‌కు 72 వేల దరఖాస్తులు ఉన్నాయి. ఈ భారీ సంఖ్య నుంచి కేవలం 2 లక్షల మంది అత్యంత అర్హులను ఎంపిక చేసేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు త్వరలోనే పటిష్టమైన వడపోత కార్యక్రమం చేపట్టనున్నారు. ఈ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించడం ప్రభుత్వానికి కత్తిమీద సాములా మారింది.



## రాజ్యసభలో పలికింది కిషన్ రెడ్డి, పలికించింది రేవంత్ రెడ్డి

- రాజ్యసభలో కిషన్ రెడ్డి పచ్చి అబద్ధాలు చెప్పారన్న హరీశ్ రావు
- ఏడు మండలాలను ఏపీకి కట్టబెట్టిన పాపంలో కిషన్ రెడ్డి పాత్ర ఉందని ఆరోపణ
- రేవంత్ రెడ్డి చేస్తున్న ప్రచారాన్నే కిషన్ రెడ్డి ప్రస్తావించారన్న హరీశ్ రావు

**హైదరాబాద్ పెన్ పవర్:** కేంద్రమంత్రి కిషన్ రెడ్డిపై మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈరోజు రాజ్యసభలో ఆయన పచ్చి అబద్ధాలతో, చరిత్ర వక్రీకరణలతో తన లోపలి వికృతత్వాన్ని బయటపెట్టుకున్నారని విమర్శించారు. సభలో పలికింది కిషన్ రెడ్డే కానీ పలికించింది రేవంత్ రెడ్డి అని ఆరోపించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. తెలంగాణ ఉద్యమంలో రాజీనామా చేయకుండా వెన్నుచూపి పారిపోయిన వ్యక్తి కిషన్ రెడ్డి అని ఆరోపించారు. నేడు పార్లమెంట్ సాక్షిగా మరోసారి ద్రోహానికి పాల్పడ్డారని ధ్వజమెత్తారు.ఏడు మండలాలను ఏపీకి అప్పగించాలనేది విభజన చట్టంలో ఉందని కిషన్ రెడ్డి పేర్కొనడం చారిత్రక అవాస్తవమే కాదు, తెలంగాణకు చేస్తున్న తీరని ద్రోహం కూడా అన్నారు. విభజన చట్టానికి సవరణ తెచ్చి ఆర్డినెన్స్ ద్వారా ఏడు మండలాలను ఏపీకి కట్టబెట్టింది ముమ్మాటికి బిజెపి ప్రభుత్వమే అన్నారు.

మిగతా 2లో



## భారత నౌకలకు డోకా లేదు..

### హర్మూజ్ జలసంధిపై ఇరాన్ కీలక ప్రకటన

- హర్మూజ్ జలసంధిలో భారత నౌకల భద్రతపై ఆందోళన వద్దన్న ఇరాన్
- ఇజ్రాయెల్, అమెరికాతో ఉద్రిక్తతల నేపథ్యంలో జలసంధిపై ఆంక్షలు
- ఇప్పటివరకు 8 భారత నౌకలను సురక్షితంగా బయటకు పంపిన ఇరాన్
- భారత్‌కు రావాల్సిన మరో 19 నౌకలు ఇంకా జలసంధిలోనే చిక్కుకుపోయిన వైనం
- భారత్, చైనా, రష్యా వంటి మిత్ర దేశాలకు మాత్రమే అనుమతిస్తున్నట్లు ప్రకటన

మిగతా 2లో

## హైదరాబాద్ సహా పలు నగరాల్లోని ఐప్యాక్ కార్యాలయాల్లో ఈడీ సోదాలు




- ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్ కార్యాలయాల్లో ఏకకాలంలో ఈడీ సోదాలు
- బెంగాల్ బొగ్గు స్మగ్లింగ్ కేసుకు సంబంధించి ఈడీ సోదాలు
- గతంలో బెంగాల్‌లోని ఐప్యాక్ కార్యాలయాల్లో ఈడీ సోదాలు

మిగతా 2లో



## హర్మూజ్ మార్గం పునరుద్ధరణే లక్ష్యం.. 35 దేశాలతో భేటీకి భారత్ హాజరు

- హర్మూజ్ జలసంధి సంక్షోభంపై యూకే ఆధ్వర్యంలో 35 దేశాల సమావేశం
- ఈ కీలక భేటీకి భారత్‌ను ఆహ్వానించిన యునైటెడ్ కింగ్‌డమ్
- వర్చువల్ సమావేశానికి హాజరుకానున్న భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిశ్రీ
- ఇప్పటికే 6 భారత నౌకలు సురక్షితంగా జలసంధిని దాటాయని తెలిపిన విదేశాంగ శాఖ
- మిత్రదేశాలు సొంతంగా పోరాడాలంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యలు

మిగతా 2లో

## నా పేరు చెప్పి కబ్జాలు, సెటిల్ మెంట్లు చేస్తే కంప్లైంట్ చేయండి



**హైదరాబాద్ పెన్ పవర్:**అక్రమార్కులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ వార్నింగ్ ఇచ్చారు. తన పేరు చెప్పి సెటిల్ మెంట్లు చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు.దకరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో తన పేరు వాడుకుని ఎవరైనా కబ్జాలు, అక్రమ దందాలకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని కేంద్ర మంత్రి బండి సంజయ్ హెచ్చరించారు. పంచాయతీలు, సెటిల్ మెంట్ల పేరుతో ప్రజలను ఇబ్బంది పెడితే ఎంతటి వారినైనా ఉపేక్షించబోనని ఆయన స్పష్టం చేశారు. ప్రజా ప్రతినిధులు సైతం పైరవీకారుల పట్ల అప్రమత్తంగా ఉండాలని బండి సంజయ్ సూచించారు.

మిగతా 2లో



## తెలంగాణ గ్రూప్-1 అభ్యర్థులకు సుప్రీంకోర్టులో చుక్కెదురు..

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇటీవల టీజీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1 ఉద్యోగ నియామకాల్లో జోక్యం చేసుకునేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోబోమని స్పష్టం చేసింది. ఈ మేరకు గ్రూప్-1 అభ్యర్థుల పిటిషన్‌ను జస్టిస్ విక్రమ్‌నాథ్ ధర్మాసనం డిస్మిస్ చేసింది. గ్రూప్-1 పరీక్షల్లో అవకతవకలు జరిగాయంటూ పలువురు అభ్యర్థులు ఇంతకుముందు హైకోర్టును ఆశ్రయించారు. మూల్యాంకనంలో తప్పులున్నాయని, నోటిఫికేషన్ రద్దు చేసి.. మళ్లీ పరీక్షలు నిర్వహించాలని కోరారు.విచారణ చేపట్టిన హైకోర్టు

మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# భావజాలాన్ని అంతమొందించలేరు...!

నక్సలైట్ ఉద్యమం ముగింపు దినం 2026 మార్చి 31. అంటే దేశంలో కమ్యూనిజాన్ని స్థాపించే లక్ష్యంతో సాయుధ పోరాటం చేస్తున్న ఒక సిద్ధాంత పార్టీని నిర్మూలించాలనే కేంద్ర ప్రభుత్వ సంకల్పం దినం. ఈ కాలంలో వేలాది మావోయిస్టులు, పోలీసులు, నిర్భాగ్యులైన ఆదివాసీలు మరణించారు. ఈ ఆరు దశాబ్దాలలో మావోయిస్టు ఉద్యమం చాలా పొందింది, చాలా కోల్పోయింది. దినిని ఎవరూ నిరాకరించలేరు.

మార్క్సిస్టు-లెనినిస్టు, మావోయిస్టు సిద్ధాంతం బలంతో ప్రారంభమైన నక్సల్బరి ఉద్యమం క్రమంగా దేశమంతటా వ్యాపించింది. దీనికి ప్రధాన కారణం - కులం, మతం పేరుతో పేద వర్గాలపై ఉన్నత వర్ణాలు, పెట్టుబడిదారులు, సామంతుల అణచివేత, అన్యాయం, అత్యాచారాలు. మావోయిస్టు ఉద్యమం పేద, సర్వహారా వర్గాలపై జరుగుతున్న, చేస్తున్న అణచివేత, అన్యాయం, అసమానత, అత్యాచారాలు చేస్తున్న వారిని గుర్తించేలా చేసింది. స్వతంత్ర దేశ ప్రభుత్వాలు దీనిని సరిగ్గా గుర్తించి ఉంటే, ఇపుడు వేలాది, లక్షలాది మావోయిస్టులు, పోలీసులు, నిర్భాగ్యులైన ఆదివాసీలు చనిపోయేవారు కాదు. అణచివేత, అన్యాయం, అసమానత, అత్యాచారాలకు వ్యతిరేకంగా పోరాడేందుకు పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలు నక్సలైట్ ఉద్యమం వైపు ఆకర్షితులయ్యారు. వేలాది మంది యువకులు ఈ ఉద్యమంలో చేరారు. ప్రజలను చైతన్యపరిచారు. ఆదివాసీలకు విద్యాబోధన చేసి, అనేక రకాల శిక్షణలు ఇచ్చారు. ప్రారంభంలో పోలీసులు, నక్సల్ వాదుల మధ్య పెద్ద శత్రుత్వం ఏమీ లేదు. నక్సలైట్లు గ్రామాల్లో సామంత వర్గాలకు వ్యతిరేకంగా తమ ఉద్యమాన్ని తీవ్రం చేశారు. దీన్ని చూసి సామంతులు ప్రభుత్వాలను సంప్రదించారు. ప్రభుత్వం సామంతుల భద్రత కోసం గ్రామాల్లో పోలీసులను పంపి నక్సలైట్లను తమ లక్ష్యంగా చేసుకుంది. ఇదే సమయంలో దేశంలో పెరుగుతున్న నక్సలైట్ ఉద్యమాన్ని అణచివేసేందుకు ప్రజాస్వామ్య ప్రభుత్వం నిషేధం విధించింది. దీన్ని చూసి నక్సలైట్లు తమ భద్రత కోసం ఆదివాసీ ప్రాంతాలకు వెళ్లి, ఖనిజ సంపద, ప్రకృతిని కాపాడేందుకు కృషి చేయడం ప్రారంభించారు. పెట్టుబడిదారులు, పెద్ద కంపెనీల ధనబలంతో రాజ్యాంగం మీద ప్రమాణం చేసి మళ్లీ అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం పెట్టుబడిదారుల, పెద్ద కంపెనీల కోసం మావోయిస్టులను అడవుల నుంచి తరిమేందుకు ఆపరేషన్ కగార్ ప్రారంభించింది. దీని ఫలితంగా పెద్ద ఎత్తున వేలాది మావోయిస్టులను బూటకపు ఎన్‌కౌంటర్లలో చంపివేయబట్టారు. కొంత మంది మావోయిస్టు నాయకులు లొంగిపోయారు. ఈ ప్రక్రియకు ముందు మావోయిస్టుల వైపు నుంచి అనేక శాంతి ప్రతిపాదనలు వచ్చాయి. అయినప్పటికీ, ప్రభుత్వం అన్ని ప్రతిపాదనలను తోసిపుచ్చింది, లొంగిపొండి లేదా ఎన్‌కౌంటర్‌లో చనిపోండి అని ప్రతిపాదన చేసింది. దేశాన్ని రక్షించే సైన్యాన్ని ఆధునిక ఆయుధాలతో తమ సొంత పౌరుల మీద దాడి చేసింది. దేశంలో ఇప్పటికీ అనేక మంది నక్సలైట్లు అడవుల్లో, జైళ్లలో ఉన్నారు. మావోయిస్టు పార్టీ అగ్ర నాయకుడు గణపతి ఇప్పటికీ అజ్ఞాతంలో ఉన్నారు. ఇదే సమయంలో ఒడిశా ఎమ్ఏడీసీ విభాగం కార్యదర్శి రజితా సాయుధ పోరాటం కొనసాగిస్తామని ప్రకటించారు. పార్టీ కోసం ప్రాణాలు త్యాగం చేసిన సహచరుల మరణం వృధా పోనివ్వమని ఆమె చెప్పారు. మావోయిస్టుల సాయుధ పోరాటం ప్రతీ హింస కోసమేనని అందరికీ తెలుసు. దేశ, ప్రపంచ పౌరులు మంచి ప్రత్యామ్నాయ ప్రభుత్వం కోసం వెతుకుతున్నారు. ప్రతి ఒక్కరూ మార్పు కోరుకుంటున్నారు. ఈ మార్పు మావోయిస్టు భావజాలం ద్వారా సాధ్యమవుతుంది. మావోయిస్టు భావజాలం ఇప్పటికీ ప్రజల్లో సజీవంగా ఉంది, భవిష్యత్తులో కూడా ఉంటుంది

# రాజ్యసభలో పలికింది కిషన్ రెడ్డి, పలికించింది రేవంత్ రెడ్డి

- మొదటి పేజి తరువాయి

ఈ పాపంలో కిషన్ రెడ్డి పాత్ర కూడా ఉందని అన్నారు. ఉద్యమం సమయంలో ముఖ్యమంత్రిగా కేసీఆర్ తెలంగాణ బంద్‌కు పిలుపునిచ్చి, మీరు చేసిన ద్రోహాన్ని ఎండగట్టిన విషయాన్ని మరిచిపోయారా అని కిషన్ రెడ్డిని ఉద్దేశించి అన్నారు. కిషన్ రెడ్డి పార్లమెంట్ సాక్షిగా చరిత్ర వక్రీకరణకు పాల్పడి ఈరోజు తెలంగాణ ఆత్మగౌరవాన్ని అవమానించారని ధ్వజమెత్తారు. ఇది వారి కుట్రకు నిదర్శనవని విమర్శించారు.

**రేవంత్ రెడ్డి చేస్తున్న తప్పుడు ప్రచారాన్నే కిషన్ రెడ్డి ప్రస్తావించారు**

కాళేశ్వరం ప్రాజెక్టుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న తప్పుడు ప్రచారాన్నే ఈరోజు కిషన్ రెడ్డి పార్లమెంట్‌లో చేయడం కాంగ్రెస్, బీజేపీ చీకటి పొత్తుకు సాక్ష్యమని ఆరోపించారు. ప్రపంచంలోనే అతి పెద్ద బహుళ దశల ఎత్తిపోతల ప్రాజెక్టుగా కాళేశ్వరం నిర్మించడం అబద్ధమా? అని నిలదీశారు. 148 మీటర్ల దిగువ ప్రాంతం నుంచి 618 మీటర్ల ఎత్తుకు నీటిని ఎత్తిపోయడం అబద్ధమా? ఈరోజు, ఈ నిమిషానికి మండుటెండల్లో సైతం కాళేశ్వరం ప్రాజెక్ట్ కాల్వల ద్వారా జలాలు రైతుల పొలాలకు చేరుతుండటం అబద్ధమా? ఏది అబద్దమో కిషన్ రెడ్డి చెప్పాలని ప్రశ్నించారు. పంట పొలాల్లో పారుతున్న కాళేశ్వరం జలాలను చూపించేందుకు

నేను సిద్ధం వచ్చేందుకు మీకు దమ్ముందా? అని సవాల్ చేశారు. మీరు క్యాబినెట్ మంత్రిగా ఉండి, ఏ ప్రభుత్వం అయినా ప్రజా ధనంతోనే నిర్మాణాలు చేస్తుందన్న ఇంగితం మరిచి కేసీఆర్ జేబులోంచి డబ్బు ఖర్చు పెట్టారా? అని అడగడం మీ అవివేకానికి, అతి తెలివికి నిదర్శనమని దుయ్యబట్టారు. మీ బీజేపీ ప్రభుత్వం నిర్మిస్తున్న జాతీయ రహదార్లు, ప్రాజెక్టులకు మీ సొంత పైసలు ఖర్చు పెడుతున్నారా? అని ప్రశ్నించారు. ఆ పైసలు దుబాయ్‌లో ముద్రిస్తున్నారా? లేక మీ జేబుల్లో నుండి ఖర్చు చేస్తున్నారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కాళేశ్వరం వల్ల ఉపయోగంలేదని కిషన్ రెడ్డి గొంతు చించుకున్నారని ఆరోపించారు. కానీ గతంలో బీజేపీ ప్రభుత్వ పెద్దలు నితిన్ గడ్కరీ నుంచి సీడబ్ల్యూసీ చైర్మన్ మసూద్ వరకు కాళేశ్వరంపై కురిపించిన ప్రశంసలు అబద్ధమా లేక అవివేకమా అని ప్రశ్నించారు.

నిన్నగాక మొన్న పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఎకనామిక్ సర్వే ఆఫ్ ఇండియా' రిపోర్ట్ ప్రకారం, "2014లో తెలంగాణలో 1.31 కోట్ల ఎకరాలుగా ఉన్న సాగు విస్తీర్ణం ఉంది. 2023 నాటికి ఏకంగా 2.2 కోట్ల ఎకరాలకు పెరిగింది. దీనికి ప్రధాన కారణం కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ కాకతీయ పథకాలే" అని కుండబద్దలు కొట్టిందని అన్నారు. ఇది కిషన్ రెడ్డి కళ్లకు

కనబడటం లేదా అని దుయ్యబట్టారు. రేవంత్ రెడ్డి చెప్పింది మాత్రమే ఆయన చెవుల్లోకి వెళుతున్నట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. పూటకో తీరు మాట్లాడటం రాజనీతి కాదని హితవు పలికారు. కేంద్ర ప్రభుత్వం విభజన చట్టంలోని హామీలను అమలు చేయాలని, తెలంగాణకు నిధులు కేటాయించాలని మా ఎంపీ సురేశ్ రెడ్డి ఎంతో హుందాగా బాధ్యతగా మాట్లాడితే, మీరు దాన్ని సమర్థించకపోగా బాధ్యత మరిచి వ్యర్థ రాజకీయ ప్రేలాపనలకు పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈరోజు సభలో పలికింది కిషన్ రెడ్డే కానీ పలికించింది మాత్రం రేవంత్ రెడ్డేనని వ్యాఖ్యానించారు. 8 మంది బీజేపీ ఎంపీలు, 8 మంది కాంగ్రెస్ ఎంపీలు ఉండి తెలంగాణ వాదాన్ని వినిపించకపోవడం సిగ్గుచేటని హరీశ్ రావు అన్నారు.

# భారత నౌకలకు డోకా లేదు..

ఇజ్రాయెల్, అమెరికాతో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో కీలకమైన హర్మూజ్ జలసంధిలో నౌకల రాకపోకలపై ఆంక్షలు విధించిన ఇరాన్.. భారత్‌కు కీలక హామీ ఇచ్చింది. "భారత మిత్రులకు ఎలాంటి ఆందోళన అవసరం లేదు. వారు సురక్షితంగా ఉన్నారు" అని భారత్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయం గురువారం 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ప్రకటించింది. ఈ భరోసాతో భారత్ కాస్త ఊపిరి పీల్చుకుంది.

ప్రపంచంలోని 20 శాతం ఇంధన రవాణా జరిగే హర్మూజ్ జలసంధి ఇరాన్ నియంత్రణలో ఉంది. ఫిబ్రవరి 28న ఇజ్రాయెల్, అమెరికాతో వివాదం మొదలైనప్పటి నుంచి ఇరాన్ ఈ మార్గంలో రాకపోకలను దాదాపు నిలిపివేసింది. అయితే భారత్, చైనా, రష్యా, ఇరాక్, పాకిస్థాన్ వంటి స్నేహపూర్వక దేశాల నౌకలను మాత్రమే అనుమతిస్తున్నట్లు ఇరాన్ స్పష్టం చేసింది. ఈ దిగ్బంధనం వల్ల భారత్ సహా పలు దేశాలకు ఇంధన సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇప్పటికే 8 భారత నౌకలు హర్మూజ్ జలసంధిని సురక్షితంగా దాటాయి. వీటిలో దీఔ క్=, దీఔ జూవీ అనే రెండు ఎల్‌పీజీ క్యారియర్లు ఉన్నాయి. వీటి ద్వారా సుమారు 94,000 టన్నుల ఎల్‌పీజీ భారత్‌కు చేరింది. అయితే, భారత్‌కు రావాల్సిన ఎల్‌పీజీ, ముడిచమురు, ఎల్ఎన్‌జీతో కూడిన మరో 19 నౌకలు ఇంకా అక్కడే చిక్కుకుపోయాయని అధికారులు తెలిపారు.

ఇటీవల జరిగిన

మంత్రిత్వ శాఖల సమావేశంలో షిప్పింగ్ శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్ కుమార్ సిన్హా ఈ వివరాలు వెల్లడించారు. చిక్కుకున్న నౌకల్లో భారత్‌కు చెందినవి 9 ఉండగా, విదేశీ జెండాలతో భారత్‌కు వస్తున్నవి 10 ఉన్నాయని ఆయన వివరించారు. ఈ సంక్షోభం కారణంగా మొత్తం 500 నౌకలు జలసంధిలో నిలిచిపోయినట్లు సమాచారం.

# హర్మూజ్ మార్గం పునరుద్ధరణే లక్ష్యం.. 35 దేశాలతో భేటీకి భారత్ హాజరు

ఇజ్రాయెల్, అమెరికా దాడుల నేపథ్యంలో ఇరాన్ మూసివేసిన హర్మూజ్ జలసంధి సంక్షోభం అంతర్జాతీయంగా తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ప్రపంచ ఇంధన రవాణాలో కీలకమైన ఈ మార్గాన్ని తిరిగి తెరిపించేందుకు యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) నడుం బిగించింది. ఇందులో భాగంగా 35 దేశాలతో నిర్వహిస్తున్న అత్యవసర సమావేశానికి భారత్‌ను కూడా ఆహ్వానించింది. గురువారం వర్చువల్‌గా జరిగే ఈ భేటీలో భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిశ్రీ పాల్గొంటారని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ధ్రువీకరించారు. భారత ఇంధన భద్రతకు హర్మూజ్ జలసంధి అత్యంత కీలకం. దేశం దిగుమతి చేసుకునే ముడి చమురులో 40శాతం, ద్రవీకృత సహజ వాయువు (ూచీ+)లో 50శాతం, ద్రవీకృత పెట్రోలియం గ్యాస్ (ూ+)లో 80శాతానిపైగా ఈ మార్గం గుండానే రవాణా అవుతుంది. ఈ నేపథ్యంలో భారత నౌకల రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఇరాన్‌తో పాటు ఇతర సంబంధిత దేశాలతో చర్చిస్తున్నామని జైస్వాల్ తెలిపారు. ఈ చర్చల ఫలితంగానే గత కొన్ని రోజుల్లో ఆరు భారత నౌకలు సురక్షితంగా జలసంధిని దాటగలిగాయని ఆయన వివరించారు. ఈ సంక్షోభంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనూహ్యంగా స్పందించారు. గతంలో జలసంధిని తెరిపించడం తన ప్రాధాన్యత అని చెప్పిన ఆయన, బుధవారం తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్' వేదికగా ప్లేటు ఫిరాయించారు. "మీ చమురు మీరే తెచ్చుకోండి. మీ కోసం మీరు పోరాడటం నేర్చుకోండి. అమెరికా ఇకపై మీకు సహాయం చేయదు" అంటూ యూకే వంటి మిత్రదేశాలకు ఆయన సూచించారు. ఇరాన్‌ను ఇప్పటికే దెబ్బతీశామని, కష్టమైన భాగం పూర్తయిందని ట్రంప్ పేర్కొన్నారు.

మరోవైపు యూకే ప్రధాని కీర్ స్టార్మర్ మాత్రం ఈ విషయంలో వెనక్కి తగ్గలేదు. ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, యూఏఈ సహా 35 దేశాలు సముద్ర భద్రత పునరుద్ధరణకు కలిసి పనిచేయడానికి అంగీకరించాయని

ప్రకటించారు. నౌకాయాన స్వేచ్ఛను పునరుద్ధరించడం, చిక్కుకుపోయిన నౌకలు, సిబ్బంది భద్రతను పటిష్ఠం చేయడం, కీలక సరుకుల రవాణాను తిరిగి ప్రారంభించడం వంటి అంశాలపై ఈ సమావేశంలో చర్చిస్తామని తెలిపారు. యూకే విదేశాంగ కార్యదర్శి వైవెట్ కూపర్ అధ్యక్షతన జరిగే ఈ భేటీ అనంతరం, తదుపరి కార్యాచరణపై అధికారులు చర్చిస్తారని సమాచారం.

# అమెరికా లొంగిపోయేవరకు యుద్ధం కొనసాగుతుంది

- మొదటి పేజి తరువాయి

దెబ్బతీశా మని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై ఇరాన్ ధీటుగా స్పందించింది. ట్రంప్ చెప్పినట్లుగా తమ సైనిక సామర్థ్యాలు దెబ్బతినలేదని పేర్కొంది. అమెరికా అవమానానికి గురై, పశ్చాత్తాపపడి, లొంగిపోయే వరకు ఈ యుద్ధం కొనసాగుతుందని స్పష్టం చేసింది. ఈ మేరకు ఇరాన్ మిలిటరీ కమాండ్ ప్రధాన కేంద్రం అధికార ప్రతినిధి ప్రకటన చేయగా, ఇరాన్ అధికారిక మీడియా ప్రసారం చేసింది. తమ దేశ సైనిక బలం, విస్తృతమైన వ్యూహాత్మక సామర్థ్యాల గురించి అమెరికా నిఘా వర్గాలకు పూర్తి సమాచారం లేదని పేర్కొంది. వ్యూహాత్మక క్షిపణులు, సుదూర లక్ష్యాలను ఛేదించే డ్రోన్లు, అత్యాధునిక గగనతల రక్షణ వ్యవస్థలు, ప్రత్యేక ఆయుధాల ఉత్పత్తి కేంద్రాలతో పాటు సైనిక మౌలిక సదుపాయాలు ధ్వంసం చేశామని ట్రంప్ చేసిన వాదనలను ఇరాన్ ఖండించింది. అమెరికా రాతి యుగం నాటి నేరాలను ఆధునిక యుగానికి తీసుకువస్తోందని ఆరోపించింది. చిన్నారుల హత్యలు, మానవత్వానికి మచ్చతెచ్చే నేరాలకు పాల్పడుతోందని ఆరోపించింది.

# చరిత్రలో ప్రజా రాజధానిగా అమరావతి గుర్తుంటుంది

తెలుగు ప్రజలందరికీ చరిత్రాత్మకమైన రోజు అని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. చరిత్రలో ప్రజా రాజధానిగా అమరావతి గుర్తుంటుందని చెప్పారు. రాజ్యసభలో అమరావతికి చట్టబద్ధత బిల్లును కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానం దరాయ్ ప్రవేశపెట్టారు. అనంతరం చర్చకు ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్ అనుమతించారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌నాయుడు మాట్లాడారు. "అమరావతికి చట్టబద్ధత బిల్లు ప్రవేశపెట్టడాన్ని తెలుగు ప్రజలంతా గర్వంగా భావిస్తున్నారు. సంక్షోభాలను అవకాశాలుగా మలచుకోవడం మా నాయకుడు నేర్పించారు. ఏపీ రాజధాని గురించి

ప్రజలకు స్పష్టత ఇస్తున్నాం. విభజన సమయంలో ఒక రాష్ట్రానికి రాజధాని ఉంది.. మరో రాష్ట్రానికి అలా లేకుండా వదిలేయడంతో సమస్య మొదలైంది. విభజనకు వ్యతిరేకం కాదు కానీ.. జరిగిన విధానం సరిగా లేదు. రాష్ట్ర విభజన దేశంలో తొలిసారి జరగలేదు. వాజ్‌పేయీ హయాంలో 3 రాష్ట్రాలు ఏర్పడ్డాయి. అప్పుడు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విభజన జరిగింది. రాష్ట్ర విభజన సమయంలో ఏపీకి రూ.16వేల కోట్ల రెవెన్యూ లోటు ఉంది. 5 కోట్ల మంది ఏపీ ప్రజలు సీఎం చంద్రబాబు వైపు ఆశగా ఎదురుచూశారు. తెలుగు ప్రజలకు ఆయన ఎన్నో ఆకాంక్షలు, విజన్ కల్పించారు. సంక్షోభాలను

అవకాశాలుగా మలచుకుని ముందుకెళ్లారు. రాజధాని నిర్మాణానికి రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి భూములిచ్చారు. ఆ తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం మూడు రాజధానుల నాటకమాడింది. రాజధాని అమరావతి కోసం ఉద్యమించిన రైతులను తీవ్రంగా హింసించారు. గర్భిణులు అని కూడా చూడకుండా లాఠీలతో కొట్టించారు. అమరావతి మహిళలకు సాష్టాంగ

నమస్కారం చేస్తున్నా. 2014లోనే అసెంబ్లీలో అమరావతిపై ఏకగ్రీవ తీర్మానం జరిగింది. చరిత్రలో ఏ రాజధాని చూసినా నదీ తీర ప్రాంతాల్లోనే విలసిల్లాయి. కృష్ణా నది తీరంలో అమరావతి నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఐకానిక్, వరల్డ్ క్లాస్ రాజధానిగా అమరావతిని తీర్చిదిద్దాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది" అని రామ్మోహన్‌నాయుడు అన్నారు.

# ఫ్యూచర్ సిటీ కార్యాలయం త్వరగా పూర్తి చేయండి..

- మొదటి పేజి తరువాయి

కాగా రంగారెడ్డి జిల్లా మీర్‌ఖాన్‌పేట్‌లో 20 ఎకరాల్లో రు.19 కోట్లతో భారత్ ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సిడిఎ) కార్యాలయానికి గతేడాది సెప్టెంబర్?లో సీఎం రేవంత్ రెడ్డి పునాది రాయి వేశారు. అయితే కేరళం పర్యటన ముగించుకుని వచ్చిన ముఖ్యమంత్రి అనంతరం ఫ్యూచర్ సిటీ నిర్మాణాలను పరిశీలించారు.

# నా పేరు చెప్పి కబ్జాలు, సెటిల్ మెంట్లు చేస్తే కంప్లైంట్ చేయండి

- మొదటి పేజి తరువాయి

ప్రజలకు సేవ చేస్తూ పార్టీకి మంచి పేరు తెచ్చేవారిని ఎప్పుడూ ప్రోత్సహిస్తానని.. కానీ అక్రమాలకు పాల్పడితే మాత్రం కఠిన చర్యలు తప్పవని అన్నారు. ఎవరైనా తన పేరు చెప్పి వేధింపులకు గురిచేస్తే.. భయపడకుండా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆయన ప్రజలను కోరారు. అలాగే, కరీంనగర్‌లోని తన ఎంపీ కార్యాలయ సిబ్బంది దృష్టికి కూడా ఈ విషయాలను తీసుకురావాలని బండి సంజయ్ విజ్ఞప్తి చేశారు.

## తెలంగాణ గ్రూప్-1 అభ్యర్థులకు

# సుప్రీంకోర్టులో చుక్కెదురు..

- మొదటి పేజి తరువాయి

డివిజన్ బెంచ్.. గ్రూప్-1 పరీక్షల్లో అక్రమాలు కనిపించలేదని తీర్పునిచ్చింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ అభ్యర్థులు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తమ వాదనలు పరిగణనలోకి తీసుకోకుండానే హైకోర్టు తీర్పునిచ్చిందని కోర్టుకు వివరించారు. మూడుసార్లు మూల్యాంకనం జరిగిందని టీజీపీఎస్సీ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. అక్రమాలకు తావులేకుండా నియామక ప్రక్రియ చేపట్టినట్లు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇరువైపులా వాదనలు విన్న న్యాయస్థానం పిటిషన్‌ను డిస్మిస్ చేసింది.

# నాడు హైదరాబాద్ అభివృద్ధికి చంద్రబాబు కృషి చేశారు

దూరదృష్టి గల నాయకుడిగా ఆనాడు హైదరాబాద్ అభివృద్ధికి చంద్రబాబునాయుడు కృషి చేశారని, విభజన తర్వాత ఏపీకి అమరావతి రాజధానిగా సంకల్పం తీసుకుని ముందుకు సాగుతున్నారని తెలంగాణ బీజేపీ నాయకుడు, రాజ్యసభ ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ అన్నారు. అమరావతికి ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారని, రెండు రాష్ట్రాల అభివృద్ధికి ఎన్డీయే కట్టుబడి ఉందని అన్నారు. అమరావతి చట్టబద్ధత బిల్లుపై రాజ్యసభలో చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. వికసిత్ ఆంధ్రప్రదేశ్ కోసం వికసిత్ రాజధాని అవసరమని ఆయన అన్నారు. రాజధాని అమరావతి కోసం 29 వేలమంది రైతులు 33 వేల ఎకరాలు ఇచ్చారని గుర్తు చేశారు. భవ్య రాజధాని కోసం ఏపీ ప్రజలు కలలు కన్నారని పేర్కొన్నారు. ప్రధాని మోదీ వికసిత్ భారత్ సంకల్పం సాకారమయ్యేందుకు వికసిత్ ఆంధ్ర నిర్మాణం అవశ్యమన్నారు. రాజధాని అవసరమని, కానీ జగన్ తన హయాంలో మూడు ముక్కలాడి రైతులు, మహిళలను ఇబ్బందులకు గురి చేశారని ఆరోపించారు. రాజధాని కోసం చాలాకాలంగా పోరాడిన మహిళలకు, రైతులకు ఆయన శిరస్సు వంచి నమస్కరిస్తున్నట్లు తెలిపారు. అమరావతి బిల్లు కోసం దేశం మొత్తం ఆసక్తిగా చూస్తోందని అన్నారు. తెలుగు వారికి ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కావాలని నాడు పొట్టి శ్రీరాములు 58 రోజులు నిరాహార దీక్ష చేసినా, నాటి కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించలేదని మండిపడ్డారు. ఆంధ్ర రాష్ట్రం కోసం ఆయన ప్రాణాలు త్యాగం చేశారని అన్నారు. ఆయన మరణానంతరం ప్రభుత్వం స్పందించి ఆంధ్ర రాష్ట్రం ఇచ్చిందని అన్నారు.

# హైదరాబాద్ సహా పలు నగరాల్లోని ఐప్యాక్ కార్యాలయాల్లో ఈడీ సోదాలు

పశ్చిమ బెంగాల్‌లో బొగ్గు స్మగ్లింగ్ కేసుకు సంబంధించి కేంద్ర దర్యాప్తు సంస్థ ఈడీ ప్రముఖ రాజకీయ కన్సల్టెన్సీ ఐప్యాక్ కార్యాలయాల్లో సోదాలు చేపట్టింది. హైదరాబాద్, బెంగళూరు, ఢిల్లీలోని ఐప్యాక్ కార్యాలయాల్లో ఏకకాలంలో ఈడీ అధికారులు సోదాలు చేపట్టారు. ప్రశాంత్ కిషోర్‌కు చెందిన ఐప్యాక్ ప్రస్తుతం పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ కోసం పని చేస్తోంది. ఐప్యాక్ కన్సల్టెన్సీ డైరెక్టర్లలో ఒకరైన రిషిరాజ్ సింగ్‌కు చెందిన ప్రాంగణంపై కూడా దర్యాప్తు సంస్థ దృష్టి సారించింది. బొగ్గు స్మగ్లింగ్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో కొంతకాలంగా సోదాలు జరుగుతున్నాయి. గతంలో బెంగాల్‌లోని ఐప్యాక్ కార్యాలయాలు, ఐప్యాక్ అధినేత ఇళ్లలో ఈడీ సోదాలు నిర్వహించింది. నాడు సోదాల సమయంలో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్వయంగా అక్కడకు వచ్చి, మీడియా ఎదుటే ఫైళ్లతో వెళ్తూ కనిపించడం చర్చకు దారితీసింది. సోదాల సమయంలో బెంగాల్ ప్రభుత్వం నుంచి ఆటంకాలు ఎదురయ్యాయని ఈడీ అప్పుడు ఆరోపించింది. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతోంది. మరోవైపు, మమతా బెనర్జీ కేంద్ర దర్యాప్తు సంస్థ ఆరోపణలను ఖండించింది. సోదాల పేరుతో ఈడీ తన పరిధిని ఉల్లంఘించిందని ఆరోపించారు.

పెన్ పవర్
తెలంగాణ రౌండప్






# 'కమిషనర్-ఏసిపి' సార్..!
# కూల్చినవి కట్టుడేంది..?

## అక్రమ కట్టడాలకు అండగా..!ఉన్నదెవరు..?
## అధికారులా..? అధికారపార్టీ నేతలా..?



శ్రీనివాస్ (ఏసిపి) దుండిగల్ సర్కిల్-59 టౌన్‌ప్లానింగ్ విభాగం అసిస్టెంట్ సిటీ ప్లానర్.

వెంకటేష్ నాయక్.. డిప్యూటీ కమిషనర్.. దుండిగల్ సర్కిల్-59 సిఎంసి..



2026 మార్చి 26న ఇలా కూల్చేసిన టౌన్‌ప్లానింగ్ అధికారులు..

2026 మార్చి 30న కూల్చిన నిర్మాణం మళ్ళీ పూర్తి.. ప్రస్తుత ఫొటో..

-4లో

- అక్రమార్కులు బరితెగిస్తుంటే.. క్రిమినల్ కేసులేవి..?
- ముడుపులు చెల్లిస్తే..! "చట్టాలు-నిబంధనలు" మాయమవుతాయా..?
- చర్యలు ఎప్పుడైనా తాత్కాలికమేనా..? సర్కిల్‌లో శాశ్వత చర్యల దాఖలాలు..?

- దుండిగల్ సర్కిల్-59 సిఎంసి పరిధి నర్సాపూర్ హైవేపై అక్రమ నిర్మాణం..
- అక్రమ సెల్లార్‌తో-అదనపు అంతస్తులు, సెట్‌బ్యాకులు జీరో..!
- ఏసిపి-చైన్‌మెన్‌లు అట్టహాసంగా జనవరి 28న అక్రమ కట్టడం 'సీజ్'..
- టిజి-బిపాస్ చట్టాన్ని ధిక్కరించి పరదాల చాటున యధేచ్ఛగా పనులు..
- మార్చి 26న టౌన్‌ప్లానింగ్ ఏసిపి ఆధ్వర్యంలోనే జేసిబితో కూల్చివేతలు..
- అయినప్పటికీ కూల్చిన నిర్మాణం మార్చి 30 వరకు మళ్ళీ ఎలా పూర్తిచేశారు..?
- మార్చి 31న 'పెన్ పవర్' దినపత్రికలో వార్తా కథనంతో 'కమిషనర్-ఏసిపి' దృష్టికి..
- 'టిజి-బిపాస్' చట్టాన్ని 'నిర్వీర్యం' చేసేది "అధికారులా..? అక్రమార్కులా"..?
- హోదాలు ఉంటే సరిపోతుందా..? విధుల్లోనూ హుందాగా ఉండాలి..!


మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఏప్రిల్ 2: దుండిగల్ సర్కిల్ సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ విభాగంలో అక్రమ నిర్మాణాల నియంత్రణ పక్కనపెట్టి, అక్రమార్కుల భజనలో అధికారులు ఉన్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.. ప్రభుత్వ విధులంటే బాధ్యత లేదు.. టిజి-బిపాస్ చట్టాలంటే విలువలేదు.. అసలు టౌన్‌ప్లానింగ్ చర్యలంటేనే ఇలాగే ఉంటాయా అనిపిస్తుంది.. అక్రమ నిర్మాణాలకు సహకరించడం, అందినకాడికి పుచ్చుకోవడం, ఇదేనా..? సీజ్ చేసిన ఈ అక్రమ నిర్మాణం అంటే అధికారులకు ఎందుకంత ప్రేమ.. పై అధికారులు తమవైపు ఉన్నారనో..! లేక వాళ్ళను శాశించే నాయకులే తమకు అండగా ఉన్నారనే ధీమానో ఏమోకానీ..! టిజి-బిపాస్ చట్టాన్ని, నిబంధనలను, అధికారులే బేఖాతర్ చేస్తున్నారు.. ఇలాంటి అధికార యంత్రాంగం భవిష్యత్తులో మూల్యం చెల్లించుకోక తప్పదనే ఆరోపణలు ఉన్నప్పటికీ..! దీని వెనుక నియోజకవర్గంలో ఓ ముఖ్యనేత సిఫార్సులు ఉన్నట్టు సూసాయగా ఆరోపణలు వస్తున్నాయి.. సదరు నేతకు నిర్మాణ దారుడు "కప్పం" కట్టలేదని మొదట అధికారులపై ఒత్తిడి తెచ్చి ఈ నోటీసులు, సీజింగ్‌లు, కూల్చివేతల డ్రామా కొనసాగిందని, ఆతర్వాత "కప్పం కట్టిన" వెంటనే పనులు చేసుకున్నట్టు ఆరోపణలు గుప్పుమంటున్నాయి.. సదరు అక్రమ నిర్మాణ దారుడు, అంతకు ముందు ఓ బీఆర్ఎస్ నేత పేరును కూడా వాడుకుని, లాభంలేదని, అధికారపార్టీ నాయకుని వైపు మొగ్గు చూపినట్టు ఆరోపణలు వస్తున్నాయి.. ఏ పదవులు లేని కొందరు నేతలుగా చలామని కావడం కొత్తేమి కాదు..! కానీ బాధ్యత గల అధికారులు పనికిమాలిన వాళ్ళకు కూడా ప్రాధాన్యత ఇస్తూ, ప్రమాదకర అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించడంలో అధికారులు ఉత్సాహం చూపిస్తుండటం పలు అనుమానాలను రేకెత్తిస్తుంది..

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# యుద్ధ ప్రాతిపదికన..!
# అక్రమ షెడ్డు నిర్మాణం..

## గండిమైసమ్మ చౌరస్తా సమీపంలోని ఓ బార్ అండ్ రెస్టారెంట్ పక్కనే షెడ్డు..

- సర్కిల్‌లో ముఖ్య అధికారికి ముడుపులు ముట్టినట్టు ఆరోపణలు..?
- ఈ అక్రమ షెడ్డును రాత్రికి రాత్రే పూర్తి చేయాలని శరవేగంగా పనులు..
- షెడ్డుకి అండగా ఉన్న అధికారి సలహా మేరకు దాదాపు 30 మంది కూలీలు..



-4లో

# చట్టంలో డిజిటల్ అరెస్ట్ లేదు..!

## సైబర్ మోసగాళ్ళపట్ల జాగ్రత్తగా ఉండండి..

- భయపడొద్దు.. ఫిర్యాదులు చేయండి..
- అవసరంలేని మొబైల్ యాప్‌లు డౌన్‌లోడ్ చేయకండి..



-5లో

- మేడ్చల్ పట్టణంలో పోలీసుల అవగాహనపై స్పెషల్ డ్రైవ్..
- భయపెట్టే కాల్స్‌కి లొంగొద్దని పోలీసుల హెచ్చరిక..

# 'కమిషనర్-ఏసిపి' సార్..! కూల్చినవి కట్టుడేంది..?







## 200 ఫీట్ల హైవేపై..రెసిడెన్షియల్ పర్మిషన్..?

దుండిగల్ సర్కిల్ పరిధి గండిమైసమ్మ నుండి ఔటర్ రింగ్ రోడ్డుకు వెళ్ళే దారిలో, తాజా హోటల్ సమీపంలోని ఈ భారీ నిర్మాణం నర్సాపూర్ హైవే 200 ఫీట్ల వెడల్పుతో ఉన్న రహదారిపై కమర్షియల్ కాంప్లెక్స్ స్థలం.. అయినప్పటికీ అధికారులు రెసిడెన్షియల్ అనుమతులు జారీచేశారు.. సదరు నిర్మాణ దారుడు సుమారు 200 గజాల్లో "స్టిల్ట్+2" అంతస్తులకు రెసిడెన్షియల్ పర్మిషన్ మాత్రమే అధికారులు మంజూరు చేసినట్టు తెలుస్తుంది.. దుండిగల్ సర్కిల్‌లో ఎప్పుడైనా ఎక్కడైనా "అనుమతులకు- నిర్మాణానికి" పొంతన ఉండదు.. ఈ నిర్మాణంలోనూ అదే జరిగింది.. అధికారులకు తెలియకుండా అనుకుంటే పొరపాటే అవుతుంది.. వందశాతం టౌన్‌ప్లానింగ్ "అధికారులు-చైన్‌మెన్‌ల" కనుసన్నల్లోనే నిర్మాణం విజయవంతం అయిందని స్పష్టమవుతుంది..







2026 జనవరి 28న టౌన్‌ప్లానింగ్ అధికారులు బిల్డింగ్ సీజ్..ఫైల్‌ఫోటో..

## అక్రమ సెల్లార్‌తో.. అదనపు అంతస్తులు..

అక్రమ సెల్లార్ తవ్వుతుంటే పట్టణ ప్రణాళిక అధికారులు నియంత్రించలేక పోయారు..! ఆతర్వాత నిర్మాణం చేపడుతుంటే, పనులు నిలిపివేయలేక పోయారు కారణం..? "డిప్యూటీ కమిషనర్-టౌన్‌ప్లానింగ్ ఏసిపి" చెప్పాలి.. అదనపు అంతస్తులు రాత్రికి రాత్రే నిర్మించారా..? నిర్మాణ సమయంలో అడ్డుకోకుండా ఎందుకు సహకరించారు..? దుండిగల్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు, అంతా పూర్తయ్యాక " షోకాజ్ నోటీసులు- సీజింగ్‌లు"- కూల్చివేతలు..! ఇదంతా అధికారుల డ్రామాలో భాగం కాదా..? అక్రమ సెల్లార్ తవ్వినపుడే పనులు ఎందుకు నిలిపి వేయలేదు..? నిర్మాణం ప్రారంభించినప్పుడే కుదుర్చుకున్న ఒప్పందంలో భాగమేనని స్థానికులు ఆరోపిస్తున్నారు.. అందుకే పూర్తయ్యాక చర్యల డ్రామా షురూ చేశారు.. ఇంతకీ ఈ నిర్మాణం "అక్రమమా..? సక్రమమా"..? దుండిగల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్..! టౌన్‌ప్లానింగ్ "అధికారి అసిస్టెంట్ సిటీ ప్లానర్" ఇద్దరు సమాధానం చెప్పాలి.. టిజి-బిపాస్ చట్ట ప్రకారమే నోటీసులు జారీ.. నిబంధనల అతిక్రమణపై సీజ్, చర్యలు చేపట్టారు.. అయినప్పటికీ సెల్లార్, సెట్‌బ్యాకులు, అదనపు అంతస్తులు అన్నీ అలాగే ఉన్నాయి.. చర్యలతో ఒరిగిందేంటి..? అదనపు అంతస్తులు నేలమట్టం చేశారా..? అక్రమ సెల్లార్ పూడ్చేశారా..? ఇప్పుడు ఈ భవనం అక్రమమా..? సక్రమమా..? అనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి.. టిజి-బిపాస్ చట్టంలోనే లొసుగులు ఉన్నాయా..? సంబంధిత ఉన్నతాధికారులే తేల్చాల్సి ఉంది..

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన టిజి-బిపాస్ చట్టం, కఠినమైన సెక్షన్‌లు, నిబంధనలతో రూపొందించిన ఈ చట్టం.. టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారుల చేతిలో అబాసు పాలవుతోంది.. ప్రారంభంలోనే గుర్తించిన అధికారులు తమ చేతివాటానికి అడ్డంకిగా మారిందని, హైకోర్టు ఆదేశాలు, 2 నోటీసుల ప్రక్రియతో చట్ట సవరణలు చేశారు.. అప్పటి నుండే టిజి-బిపాస్ చట్టంపై నిర్లక్ష్యం వహించి, క్షీణించే దశకు చేరుకుంది.. కొందరు అవినీతి టౌన్‌ప్లానింగ్ అధికారులు చెప్పే సమాధానం ఔరా అనిపిస్తుంది.. ఇందులో క్రమబద్ధీకరణ ఉందట.. అక్రమ నిర్మాణాలకు మొదట సహకరించడం ఆతర్వాత, క్రమబద్ధీకరణ పేరుతో చర్యలకు స్వస్తి పలకడం.. క్రమబద్ధీకరణ ప్రమాదాలను అరికడుతుందా..? 33 శాతం ఫీజు చెల్లిస్తే అక్రమ సెల్లార్, అదనపు అంతస్తులు కుంగిపోతాయా.. హైవే ఎఫెక్ట్‌లో ఉంటే బిల్డింగ్ పక్కు జరుగుతుందా..? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి..

---

- సర్కిల్‌లో ముఖ్య అధికారికి ముడుపులు ముట్టినట్టు ఆరోపణలు..?
- ఈ అక్రమ షెడ్డును రాత్రికి రాత్రే పూర్తి చేయాలని శరవేగంగా పనులు..
- షెడ్డుకి అండగా ఉన్న అధికారి సలహా మేరకు దాదాపు 30 మంది కూలీలు..

**దుండిగల్, పెన్ పవర్, ఏప్రిల్ 2:** దుండిగల్ సర్కిల్-59 సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వందలాది అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోకుండా, అక్రమ మార్కులకు సహకరిస్తున్న సంబంధిత అధికారులపై విమర్శలు తలెత్తుతుండగా..! వాటిని తలతన్నే విధంగా అక్రమ భారీ షెడ్ల నిర్మాణాలు కుప్పలు తెప్పలుగా వెలుస్తున్నాయి.. గండిమైసమ్మ చౌరస్తా సమీపంలో తాజాగా ఓ అక్రమ షెడ్డు నిర్మాణం శరవేగంగా పనులు సాగుతున్నాయి.. ఎలాగైనా రాత్రికి రాత్రే షెడ్డు నిర్మాణం పూర్తిచేయాలనే దృఢ సంకల్పంతో దాదాపు 30 మంది భవన నిర్మాణ కూలీలను పెట్టి, పూర్తి చేయడానికి పనులు జరుగుతున్నాయని స్థానికులు పెన్ పవర్ కు ఫొటోలు పంపించారు.. సంబంధిత నిర్మాణ దారులు అటు పొలిటికల్‌గా, ఇటు అధికారుల వద్ద పలుకుబడి ఉన్న ఓ బార్ అండ్ రెస్టారెంట్ నిర్వాహకులుగా స్థానికులు ఆరోపిస్తున్నారు.. ఈ అక్రమ షెడ్డుకు సర్కిల్‌లోని ముఖ్య అధికారితో కూడా ఒప్పందం కుదుర్చుకున్నట్టు సమాచారం..



గండిమైసమ్మ చౌరస్తాలో అక్రమ షెడ్డు నిర్మాణంలో శరవేగంగా పనులు..

# యుద్ధ ప్రాతిపదికన..! అక్రమ షెడ్డు నిర్మాణం






## గండిమైసమ్మ చౌరస్తా సమీపంలోని ఓ బార్ అండ్ రెస్టారెంట్ పక్కనే షెడ్డు..

ఏదిఏమైనప్పటికీ ఇప్పటికే టిజి-బిపాస్ చట్టం "నోటీసులు-సీజింగ్‌లు, పోరు పడలేక అడపాదడపా కూల్చివేతలు.. ఇదంతా ఉన్నతాధికారులకు చూపించుకోవడానికి నివేదికల కోసమే అన్నట్టు తయారైంది.. దుండిగల్ సర్కిల్ ఎనిమిదేళ్ళ చరిత్రలో టిజి-బిపాస్ చట్టం కేవలం అధికారుల అక్రమార్జనకే పరిమితమైందనే ఆరోపణలు కూడా ఉన్నాయి..ఈ అక్రమ కట్టడాల వ్యవహారంలో జరుగుతున్న పరిణామాలు అందుకు స్పష్టతను ఇస్తున్నాయి.. అధికారులు ఎన్ని జిమ్మిక్కులు చేసినా..? టిజి-బిపాస్ చట్టం అక్రమార్కులకే అనుకూలంగా మారడంలో అధికారులే కీలక పాత్రను పోషించడం గమనార్హం.. అధికారుల నిర్లక్ష్యానికి చట్టమే మౌనం వహిస్తుందే కానీ.. అక్రమ నిర్మాణాలు అలాగే ఉంటున్నాయి.. నోటీసులు, సీజింగ్‌లు, పాక్షిక కూల్చివేతలు ఇవన్ని అధికారుల చేతివాటం కోసమేనని తేటతెల్లం చేస్తుంది.. నిర్మాణం చేపడుతుంటే, ఒప్పందం ప్రకారం చేతులు ముడుచుకుని కూర్చుంటారు.. అంతా ముగిసాక ఏమి ఎరుగనమ్మా అన్నట్టు, తెరపైకి " షోకాజ్ నోటీసులు- సీజింగ్‌ల డ్రామా- అదీ మీరితే కూల్చివేతల నాటకం ఉండనే ఉంది కాదా..! ఆ కూల్చివేత కూడా ఏదో ఐదు వేలు ఖర్చుకు లోబడి ఉండేటట్లు చాలా పద్ధతిగా కూల్చడంలో టౌన్‌ప్లానింగ్ అధికారులు సిద్ధహస్తులు.. కావాలంటే రెండు రోజుల్లో పాఠకులకు తెలుస్తుంది.. బహుదూర్‌పల్లి షెడ్డు తరహాలోనే దీనికి ముడుపులు ముట్టాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

# యువత సమస్యలపై నిరంతర పోరాటం ఏఐ వైఎఫ్

హైదరాబాద్ పెన్ పవర్: ఖమ్మం జిల్లా చింత ాని మండలం కోడుమూరు గ్రామంలో అఖిలభారత యువజన సమాఖ్య ాఅఎట గ్రామ శాఖ మహాసభాఅఎట మండల నాయకులు బోళ్ల భాను అధ్యక్షతన యువజన సంఘం జిల్లా మాజీ నాయకులు కూచిపూడి రవి ఇంటిదగ్గర జరిగింది,ాఅఎట యువజన సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బూరి మహేష్ మాట్లాడుతూ భవిష్యత్తులో యువత సమస్యలపై బలమైన పోరాటాలు నిర్వహిస్తామని చెప్పారు, యువకులు బెట్టింగ్ యాప్ల పట్ల దూరంగా ఉండాలని కోరారు, ఈ యాప్ల వల్ల జీవితాలు పోతున్నాయని, కుటుంబాలు చిన్నాభిన్న అవుతున్నాయని అన్నారు, ఈ కార్యక్రమంలో జిల్లా యువజన సమాఖ్య సహాయ కార్యదర్శి చింతల రమేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శి మద్దోజు శ్రావణ్, కోశాధికారి కొల్లి రవి, మాజీ యువజన నాయకులు నీరుడు గోవిందరావు, నక్కనబోయిన కృష్ణ, నారపోగు నాగార్జును, తదితరులు

పాల్గొన్నారు... గ్రామ యువజన సమాఖ్య అధ్యక్షులుగా గాడుదుల అనిల్, కార్యదర్శిగా కూచిపూడి సందీప్, 9 మంది కమిటీ సభ్యులు నూకల సాయి, కోటగిరి సైదారావు, నక్కన బోయిన ప్రవీణ్, రాజేష్, కాంపల్లి నవీన్, నారపోగు అశోక్, చిట్టి మోదు నవీన్, పవన్ చారి, రేగళ్ల రామ కృష్ణ ఏకగ్రీవంగా ఎంపిక చేయడం జరిగింది




02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి



మోసాల పట్ల, బ్యానర్ ప్రదర్శించి మేడ్చల్ పోలీసుల అవేర్‌నెస్ ప్రోగ్రామ్..

# చట్టంలో డిజిటల్ అరెస్ట్ లేదు..!

## సైబర్ మోసగాళ్లపట్ల జాగ్రత్తగా ఉండండి..

కిరణ్ కుమార్.. క్రైమ్ ఇన్‌స్పెక్టర్.. మేడ్చల్ పోలీస్ స్టేషన్..



మేడ్చల్ పట్టణంలో అవగాహన కార్యక్రమంలో భాగంగా స్పెషల్ డ్రైవ్..

- భయపడొద్దు.. ఫిర్యాదులు చేయండి..
- అవసరంలేని మొబైల్ యాప్‌లు డౌన్‌లోడ్ చేయకండి..
- మేడ్చల్ పట్టణంలో పోలీసుల అవగాహనపై స్పెషల్ డ్రైవ్..
- భయపెట్టే కాల్స్‌కి లొంగొద్దని పోలీసుల హెచ్చరిక..

పొరపాటున సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని డిఐ కిరణ్ సూచించారు. అలాగే అవసరం లేని, అనుమానాస్పద అప్లికేషన్లు మొబైల్ ఫోన్లలో డౌన్‌లోడ్ చేయకుండా జాగ్రత్తలు పాటించాలని ప్రజలకు సూచించారు.. ఈ కార్యక్రమంలో సబ్ ఇన్‌స్పెకర్ నవీన్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ శక్రులాల్, కానిస్టేబుళ్లు శ్యామ్ చౌహన్, పూజిత, అక్షర, రాజు పాల్గొన్నారు..

**మేడ్చల్, పెన్ పవర్, ఏప్రిల్ 2:** డిజిటల్ అరెస్టు పేరుతో జరుగుతున్న సైబర్ మోసాలపై మేడ్చల్ నేర విభాగం పోలీసులు అప్రమత్తమయ్యారు.. మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, మోసగాళ్ల కొత్త పద్ధతులపై హెచ్చరికలు జారీ చేశారు.. ఈ సందర్భంగా మేడ్చల్ డీఐ కిరణ్ మాట్లాడుతూ "డిజిటల్ అరెస్టు" అనే పదం చట్టంలో ఎక్కడా లేదని స్పష్టం చేశారు.. సైబర్ మోసగాళ్లు ఈ పేరుతో ప్రజలను భయపెట్టి డబ్బులు దోచుకుంటున్నారని, ఇలాంటి కాల్స్ వచ్చినా భయపడకూడదని సూచించారు.. పోలీసు అధికారులు యూనిఫామ్‌లో డిజిటల్ అరెస్టులు చేయరని, అలాంటి ప్రక్రియ చట్టబద్ధం కాదని వెల్లడించారు.. తక్కువ ధరల ఆశ చూపిస్తూ వాహనాలు, మొబైల్ ఫోన్లు అమ్ముతామని ముందుగానే డబ్బులు అడిగితే చెల్లించవద్దని సూచనలు చేశారు.. నేరుగా వస్తువులు చూసి కొనుగోలు చేయడం ద్వారానే మోసాల నుంచి తప్పించుకోవచ్చని మేడ్చల్ క్రైమ్ విభాగం ఇన్‌స్పెక్టర్ కిరణ్ తెలిపారు..

# మహిళా సాధికారతకు చేదోడుగా ఉచిత బస్సు సౌకర్యం

- పేద కుటుంబాల ఉపాధికి ఊతమిచ్చిన ఉచిత ప్రయాణం
- ఆర్థిక స్వాలంబన దిశగా మహిళల అడుగులు
- శ్రమశక్తికి వెన్నుదన్నుగా నిలుస్తున్న ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం
- ప్రతిరోజూ 35 లక్షల మంది మహిళలకు లబ్ధి
- రాష్ట్రవ్యాప్తంగా 290 కోట్లకు చేరిన జీరో ఛార్జీ టిక్కెట్లు
- ఉచిత ప్రయాణంతో మహిళలకు రూ. 10,000 కోట్ల ఆదా
- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు

పెన్ పవర్: భద్రాద్రి కొత్తగూడెం ఏప్రిల్ 02మహిళా సాధికారతకు చేదోడుగా ఉచిత బస్సు సౌకర్యం ఎంతగానో తోడ్పడుతుందని, ఈ పథకం పేద కుటుంబాల ఆర్థికాభివృద్ధికి బాటలు వేసిందని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఎన్నికల హామీ ఆరుగ్యారెంటీల్లో భాగంగా మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన నేపథ్యంలో, గురువారం కొత్తగూడెం ఆర్టీసీ బస్టాండు ఆవరణలో '99 రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక' సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం మహిళల ఆర్థిక స్వాలంబన దిశగా గొప్ప అడుగు అని, నిత్యం కష్టపడే శ్రమశక్తికి ఇది వెన్నుదన్నుగా నిలుస్తుందని ఆయన కొనియాడారు. ఈ సౌకర్యం వల్ల మహిళలు తమ పనుల నిమిత్తం ప్రయాణించేటప్పుడు ఛార్జీల భారం తగ్గి, ఆ మొత్తాన్ని కుటుంబ అవసరాలకు వినియోగించుకుంటున్నారని తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు కూడా ఈ పథకం ఎంతగానో దోహదపడుతుందని, నిత్యం విధులకు వెళ్లే వారికి ఇది పెద్ద ఊరటనిస్తోందని ఆయన పేర్కొన్నారు. ప్రతి రోజూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 35 లక్షల మంది మహిళలు ఈ ఉచిత బస్సు సౌకర్యాన్ని వినియోగించుకుంటున్నారని వివరించారు. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 290 కోట్ల జీరో ఛార్జీ టిక్కెట్లు నమోదయ్యాయని, దీనివల్ల మహిళలకు సుమారు రూ.




10,000 కోట్ల మేర ప్రయాణ ఖర్చులు ఆదా అయ్యాయని వెల్లడించారు. ఈ పథకం మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపిందని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంత మహిళలకు

# శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చర్యలు

**కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం**



**కరీంనగర్, పెన్ పవర్ ఏప్రిల్ 02:** కమీషనరేట్ పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణ చర్యల దృష్ట్యా నియమ నిబంధనలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. సంబంధిత ఏసీపీ ల నుంచి అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులను నిర్వహించకూడదని తెలిపారు. అనుమతులు లేకుండా ఎటువంటి సభలు సమావేశాలు,ర్యాలీలు నిర్వహించకూడదని సంబంధిత అధికారుల నుండి అనుమతులు తప్పనిసరి అని తెలిపారు అనుమతుల కోసం దరఖాస్తు చేయడం ద్వారా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అట్టి కార్యక్రమానికి తగిన విధంగా పోలీసు శాఖ భద్రతాపరమైన చర్యలు చేపడుతుంది అన్నారు. ఈ చట్టం అమలులో ఉండగా ఇతరులను గాయపరిచే విధంగా ఉండే వస్తువులు, మారణాయుధాలను ధరించి సంచరించకూడదు. రోడ్లు, ప్రజలకు ఉపయోగపడే ఇతర స్థలాల్లో జనాన్ని సమీకరించకూడదు.జన సంచారం మరియు అనుమతి పత్రాలలో పేర్కొన్నబడిన ప్రాంతాలలో మ్యూజిక్ లు, పాటలు, ప్రసంగాలు, రణగొణ ధ్వనులు చేయవద్దని కోరారు. ఈ ఉత్తర్వులు ఈనెల 30 వరకు అమల్లో ఉంటాయని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడే వారిపై హైదరాబాద్ నగర పోలీస్ చట్టం, 1348 ఫసలీ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని కరీంనగర్ పోలీస్ కమీషనర్ తెలిపారు.

# అత్యవసరం అయితేనే బయటకు రావాలి డాక్టర్ హనుమంతరావు



**గార్ల, పెన్ పవర్ ఏప్రిల్ 02:** వేసవి కాలం భానుడి భగభగలతో రోజురోజుకు ఎండ తీవ్రత పెరుగుతున్న క్రమంలో స్థానిక ప్రజలు పలు జాగ్రత్తలు పాటించాలని కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ హనుమంతరావు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఎండ తీవ్రత పెరుగుతున్నందున ప్రజలు అనవసరంగా బయటకు వెళ్లకూడదని సూచించారు . అత్యవసర పరిస్థితులలో బయటకు వెళ్ళాల్సి వస్తే తెల్లని కాటన్ దుస్తులను ధరించి, తల మీద క్యాప్ పెట్టుకోవాలని, తప్పనిసరిగా గొడుగు వాడాలన్నారు, ఎక్కువగా మంచి నీళ్లను, పండ్ల రసాలు , ఉప్పు కలిపిన మజ్జిగ, ఓ ఆర్ ఎస్ వంటి పనియాలను సేవించాలన్నారు,
వడదెబ్బకు గురైన వెంటనే చల్లని ప్రదేశాలకు తరలించి, తడి గుడ్డతో శరీరాన్ని తుడిచి, చల్లటి ఫ్యాన్ గాలికి ఉంచాలని.
ఆరోగ్య పరిస్తితి విషమిస్తే వెంటనే అందుబాటులో ఉండే పి హెచ్ సి లేదా సివిల్ ఆసుపత్రికి తరలించి చికిత్స పొందాలన్నారు.ఏదైనా అత్యవసర వైద్య సహాయం కొరకు 108 ని సంప్రదించాలని ఆయన కొరారు.

# బహుజన ధీరత్వానికి ప్రతీక సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్: ఎమ్మెల్యే మేఘారెడ్డి

**గౌడల కోసం ఎకరా స్థలంలో సామూహిక భవనం నిర్మాణం**



**హైదరాబాద్ పెన్ పవర్:** బహుజన ధీరత్వానికి ప్రతీకగా నిలిచిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ గెరిల్లా యుద్ధ విధానంతో గోల్కొండ కోటపై జెండా ఎగరవేసి, బహుజనుల అభివృద్ధికి విశేషంగా కృషి చేశారని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తెలిపారు.సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి సందర్భంగా వనపర్తి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, మొఘల్ పాలకులు మరియు జమీందారుల అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన పాపన్న గౌడ్ పేదలు, బహుజనుల రక్షకుడిగా నిలిచారని కొనియాడారు. ఆయన ఆశయాలను సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.వనపర్తి జిల్లా కేంద్రంలో గౌడ సోదరుల సౌకర్యార్థం ఒక ఎకరా స్థలంలో సామూహిక భవనం నిర్మాణం చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు.
ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, జిల్లా అదనపు కలెక్టర్ కిమ్యా నాయక్, మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, పట్టణ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

# రేషన్ షాపు ను ఏర్పాటు చేయాలి



**గార్ల, పెన్ పవర్ ఏప్రిల్ 02:** గార్ల మండల కేంద్రంలోని స్థానిక పినిరెడ్డిగూడెం పంచాయతీ లో నూతన రేషన్ షాపును ఏర్పాటు చేయాలని సిపిఎం మండల నాయకులు వంగూరి వెంకటేశ్వర్లు, చింత ఎల్లయ్య, గ్రామశాఖ కార్యదర్శి వంగూరి కొండయ్య లు డిమాండ్ చేశారు.పినిరెడ్డిగూడెం గ్రామం లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సిపిఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో గురువారం ప్రజాపాలన గ్రామసభలో సర్పంచ్ కేలోత్ వీరన్న,అధికారులు జి. లలిత, రాజ్యలక్ష్మి లకు వినతిపత్రం అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్మశాన వాటికలోను, పోచారం క్రాస్ రోడ్డు నుండి గ్రామం వరకు స్తంబాలు వేసి,వీధి లైట్లు ఏర్పాటు చేయాలని,వేసవిలో మంచినీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, గ్రామంలో అవసరమైన చోట సీసీ రోడ్లు,డ్రైనేజీ లు, విద్యుత్ స్తంభలు నిర్మించాలని డిమాండ్ చేశారు. రైతుల పంటలకు,వృద్ధులు,చిన్నపిల్లలకు తీవ్ర సమస్యగా ఉంటున్న కోతులు, వీధి కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రెండో విడతలో ఇందిరమ్మ ఇళ్లు, ఇతర సంక్షేమ పథకాలు పార్టీలకు అతీతంగా అందించాలని డిమాండ్ చేశారు.స్థానిక హెల్త్ సెంటర్లో పూర్తిస్థాయిలో వైద్య సిబ్బందిని నియమీశిచి వైద్యం సేవలు అందించాలని కోరారు. గ్రామంలో ప్రధాన సెంటర్ లో ఉన్న సెంట్రల్ లైటింగ్ సిస్టం మరమ్మత్తులకు గురి కావడంతో ప్రధాన సెంటర్ లో చీకట్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే స్పందించిన పంచాయతీ కార్యదర్శి లలిత స్మశాన వాటికలో లైటింగ్ ఏర్పాటు చేసేశీదుకు తీర్మానం చేశారు. ఈ కార్యక్రమం లో నాయకులు, గ్రామస్తులు యం. కొండయ్య,డి. రమేష్,బిఆర్ ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు బి. లక్ష్మారెడ్డి,ఉప సర్పంచ్ బి. కొండల్ రావు,మంగీలాల్,సాయిలు,దుర్గయ్య, తదితరులు ఉన్నారు

# ఏన్కూర్‌లో బ్యాంకులకు టోకరా

**గోల్డ్ అప్రైజర్‌తో కుమ్మక్కై భారీ మోసం...నలుగురు అరెస్ట్**

**రూ. 9.53 లక్షల బ్యాంకు రుణం కాజేసిన ముఠా**

**బ్యాంకు వేలంలో బయటపడిన నకిలీ బంగారం**







**హైదరాబాద్ పెన్ పవర్:** కల్లూరు డివిజన్ పరిధిలోని ఏన్కూర్ పోలీస్ స్టేషన్ హద్దుల్లో నకిలీ బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టి బ్యాంకు రుణాలు పొందిన నలుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ విషయాన్ని కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ తెలిపారు.
తెలంగాణ గ్రామీణ బ్యాంకు, ఏన్కూర్ శాఖ నిర్వాహకుడు కె.వి. ప్రశాంత్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో భాగంగా 2024 సంవత్సరంలో బంగారు ఆభరణాల విలువ నిర్ధారించే అధికారి (గోల్డ్ అప్రైజర్) శ్రీపాది సతీష్, శ్రీపాది మౌనిక, రామచంద్రోజు జయమ్మ, రామచంద్రోజు నరేష్‌లు కలిసి సుమారు 242.25 గ్రాముల నకిలీ బంగారు ఆభరణాలను అసలైనవిగా చూపించి రూ. 9,53,000 విలువైన రుణాలను పొందినట్లు పోలీసులు గుర్తించారు.
తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించకపోవడంతో సంబంధిత ఖాతాలు నిరర్థక ఆస్తులుగా (ఛీఫూం) మారాయి. అనంతరం బ్యాంకు అధికారులు వేలం ప్రక్రియ చేపట్టగా తాకట్టు పెట్టిన ఆభరణాలు నకిలీవని బయటపడింది. దీంతో బ్యాంకు అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.
ఈ కేసులో నిందితులైన శ్రీపాది సతీష్, రామచంద్రోజు జయమ్మ, రామచంద్రోజు నరేష్‌లను పోలీసులు అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు. మరో నిందితురాలు శ్రీపాది మౌనిక పరారీలో ఉన్నట్లు సమాచారం.
ఇలాంటి మోసపూరిత చర్యలకు పాల్పడిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని ఏసీపీ వసుంధర యాదవ్ హెచ్చరించారు. ప్రజలు బ్యాంకింగ్ లావాదేవీల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# ప్రభుత్వ పథకాలును సద్వినియోగం చేసుకోండి



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రభుత్వ పథకాలును సద్వినియోగం చేసుకోండి అనినాగులవంచ సర్పంచ్ నారగానిరాంబాయి,మత్కేపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటివెంకటేశ్వరరావు అన్నారు.నాగులవంచ గ్రామ రైతు వేదికలో ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక పై గ్రామ సభ నిర్వహించడం జరిగింది. సభనుఉద్దేశించి ప్రజా ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించిరెండుసంవత్సరాల్లో మూడు నెలలు పూర్తయింది. ఆర్థిక సవాళ్లు అధిగమిస్తూ గత పాలకులు తప్పిదాలను సరిచేస్తూ సంక్షేమ అభివృద్ధి విషయంలో రాజీ పడకుండా మన ప్రభుత్వం పని చేస్తుంది. మేము పాలు కులం కాదు సేవకులం అనే నినాదంతో మహాలక్ష్మి పథకం. ఉచిత బస్సు సౌకర్యం. 500 కే గ్యాస్ సిలిండర్,200 యూనిట్లు వరకు ఉచిత విద్యుత, ఆరోగ్యశ్రీ. రేషన్ కార్డులు, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇల్లు, మహిళా సాధికారత వంటి పథకాలు, ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం,ప్రజా ప్రభుత్వం సేవా భావంతో పనిచేస్తుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సెక్రెటరీ బుద్దే చిరంజీవి, ఉప సర్పంచ్ అంబటి శరత్, మాజీ సర్పంచ్ కంభం వీరభద్రం,గ్రామ వార్డు మెంబర్లు,గ్రామ పెద్దలు ఆలస్యం బసవయ్య, నారగాని శ్రీనివాసరావు, అంబటి శాంతయ్య,ఆలస్యం రవి, వంకాయలపాటి లచ్చయ్య,తోటకూరి వెంకటనరసయ్య,కోలేటి నాగేశ్వరరావు,గార్లపాటి కాంతారావు,కోలేటి పెద్ద బ్రహ్మయ్య, పడిశాల ఆనందరావు,ఆలస్యం శ్రీను, అబాల వెంకన్న, కదిమళ్ళ రామారావు,ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య అధికారి వేణు, సూపర్వేజర్ కృష్ణరావు, సొసైటీ సీఈవో శ్రీనివాసరావు, హాస్టల్ వార్డెన్ వెంకటేశ్వరరావు,అంగన్వాడీ టీచర్స్,ఐకెపి సభ్యులు ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు,వివిధ రాజకీయ పార్టీనాయకులు,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# వల్మీడీ గ్రామంలో హనుమాన్ జయంతి వేడుకలు...

వల్మీడి గ్రామం అంతా కాషాయపు జెండాలా తో యూవత బైక్ ర్యాలీ...



**పాలకుర్తి ఏప్రిల్ 02 పెన్ పవర్:** జనగామ జిల్లా పాలకుర్తి మండల్ వల్మీడీ గ్రామంలో హనుమాన్ జయంతి వేడుకలు. ఈ వేడుకలలో గ్రామానికి చెందిన యువత మరియు గ్రామపంచాయతీ పెద్దలు పది రోజులు పాల్గొన్నారు.

# టేకులకుంట తండా కార్యదర్శి కి సన్మానం..



**పెన్ పవర్: నెక్కొండ** టేకుల కుంట తండా గ్రామ పంచాయతీలో ప్రజా-పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ పంచాయతీ కార్యదర్శి రమేష్,సర్పంచ్ విజయ ఆధ్వర్యం లో అతిథులుగా ఏఈఓ రాజేష్ సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి ప్రభుత్వ పథకాల అమలు, గ్రామ ప్రజలకు అందుతున్న సంక్షేమ కార్యక్రమాల పై చర్చించారు.గ్రామంలో ప్రజా సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు.అనంతరం నూతనంగా ఎన్నికైన టేకులకుంట తండా కార్యదర్శి రమేష్ కి సర్పంచ్ విజయ,ఉపసర్పంచ్ లత,వార్డ్ మెంబర్ భూక్యా మమత లకు ఉపాధ్యాయులు యాకుబ్ సన్మానం చేయడం జరిగింది.గ్రామ అభివృద్ధికి ప్రజలు మరియు అధికారులు కలిసి పనిచేయాలని ఈ సందర్భంగా తెలిపారు. గ్రామ ప్రజలు కూడా కార్యక్రమంలో పాల్గొని తమ సమస్యలను తెలియజేశారు.

# చుంచుపల్లి పోలీస్ స్టేషన్ ను సందర్శించిన ఎస్పీ

సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను నిత్యం అప్రమత్తం చేస్తూ ఉండాలి



**భద్రాద్రి కొత్తగూడెం పెన్ పవర్: ఏప్రిల్ 2 :**జిల్లా ఎస్పీ రోహిత్ రాజు గురువారం చుంచుపల్లి పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు.అనంతరం అక్కడ ఉన్న పోలీస్ అధికారులు,సిబ్బందికి పలు సూచనలు చేశారు.పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని,వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్కు వచ్చే బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా బాధ్యతగా మెలగాలని
సూచించారు.అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు.పోలీస్ స్టేషన్లో పనిచేసే అధికారులు సిబ్బంది సమస్యలను అడిగి
తెలుసుకున్నారు.అనంతరం చుంచుపల్లి పోలీస్ స్టేషన్ పైన ఉన్న డిస్ట్రిక్ట్ సైబర్ క్రైమ్స్ కో-ఆర్డినేషన్ సెంటర్ ను సందర్శించారు.ఇప్పటివరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో నమోదైన సైబర్ నేరాల వివరాలను అట్టి కేసుల పురోగతిని గురించి అడిగి తెలుసుకున్నారు.ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా జిల్లాలోని పోలీసు అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం పాటిస్తూ అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని సైబర్ క్రైమ్ కో-ఆర్డినేషన్ సెంటర్ అధికారులకు సూచించారు.కంటికి కనపడకుండా ఆన్లైన్ ద్వారా సైబర్ నేరగాళ్లు చేస్తున్న మోసాలను ఎప్పటికప్పుడు ప్రజలకు వివరించేలా కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు.సైబర్ నేరాల బారిన పడకుండా జిల్లా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్త చేస్తూ విస్తృతస్థాయిలో ప్రచారం చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్పీ ఆదినారాయణ,సైబర్ క్రైమ్స్ డిఎస్పీ అశోక్,సీఐ జితేందర్,చుంచుపల్లి ఎస్సైలు రవి,ఉమ మరియు ఎస్సై జుబేదా,సిబ్బంది పాల్గొన్నారు.

# రోజుకు 15 కోట్ల పౌల్ట్రీ వ్యాపారం నష్టం

**హైదరాబాద్, ఏప్రిల్ 2, పెన్ పవర్:**
హైదరాబాద్ మహానగరంలో చికెన్ ప్రియులకు పెద్ద షాక్ తగిలింది. నగరంవ్యాప్తంగా వందలాది చికెన్ షాపులు స్వచ్ఛందంగా మూతపడటంతో మాంసం విక్రయాలు పూర్తిగా నిలిచిపోయాయి. సాధారణ రోజుల్లోనూ కిటకిటలాడే చికెన్ సెంటర్లు వెలవెలబోవడానికి ప్రధాన కారణం రిటైల్ వ్యాపారులకు, హోల్‌సేల్ సరఫరాదారులకు మధ్య తలెత్తిన మార్జిన్ వివాదం . తమకు వస్తున్న లాభం నామమాత్రంగా ఉందని, పెరిగిన ఖర్చులకు అనుగుణంగా మార్జిన్ పెంచకపోతే వ్యాపారం చేయలేమని రిటైలర్లు సమ్మెకు దిగారు.ఈ వివాదానికి ప్రధాన కేంద్రం చికెన్ విక్రయాలపై వచ్చే కమిషన్. ప్రస్తుతం బాయిలర్ కంపెనీలు రిటైల్ షాపుల యజమానులకు కిలోకు కేవలం రూ. 5 నుండి రూ. 7 వరకు మాత్రమే మార్జిన్ ఇస్తున్నాయి. అయితే, గత కొన్నేళ్లుగా షాపుల అద్దెలు, కరెంట్ బిల్లులు, పనివారి జీతాలు, మున్సిపల్ పన్నులు భారీగా పెరిగాయని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం కిలోకు రూ. 15 నుండి రూ. 20 మార్జిన్ ఇస్తేనే తాము బతకగలమని, లేదంటే నష్టాల్లో కూరుకుపోతామని వారు డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా హైదరాబాద్‌లో ని గ్రేటర్ చికెన్ మర్చంట్స్ అసోసియేషన్ ఈ సమ్మెకు పిలుపునిచ్చింది. బాయిలర్ చికెన్ కంపెనీలు సిండికేట్‌గా ఏర్పడి ధరలను నియంత్రిస్తున్నాయని, తక్కువ మార్జిన్‌తో చిన్న వ్యాపారుల పొట్ట కొడుతున్నాయని వారు ఆరోపిస్తున్నారు. చికెన్ ధరలు పెరిగినప్పుడల్లా వినియోగదారుల నుంచి విమర్శలు ఎదుర్కొనేది తామేనని, కానీ అసలైన లాభం మాత్రం పెద్ద కంపెనీలకే వెళ్తోందని రిటైలర్లు వాదిస్తున్నారు. ఈ మార్జిన్ పెంచే వరకు షాపులు తెరిచే ప్రసక్తే లేదని వారు భీష్మించుకుని కూర్చున్నారు. సమ్మె కారణంగా ఒక్క హైదరాబాద్‌లోనే రోజుకు సుమారు రూ. 10 కోట్ల నుండి రూ. 15 కోట్ల వరకు వ్యాపారం దెబ్బతింటుందని అంచనా. కేవలం మాంసం విక్రయాలే కాకుండా, చికెన్‌పై ఆధారపడిన హోటళ్లు, రెస్టారెంట్లు ,ఫాస్ట్ ఫుడ్ సెంటర్లపై కూడా ఈ ప్రభావం తీవ్రంగా పడింది. హోటల్ యజమానులు అధిక ధర చెల్లించి బయటి జిల్లాల నుండి చికెన్ తెప్పించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందిఈ సమ్మె ఎంతకాలం కొనసాగుతుందనేది ఇప్పుడు పెద్ద ప్రశ్న. కంపెనీ ప్రతినిధులు , రిటైలర్ల మధ్య చర్చలు జరుగుతున్నప్పటికీ, మార్జిన్ పెంపు విషయంలో ఇంకా ఒక స్పష్టత రాలేదు. ప్రభుత్వం జోక్యం చేసుకుని ఈ వివాదాన్ని పరిష్కరించాలని అటు వ్యాపారులు, ఇటు వినియోగదారులు కోరుతున్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# నూతన బస్టాండ్ల కోసం ఆమరణ నిరాహార దీక్ష చేస్తా : కూనంనేని

- మహిళా సాధికారతకు చేదోడుగా 'ఉచిత బస్సు' సౌకర్యం
- పేద కుటుంబాల ఉపాధికి ఊతమిచ్చిన ఉచిత ప్రయాణం
- ఆర్థిక స్వావలంబన దిశగా మహిళల అడుగులు
- శ్రమశక్తికి వెన్నుదన్నుగా నిలుస్తున్న ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం
- ప్రతిరోజూ 35 లక్షల మంది మహిళలకు లబ్ధి
- రాష్ట్రవ్యాప్తంగా 290 కోట్లకు చేరిన జీరో ఛార్జీ టిక్కెట్లు
- ఉచిత ప్రయాణంతో మహిళలకు రూ. 10,000 కోట్ల ఆదా
- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు



**కొత్తగూడెంపెన్ పవర్:**
మహిళా సాధికారతకు చేదోడుగా ఉచిత బస్సు సౌకర్యం ఎంతగానో తోడ్పడుతుందని, ఈ పథకం పేద కుటుంబాల ఆర్థికాభివృద్ధికి బాటలు వేసిందని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఎన్నికల హామీ ఆరుగ్యారెంటీల్లో భాగంగా మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన నేపథ్యంలో, గురువారం కొత్తగూడెం ఆర్టీసీ బస్టాండు ఆవరణలో '99 రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక' సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడాతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా గొప్ప అడుగు అని, నిత్యం కష్టపడే శ్రమశక్తికి ఇది వెన్నుదన్నుగా నిలుస్తుందని ఆయన కొనియాడారు. ఈ సౌకర్యం వల్ల మహిళలు తమ పనుల నిమిత్తం ప్రయాణించేటప్పుడు ఛార్జీల భారం తగ్గి, ఆ మొత్తాన్ని కుటుంబ అవసరాలకు వినియోగించుకుంటున్నారని తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు కూడా ఈ పథకం ఎంతగానో దోహదపడుతుందని, నిత్యం విధులకు వెళ్లే వారికి ఇది పెద్ద ఊరటనిస్తోందని ఆయన పేర్కొన్నారు. ప్రతి రోజూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 35 లక్షల మంది మహిళలు ఈ ఉచిత బస్సు సౌకర్యాన్ని వినియోగించుకుంటున్నారని వివరించారు. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 290 కోట్ల జీరో ఛార్జీ టిక్కెట్లు నమోదయ్యాయని, దీనివల్ల మహిళలకు సుమారు రూ. 10,000 కోట్ల మేర ప్రయాణ ఖర్చులు ఆదా అయ్యాయని వెల్లడించారు. ఈ పథకం మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపిందని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంత మహిళలకు మార్కెటింగ్, ఇతర ఉపాధి పనులకు వెళ్లేందుకు ఇది ఒక వరమని ఆయన పేర్కొన్నారు.

ప్రజాపాలనలో భాగంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం మరింత కృషి చేయాలన్నారు. నూతన బస్టాండ్ల కోసం ప్రతిపాదన పెట్టిన స్పందన లేదని, బస్టాండ్ ల కోసం ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని అన్నారు.

ఈ సందర్భంగా ఉచిత ప్రయాణాన్ని వినియోగించుకొని లబ్ధిపొందిన పలువురు మహిళలను ఎమ్మెల్యే శాలువాలు, పూలమాలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర నాయకులు కందుల భాస్కర్, వంగ వెంకట్, డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి, డిప్యూటీ సూపరింటెండెంట్ విజయలక్ష్మి, సిబ్బంది వై నాగేశ్వర్ రావు, మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ కలెక్టర్ భవన్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి



**పెన్ పవర్: హనుమకొండ .**
ముఖ్యఅతిథిగా విచ్చేసిన వరంగల్ కలెక్టర్ అడిషనల్ కలెక్టర్ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బోనాగాని యాదగిరి గౌడ్ మరియు చిర్ర రాజు గౌడ్ పస్తం అనిల్ దీ=వా పార్టీ దీ=వాఎ జిల్లా సీనియర్ నాయకులు54 డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు వెంకటేశ్వర్లు గౌడ్ శ్రీనివాస్ యాదవ్ పవన్ కర్ణాకర్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి సర్దార్ మంగా మాట్లాడుతూ సర్వాయి పాపన్న మౌలాలి రాజ్యాన్ని కొలగొట్టి 12,000 మంది సామరాజ్యంతో మౌలాలిలా కోటను బద్దలు కొట్టి మన యొక్క భారతదేశ ఆత్మగౌరాన్ని నిలిపే విధంగా గోల్కొండ కోట మీద మౌలాలి యొక్క రాజు తలను కోసి వేలాడదీసిన మహారాజు సర్వాయి పాపన్న గౌడ్ గారు మీరు అనేక పోరాటాలకు స్ఫూర్తిగా నిలుస్తూ ఈ రోజుల్లో ఈ గవర్నమెంట్ ఏదైనా కూడా సర్వాయి పాపన్న గౌడ్ స్ఫూర్తితో ముందుకు సాగుతూ ఉంది సర్వాయి పాపన్న చేసిన అనేకమైన పోరాటాలు ఇప్పుడు మన సమాజానికి చాలా స్ఫూర్తిగా పనిచేస్తున్నాయి ఇలాంటి సర్వాయి పాపన్న గౌడ్ వారు అన్యాయాన్ని ప్రశ్నించే వ్యక్తిగా ఉండేవాడు మనం కూడా సర్వాయి పాపన్న లాంటి కలిగి ఉన్న ప్రతి వ్యక్తి కూడా అన్యాయాన్ని ప్రశ్నించి ప్రజా పోరాటంలో ప్రజలందరికీ మంచి జరిగే లాగా చూడాలని మనలో శ్రేయస్సు మంచి కోరుకునే లాగా ఉండాలని ఛత్రపతి శివాజీ కంటే ముందు సర్వాయి పాపన్న పోరాట స్ఫూర్తి చాలా బాగుండేదని ఇక స్ఫూర్తితో అందరూ ముందుకు సాగాలని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వివిధ రెవెన్యూ పోలీస్ సివిల్ మున్సిపాలిటీ వివిధ ఆఫీసర్స్ మరియు అధికారపక్ష ప్రతిపక్ష నాయకులు కర్ణాకర్ చరణ్ మల్లారెడ్డి కుమార్ చందు శ్రావణి మౌనిక సౌమ్య కిరణ్ మల్లారెడ్డి శరత్ వినోద్ కర్ణ రామ్ చరణ్ శ్రావణి రమ వివిధ నాయకులు పాల్గొనడం జరిగినది

# కొనాయిమాకుల గ్రామ సభలో పాల్గొన్న కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి

**వరంగల్ పెన్ పవర్:** ప్రజల సమస్యల పరిష్కారం, గ్రామాల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" 99 రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా నేడు గీసుగొండ మండలంలోని కొనాయిమాకుల గ్రామపంచాయతీలో గ్రామ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ కుడా ఛైర్మన్, హనుమకొండ డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి అధికారికంగా హాజరయ్యారు. సభకు విచ్చేసిన ముఖ్య అతిథి ఇనగాల వెంకట్ రామ్ రెడ్డి వారికి గ్రామ సర్పంచ్, పీసల , రాజు , గీసుకొండ ఎమ్మార్వో మరియు ఆర్డీవో పూల బొకేలు ఇచ్చి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన అధికారులతో కలిసి కొనైమాకుల గ్రామసభలో పాల్గొన్నారుఈ సందర్భంగా గ్రామ ప్రజలను ఉద్దేశించి ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వంలో ప్రతి పౌరుడికి న్యాయం జరగాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ 99 రోజుల ప్రగతి ప్రణాళికను రూపొందించారని తెలిపారు. ప్రజా పాలనలో ప్రజల బాగస్వామ్యం పెంచి,ప్రభుత్వ పథకాలైన రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, గ్యాస్ సిలిండర్,సన్నరకం. బియ్యం వ్యవసాయ రైతుల ధాన్యం కొనుగోలు. 500 బోనస్, చేయుట పెన్షన్లు, గృహ జ్యోతి, కళ్యాణ లక్ష్మీ మరియు వివిధ పథకాల పై చర్చించి,లబ్దిదారుల నుండి అభిప్రాయాలను సేకరించారు.ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన కొత్త పథకాలైన ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా పథకం, ఇంటర్మీడియెట్ వరకు అల్పాహార పథకం, దివ్యాంగులైన ఇంటర్మీడియెట్ విద్యార్థులకు రెట్రో ఫిట్టెడ్ మోటరైజ్డ్ వాహనాల పంపిణీ ల గురించి, గ్రామానికి కావాల్సిన అవసరాలు, సమస్యలను మరియు పరిష్కార మీద చర్చించి రిజిస్టర్ లో నమోదు చేశారు. ఈ ప్రణాళికలో భాగంగా గ్రామానికి వర్తించే పలు కీలక అంశాలను ఆయన ప్రజలకు వివరించారుపారిశుద్ధ్యం - పరిసరాల పరిశుభ్రత: గ్రామంలో చెత్త తొలగింపు, మురుగు కాలువల శుభ్రతకు మొదటి ప్రాధాన్యత.ప్రభుత్వ పథకాల లబ్ధి: ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ?500 లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడటం. విద్య, వైద్య రంగాల బలోపేతం: స్థానిక ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధి మరియు పల్లె దవాఖానాల్లో మెరుగైన వైద్య సేవలు అందించడం.రైతు సంక్షేమం: రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువుల లభ్యత మరియు వ్యవసాయ సంబంధిత సమస్యల తక్షణ పరిష్కారం. యువతకు ఉపాధి: గ్రామాల్లోని నిరుద్యోగ యువతకు స్కిల్ ట్రైనింగ్ మరియు ఉపాధి అవకాశాలు కల్పించడం.యాంటీ డ్రగ్స్ ప్రచారం: గ్రామీణ యువత పెడదోవ పట్టకుండా డ్రగ్స్ నిర్మూలనపై ప్రత్యేక అవగాహన. ప్రభుత్వం చేపడుతున్న ఈ బృహత్తర కార్యక్రమంలో గ్రామ ప్రజలంతా భాగస్వాములై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని, ప్రజా సభలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

# హైదరాబాద్ కు రెండు విమాన సర్వీసులు

**విజయవాడ, ఏప్రిల్ 2, పెన్ పవర్:**
ఏపీ నుంచి కొత్తగా పలు విమాన సర్వీసులు ప్రారంభంకానున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్‌కు కనెక్టవిటీని పెంచేలా ఈ సర్వీసులు అందుబాటులోకి రానున్నాయి. రాజమహేంద్రవరం నుంచి మూడు కొత్త సర్వీసులు ప్లాన్ చేయగా.. తాజాగా విజయవాడ నుంచి హైదరాబాద్‌కు కొత్తగా మరో రెండు విమాన సర్వీసులు ప్రారంభించనున్నారు. ఈ నెల 10 నుంచి ఒక విమాన సర్వీసు, 17 నుంచి మరో సర్వీస్ అందుబాటులోకి రానుంది విజయవాడ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు నుంచి హైదరాబాద్‌కు రెండు కొత్త విమాన సర్వీసులు నడపనున్నట్లు విమానాశ్రయ డైరెక్టర్ లక్ష్మీకాంతరెడ్డి తెలిపారు. ఈ నెల 10 నుంచి ఫ్లై-91 ఎయిర్‌లైన్స్ సంస్థ ఈ రెండు సర్వీసులు ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. ఈ కొత్త విమాన సర్వీస్ హైదరాబాద్‌లో ఉదయం 6.05 గంటలకు బయల్దేరి ఉదయం 7.10 నిమిషాలకు విజయవాడ చేరుకుంటుంది అన్నారు. ఈ విమానం తిరుగు ప్రయాణంలో విజయవాడ నుంచి ఉదయం 07:30గంటలకు బయలుదేరి ఉదయం 08:40గంటలకు హైదరాబాద్‌కు వెళ తుందన్నారు.,ఈనెల 17 నుంచి ఫ్లై-91 ఎయిర్‌లైన్స్ సంస్థకు చెందిన మరో సర్వీసు హైదరాబాద్-విజయవాడ మధ్య అందబాటులోకి వస్తుందని లక్ష్మీకాంతరెడ్డి తెలిపారు. ఈ విమానం 10:10 గంటలకు విజయవాడ నుంచి బయల్దేరి.. ఉదయం 11:30 గంటలకు హైదరాబాద్‌కు చేరుకుంటుందని ప్రకటించారు. ఈ రెండు సర్వీసుల్లో విమాన ఛార్జీలు రూ.4వేల నుంచి రూ.8 వేల మధ్య ఉంటాయని తెలిపారు. రాష్ట్ర ప్రజలు ఈ విషయాన్ని గమనించి, ఈ రెండు విమాన సర్వీసుల్ని ఉపయోగించుకోవాలని సూచించారు. అలాగే రాష్ట్ర ప్రజలకు ప్రజలకు విమానయానాన్ని మరింత చేరువ చేయడంతో పాటు.. ప్రధాన నగరాల మధ్య విమానయాన అనుసంధానానికి ఉడాన్ పథకం ఎంతో దోహదపడుతుందన్నారు. రాష్ట్రంలోని కడప, కర్నూలు విమానాశ్రయాలను ఉడాన్ ఫథకం కింద అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారువిజయవాడ మాత్రమే కాదు రాజమహేంద్రవరం నుంచి కూడా కొత్తగా మూడు విమాన సర్వీసులు ప్రారంభంకానున్నాయి. ఈ సర్వీసులు కూడా రాజమహేంద్రవరం నుంచి హైదరాబాద్‌కు నడపనున్నారని ప్రకటించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విజయవాడ నుంచి విమాన సర్వీసుల సంఖ్య పెరిగింది. హైదరాబాద్‌తో పాటూ మరికొన్ని నగరాలకు విమానాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇటీవల విజయవాడ నుంచి హైదరాబాద్‌కు బోయింగ్ విమాన సర్వీసులు అందుబాటులోకి వచ్చాయి. విజయవాడ రాజధాని అమరావతి ప్రాంతానికి సమీపంలో ఉండటంతో ప్రయాణికుల సంఖ్య కూడా క్రమంగా పెరుగుతోంది.. దీంతో రద్దీ కనిపిస్తోంది.

# ఏప్రిల్ లోనే గూగుల్ డేటా సెంటర్ భూమి పూజ

**విశాఖపట్టణం, ఏప్రిల్ 2,పెన్ పవర్:**
విశాఖపట్నం జిల్లాలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు చకచకా అడుగులు పడుతున్నాయి. తర్లువాడలో గూగుల్ డేటా సెంటర్ నిర్మాణానికి ప్రభుత్వం ఇప్పటికే భూములు కేటాయించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయా భూములలో జంగల్ క్లియరెన్స్ పనులు చేపడుతున్నారు. ఈ పనులు కూడా ముగింపు దశకు చేరుకుంటున్నాయి. మరోవైపు గూగుల్ డేటా సెంటర్ నిర్మాణానికి ఈ నెలలోనే భూమి పూజ నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది.విశాఖపట్నం జిల్లాలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు పనులు వేగంగా జరుగుతున్నాయి. ఆనందపురం మండలంలోని తర్లువాడలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు చేస్తున్న సంగతి తెలిసిందే. డేటా సెంటర్ ప్రాజెక్టు కోసం కేటాయించిన భూముల్లో అధికారులు జంగల్ క్లియరెన్స్ పనులు చేపడుతున్నారు. డేటా సెంటర్ కోసం తర్లువాడలోని సర్వేనంబర్ ఒకటిలో ఉన్న 308 ఎకరాలను ఏపీ ప్రభుత్వం గూగుల్ సంస్థకు కేటాయించింది. అలాగే ఆయా భూముల రైతులకు ఇప్పటికే నష్టపరిహారాన్ని జమ చేసింది. గూగుల్ డేటా సెంటర్‌కు కేటాయించిన భూములలో మామిడి, జీడి మామిడి వంటి తోటలు, ఇతర చెట్లు ఉన్నాయి. వీటిని తొలగించే పనిని ఏపీ ప్రభుత్వం ఏపీఐఐసీకి అప్పగించింది.ఏపీఐఐసీ ఓ కాంట్రాక్టర్‌కు ల్యాండ్ స్కేపింగ్ పనులు అప్పగించింది. ఈ నేపథ్యంలో సదరు కాంట్రాక్ట్ సంస్థ జంగల్ క్లియరెన్స్ పనులు చేపట్టగా.. మెజారిటీ పనులు పూర్తయ్యాయి. భూమిని చదును చేయాల్సి ఉంది. మరోవైపు ఏప్రిల్ నెలలోనే గూగుల్ డేటా సెంటర్ నిర్మాణం కోసం భూమి పూజ నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే పనులు వేగవంతం చేశారు.



మరోవైపు గూగుల్ అనుబంధ సంస్థ అయిన రైడెన్ ఇన్ఫోటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, దాని నోటిఫైడ్ భాగస్వామ్య సంస్థ కలిసి 1000 మెగావాట్ల సామర్థ్యంతో గూగుల్ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటు చేస్తోంది. ఈ డేటా సెంటర్ కోసం15 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టనుంది.ఈ ప్రాజెక్టు కోసం ఏపీ ప్రభుత్వం తొలుత విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో 480 ఎకరాలు కేటాయించింది. అయితే గూగుల్ ప్రతినిధులు అదనపు భూములు కోరటంతో.. ఏపీ ప్రభుత్వం రాంబిల్లిలో 174.8 ఎకరాలు, తర్లువాడ లో 266.6 ఎకరాలు, అడవివరంలో 160 ఎకరాలను కలిపి 601.4 ఎకరాలను కేటాయించింది. ముందుగా అనుకున్న ప్రకారం తొలుత తర్లువాడలో డేటా సెంటర్ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించనున్నారు. ఈ ఏర్పాట్ల కోసం ఏపీ పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ ఇటీవలే విశాఖపట్నంలో పర్యటించారు. ఏపీఐఐసీ అధికారులతో తర్లువాడ భూములను పరిశీలించారు. ఈ క్రమంలోనే జంగల్ క్లియరెన్స్ పనులు వేగవంతం చేశారు.

# ఇమేజ్ ను డ్యామేజ్ చేస్తున్న మావిగన్...

**విజయవాడ, ఏప్రిల్ 2,పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో గత ఐదేళ్లుగా 'రాజధాని' అనే అంశం ఒక ముగింపు లేని ప్రహసనంలా సాగుతోంది. మూడు రాజధానులంటూ గతంలో చేసిన ప్రయోగాలు విఫలమై, ప్రస్తుతం అమరావతికి పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పిస్తున్న తరుణంలో, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తాజాగా తెరపైకి తెచ్చిన 'మావిగన్' అనే వింత పేరు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా హాస్యాస్పదంగా మారింది. సీరియస్ రాజకీయాలు చేయాల్సిన సమయంలో జగన్ ఇలాంటి వింత పేర్లతో ముందుకు రావడంపై నెటిజన్లు సోషల్ మీడియా వేదికగా విరుచుకుపడుతున్నారు.అక్షరాలను కలిపి ఏదో ఇంటర్నేషనల్ బ్రాండ్ పేరులా వినిపిస్తున్న ఈ 'మావిగన్' అనే పదం వినగానే జనం నోరెళ్లబెడుతున్నారు. అసలు ఈ పేరు ఎక్కడ నుండి పుట్టింది? దీని వెనుక ఉన్న లాజిక్ ఏంటి? అని ఆరా తీస్తున్నారు. రాజధాని విషయంలో ఇప్పటికే ప్రజల్లో ఉన్న గందరగోళాన్ని తొలగించాల్సింది పోయి, ఇలాంటి అల్లాటప్పా పేర్లతో కాలయాపన చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. "గతంలో మూడు రాజధానులు అన్నారు, ఇప్పుడు ఈ కొత్త 'గన్' ఎక్కడి నుండి వచ్చింది?" అంటూ సామాన్యులు జోకులు వేసుకుంటున్నారు.ఈ 'మావిగన్' పేరుపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పందించిన తీరు ఇప్పుడు ఇంటర్నెట్‌లో విపరీతంగా వైరల్ అవుతోంది. మీడియా ప్రతినిధులు ఈ పేరును ప్రస్తావించగానే, పవన్ కళ్యాణ్ ఆపుకోలేక నవ్విన తీరు జగన్ రాజకీయ పరిజ్ఞానంపై ఆయనకున్న అభిప్రాయాన్ని స్పష్టం చేసింది. "ఇన్ని వింత పేర్లు వీరికి ఎక్కడ దొరుకుతాయో ఏమో!" అన్నట్లుగా పవన్ ఇచ్చిన ఆ వెటకారపు నవ్వు, జగన్ ప్రతిపాదన ఎంత సిల్లీగా ఉందో చెప్పకనే చెప్పిఒక బాధ్యతాయుతమైన ప్రతిపక్ష నేతగా ఉండాల్సిన వ్యక్తి, ఇలాంటి హాస్యాస్పదమైన మాటలతో నవ్వులపాలవ్వడం రాజకీయ విశ్లేషకులను సైతం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. పవన్ నవ్వు జగన్ వైఖరికి ఒక బలమైన మౌన కౌంటర్ లా మారిందని చర్చించుకుంటున్నారు.సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లైన ఎక్స్, వాట్సాప్ గ్రూపుల్లో 'మావిగన్' పై రచ్చ మామూలుగా లేదు. "మావిగన్ అంటే ఏదో కొత్త రకమైన విదేశీ తుపాకీ పేరులా ఉంది" అని కొందరు సెటైర్లు వేస్తుంటే, మరికొందరు "సీజన్ మారినప్పుడల్లా రాజధాని పేరు మార్చడం జగన్ కే చెల్లింది" అని విమర్శిస్తున్నారు. జగన్ పాత వీడియోలను, ఇప్పటి మావిగన్ మాటలను కలిపి నెటిజన్లు క్రియేటివ్ పేరడీ వీడియోలు సృష్టిస్తున్నారు. ఒక సీరియస్ రాజకీయ అంశాన్ని జగన్ కామెడీ షోగా మార్చేశారని, అందుకే ఆయనను విమర్శించాలన్నా జాలి వేస్తోందని నెటిజన్లు 'పాపం జగన్' అంటూ హ్యాష్ ట్యాగ్‌లు ట్రెండ్ చేస్తున్నారు.అమరావతిని అడ్డుకోవడానికి జగన్ ఎన్ని దారులు వెతికినా చివరకు ఇలాంటి సిల్లీ ప్రతిపాదనల దగ్గరే ఆగిపోతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పార్లమెంట్ చట్టం చేస్తున్నా సరే, ఇంకా ఏదో ఒక వింత పేరుతో కాలయాపన చేయడం వల్ల పార్టీకే నష్టమని వైసీపీ నేతలు కూడా లోలోపల మదనపడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.మొత్తానికి, 'మావిగన్' పేరుతో జగన్ రెడ్డి తన రాజకీయాల్లో మరో 'సెల్ఫ్ గోల్' వేసుకున్నారని స్పష్టమవుతోంది. రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు సంబంధించిన రాజధాని అంశాన్ని ఒక కుళ్లు జోక్ స్థాయికి తగ్గించేలా జగన్ వ్యవహరించడం శోచనీయమని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఒకవేళ ఇది ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం అయితే, అది బెడిసికొట్టి జగన్ ఇమేజ్‌ను మరింత డ్యామేజ్ చేసిందనడంలో అతిశయోక్తి లేదు.

# పోలవరానికి నిధులు...

**ఏలూరు, ఏప్రిల్ 2, పెన్ పవర్:**
ఏపీకి కేంద్రం గుడ్ న్యూస్ చెప్పింది. ఏపీ జీవనాడిగా భావిస్తున్న పోలవరం ప్రాజెక్టుకు రూ.1301 కోట్లు విడుదల చేసింది. ఈ నిధులు పోలవరం ప్రాజెక్టు అకౌంట్లోకి నేరుగా జమ అవుతాయని జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు. ఏపీ విషయంలో కేంద్రం ఉదారంగా వ్యవహరిస్తోంది. మూడోసారి ఎన్డీఏ అధికారంలోకి వచ్చిన తర్వాత వార్షిక బడ్జెట్లో అమరావతి రాజధానితో పాటు పోలవరం ప్రాజెక్టుకు నిధులు కేటాయించింది. గతంలో రూ.1508 కోట్లు విడుదల చేయగా.. తాజాగా మరోసారి కేంద్రం అడ్వాన్సుడ్ నిధులు కేటాయించింది. మొత్తానికి ఈ 22 నెలల్లో పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం నుంచి రూ.2809కోట్లు అందినట్లు అయింది. మరోవైపు ఈనెల 2న పోలవరం పర్యటనకు వెళ్తున్నారు గవర్నర్ అబ్దుల్ నజీర్. ఎప్పటికప్పుడు ఏపీ సీఎం చంద్రబాబు పనులను సమీక్షిస్తూ వచ్చారు. పోలవరం పై కేంద్రానికి నివేదికలు ఇస్తూనే ఉన్నారు. అందుకే కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఈ నిధులను కేటాయించింది. అయితే గత ఆర్థిక సంవత్సరంలో సవరించిన అంచనాల మేరకు నిధులు దాదాపుగా వచ్చేశాయి.కేంద్ర ప్రభుత్వం గతంలో రూ.1508 కోట్లు మంజూరు చేయగా అందులో రూ.600 కోట్లు ప్రాజెక్టు పనుల కోసం కేటాయించింది. మరో రూ.300 కోట్లు పునరావసం, భూ సేకరణ కోసం ఖర్చు చేశారు. ఇటీవల కేంద్ర జలశక్తి అధికారులు పోలవరం ప్రాజెక్టు సందర్శనకు వచ్చారు. ఆ సమయంలో ఏపీ అధికారులు నీతుల విషయాన్ని ప్రస్తావించారు. దీంతో కేంద్ర ప్రభుత్వం నిధులను విడుదల చేసినట్లు తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు కోసం సింగిల్ నోడల్ అకౌంట్ కు నిధులను విడుదల చేయడం ఇదే చివరిసారి. ఇకపై స్పర్శ విధానంలో నిధులను విడుదల చేయనున్నారుసకాలంలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు పూర్తిచేసి జాతికి అందించాలన్న లక్ష్యంతో ఉంది ఏపీ ప్రభుత్వం. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో శరవేగంగా పనులు జరిపిస్తోంది. గత అనుభవాల దృష్ట్యా వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని చూస్తోంది. అయితే మొన్నటి బడ్జెట్ సెషన్స్ లో సైతం ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పోలవరం ప్రాజెక్టు ప్రత్యేక ప్రస్తావన తీసుకొచ్చారు. ఆ ప్రాజెక్టుకు అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అందుకు తగ్గట్టుగానే ఇప్పుడు భారీగా నిధులు కేటాయించారు. ఇది శుభ పరిణామం కూడా..



# యానిమేటర్లకు 5 జీ న్యూస్

**విజయవాడ, ఏప్రిల్ 2, పెన్ పవర్:** ఏపీ ప్రభుత్వం రెండు నెలల క్రితం యానిమేటర్లకు ఇచ్చిన హామీ ఇచ్చిన హామీని త్వరలోనే నెరవేర్చనుంది. యానిమేటర్లందరికీ 5జీ మొబైల్స్ ఇవ్వబోతోంది. ఇప్పటికే అధికారులు జిల్లాలకు మొబైల్స్‌ను పంపించారు. త్వరలోనే యానిమేటర్లకు మొబైల్స్‌ను పంపిణీ చేస్తామని అధికారులు తెలిపారు. యానిమేటర్లకు ఇస్తున్న ఒక్కో ఫోన్ విలువ రూ.15 వేలు.. ఈ కొత్త మొబైల్స్ ద్వారా సేవల్ని మరింత వేగవంతం చేస్తామని యానిమేటర్లు చెబుతున్నారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యానిమేటర్లకు (వీవోఏ) తీపికబురు చెప్పింది. రెండు నెలల క్రితం చెప్పిన విధంగా యానిమేటర్లకు 5జీ మొబైల్స్‌ను అందించేందుకు సిద్ధమైంది. ఈ మేరకు జిల్లాలకు మొబైల్స్‌ను ఇప్పటికే పంపించారు.. అవి డీఆర్డీఏ కార్యాలయాలకు చేరాయి. త్వరలోనే మొబైల్స్‌ను యానిమేటర్లకు పంపిణీ చేస్తామని అధికారులు తెలిపారు. యానిమేటర్లకు ఇస్తున్న ఒక్కో ఫోన్ ధర రూ. 15 వేల వరకు ఉంటుందని చెబుతున్నారు. ఈ మొబైల్స్ ద్వారా యానిమేటర్లు ప్రజలకు మరింత వేగంగా సేవలు అందించనున్నారు.డీఆర్‌డీఏ (జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ) ఆధ్వర్యంలో యానిమేటర్లు పొదుపు సంఘాలకు అండగా ఉంటున్నారు. సంఘాల పని తీరు పర్యవేక్షించడం, బుక్ కీపింగ్, బ్యాంకు లింకేజీ, రుణాలు ఇప్పించడం, ప్రభుత్వ రాయితీలు, వడ్డీ లేని రుణాలు, కొత్త సంఘాలను ఏర్పాటు చేయడం, డబ్బులు-మన లెక్కలు అనే యాప్‌కు సంబంధించిన సేవలను యానిమేటర్లు అందిస్తున్నారు. వీరు విధినిర్వహణలో భాగంగా కొన్ని యాప్స్‌ను ఉపయోగించాల్సి ఉంటుంది. అయితే వీరికి గతంలో ఇచ్చిన మొబైల్స్, ట్యాబ్స్ పనిచేయకపోవడంతో.. సొంత మొబైల్స్ వాడుతున్నారు. కొంత మంది ఫోన్లు మొరాయించడంతో ఇబ్బంది పడుతున్నారు.దీంతో తమకు మొబైల్స్ ఇవ్వాలని యానిమేటర్లు ప్రభుత్వాన్ని కోరారు. వారిని వినతి పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించి మొబైల్స్ అందించాలని నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 27 వేల 500 మంది యానిమేటర్లు.. 5 వేల మంది కమ్యూనిటీ కోఆర్డినేటర్లకు మొబైల్స్ అందించనున్నారు. ఈ మొబైల్స్ అందిస్తే సేవల్ని మరింత వేగవంతం చేస్తామని యానిమేటర్లు చెబుతున్నారుఏపీ ప్రభుత్వం ఇటీవల రాష్ట్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లకు కూడా మొబైల్స్ అందించిన సంగతి తెలిసిందే. వారికి ఒక్కొక్కరికి రూ.12,500 విలువైన ఫోన్లను అందించడం కోసం ప్రభుత్వం రూ.74 కోట్లు ఖర్చు చేసింది. అంగన్‌వాడీలలో లబ్ధిదారుల వివరాలను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఏపీ ప్రభుత్వం వారందరికి మొబైల్స్ అందించింది. మొత్తం మీద అంగన్‌వాడీలకు మొబైల్ కష్టాలు తీరిపోగా.. ఇటు త్వరలోనే యానిమేటర్లకు కూడా కొత్త 5జీ మొబైల్స్ అందజేయనున్నారు.

# తెగేదాక లాగుతున్న దువ్వాడ

**శ్రీకాకుళం, ఏప్రిల్ 2, పెన్ పవర్:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి మరో అసమ్మతి గళం సోషల్ మీడియా వేదికగా బయటకు వచ్చింది. వ్యక్తిగత వివాదాలతో పార్టీకి దూరం అయిన దువ్వాడ శ్రీనివాస్ ఇటీవలనే జగన్మోహన్ రెడ్డిని కలిశారు. త్వరలో వచ్చి కలుస్తానని చెప్పారు. మీరు ఎలా చెబితే అలా నడుచుకుంటానని కూడా అన్నారు. దీంతో దువ్వాడ శ్రీనివాస్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలోకి రీఎంట్రీ ఇస్తారని ఆయన అభిమానులు తెగ హడావిడి చేశారు. కానీ ఇటీవల జరిగిన పరిణామాలతో దువ్వాడ శ్రీనివాస్ సోషల్ మీడియాలో చేసిన పోస్ట్ వైరల్ అవుతోంది. వైసీపీలో ఆయన రీఎంట్రీ పై అనేక రకాల అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఆయన వైసీపీలో చేరడం దాదాపు అసాధ్యం అని కూడా తెలుస్తోంది. ఎట్టి పరిస్థితుల్లో ఆయన వైసీపీలోకి తెచ్చుకునే ఛాన్స్ కనిపించడం లేదు శ్రీకాకుళం జిల్లాలో..ఇటీవల ధర్మాన ప్రసాదరావు నేతృత్వంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మూలపేట పోర్టు సందర్శన కార్యక్రమాన్ని నిర్వహించింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా శ్రేణులంతా హాజరయ్యాయి. అయితే దీనిపై దువ్వాడ ఇది ఎంత అధర్మం అంటూ పోస్ట్ చేశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేసిన కార్యక్రమాన్ని పొలిటికల్ డ్రామాగా అభివర్ణించారు. పోర్టు లోపలికి 40 మందికి అనుమతి ఉంటే ధర్మాన ఎందుకు వెళ్లలేదని ప్రశ్నించారు. అధర్మంగా పూర్తికి పది మీటర్ల దూరంలో టెంట్లు వేసుకుని మాట్లాడి వెళ్లిపోయారని ఎద్దేవా చేశారు. కోర్టుకు వంద మీటర్ల రోడ్డు కోసం భూములు ఇచ్చిన రైతుల త్యాగాల కోసం అసలు ప్రస్తావించలేదని.. నిర్వాసితులకు తీవ్ర నిరాశ మిగిల్చారు అంటూ వైసీపీ నేతలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వైసిపి కార్యక్రమాన్ని దువ్వాడ శ్రీనివాస్ వ్యతిరేకించడం చూస్తుంటే మాత్రం ఆయన రీ యంట్రి విషయం తేలిపోయినట్లు అయింది.అధినేత జగన్మోహన్ రెడ్డి పట్ల వీర విధేయత ప్రదర్శిస్తూ వస్తున్నారు దువ్వాడ శ్రీనివాస్. కానీ జిల్లాలో ధర్మాన సోదరులను వ్యతిరేకిస్తూ వచ్చారు. అయితే ఇప్పుడు ఏకంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాన్ని డ్రామా తో అభివర్ణించడంతో దువ్వాడ శ్రీనివాస్ కు దారులు మూసుకుపోయినట్టే. దువ్వాడ విషయంలో జిల్లాలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలంతా ఒకే మాటతో ఉన్నట్లు తెలుస్తోంది. వ్యక్తిగత వివాదాలతో పార్టీని ఇబ్బందుల్లో పెట్టిన దువ్వాడను మరోసారి పార్టీలోకి తీసుకోవద్దని జగన్మోహన్ రెడ్డికి తేల్చి చెప్పినట్లు సమాచారం. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ పోర్టు సందర్శన సక్సెస్ అయ్యిందని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. కానీ దువ్వాడ శ్రీనివాస్ మాత్రం అదే కార్యక్రమం పై విమర్శలు చేయడంపై వైసీపీ నాయకత్వం కూడా సీరియస్ గా ఉన్నట్లు తెలుస్తోంది. దాదాపు డోర్స్ క్లోజ్ అయినట్టే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి దువ్వాడ శ్రీనివాస్ కు. చూడాలి మరి ఏం జరుగుతుందో..

# అయోమయంలో వైసీపీ.. చిక్కుల్లో జగన్!

**గుంటూరు, ఏప్రిల్ 2, పెన్ పవర్:**



ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో అత్యంత సున్నితమైన, కీలకమైన అమరావతి విషయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మరోసారి వ్యూహాత్మక తప్పిదం చేసిందన్న అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. 2019-24 మధ్య మూడు రాజధానుల పేరుతో కాలయాపన చేసి, ఎన్నికల్లో భారీ మూల్యం చెల్లించుకున్న తర్వాత కూడా ఆ పార్టీ తన పంథాను మార్చుకోకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. తాజాగా లోక్‌సభలో అమరావతికి చట్టబద్ధత కల్పించే ఏపీ పునర్విభజన సవరణ బిల్లు-2026 ఆమోదం పొందిన వేళ.. జగన్ మోహన్ రెడ్డి తెరపైకి తెచ్చిన మావిగన్ అనే కొత్త ప్రతిపాదన ఆ పార్టీని మరింత రాజకీయ రక్షణలో పడేసింది.మచిలీపట్నం, విజయవాడ, గుంటూరులను కలిపి మావిగన్ అనే గ్రోత్ కారిడార్‌ను రాజధానిగా జగన్ ప్రతిపాదించడం ఇప్పుడు పెద్ద చర్చకు దారితీసింది. అయితే, పార్లమెంట్ సాక్షిగా అమరావతికి శాసనపరమైన గుర్తింపు దక్కిన ఈ తరుణంలో ఇలాంటి ప్రతిపాదనలు చేయడం చేతులు కాలాక ఆకులు పట్టుకోవడం లాంటిదేనని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అమరావతి ఇప్పుడు కేవలం ఒక రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం మాత్రమే కాదు, అది పార్లమెంట్ ఆమోదించిన చట్టం. జగన్ భవిష్యత్తులో అధికారంలోకి వచ్చినా తన వ్యక్తిగత కార్యాలయాలను ఎక్కడైనా పెట్టుకోవచ్చు కానీ, రాజధానిని తరలించడం అనేది ఇప్పుడు అసాధ్యమైన ప్రక్రియగా మారింది.రాజధాని విషయంలో వైసీపీ అనుసరిస్తున్న దోబూచులాట ఆ పార్టీ క్యాడర్‌ను కూడా గందరగోళానికి గురిచేస్తోంది. ఒకవైపు అమరావతికి తాము వ్యతిరేకం కాదని చెబుతూనే, మరోవైపు పార్లమెంట్‌లో బిల్లును వ్యతిరేకించి వాకౌట్ చేయడం ద్వారా తమ ద్వంద్వ వైఖరిని బయటపెట్టుకున్నారు. ఈ సమయంలో అమరావతికి సంపూర్ణ మద్దతు ప్రకటించి, కేవలం అక్కడ జరుగుతున్నట్లుగా తాము భావిస్తున్న అవినీతి పై మాత్రమే పోరాటం చేసి ఉంటే వైసీపీకి రాజకీయంగా మైలేజీ దక్కేది. కానీ, ఇప్పుడు మావిగన్ వంటి కొత్త పేర్లతో గందరగోళం సృష్టించడం వల్ల ప్రజల్లో ఆ పార్టీ విశ్వసనీయత మరింత దెబ్బతినే ప్రమాదం ఉంది.అమరావతిని స్మశానం అని, గ్రాఫిక్స్ అని ఎద్దేవా చేసిన నేతలే, ఇప్పుడు రాజధాని హోదా కల్పించడాన్ని తప్పుపడుతున్నారు. సీనియర్ నేత ధర్మాన ప్రసాదరావు వంటి వారు అన్నీ అమరావతికే చేస్తే మేము అడుక్కుతినాలా? అని చేస్తున్న వ్యాఖ్యలు ప్రాంతీయ విద్వేషాలను రేకెత్తించేలా ఉన్నాయి. ఇలాంటి వ్యాఖ్యలను కట్టడి చేయకుండా, జగన్ కూడా అదే బాటలో ప్రయాణించడం ఆయన రాజకీయ భవిష్యత్తుకే ముప్పు తెచ్చేలా ఉంది. అభివృద్ధిని అడ్డుకుంటున్నారనే ముద్ర ఇప్పటికే పడటంతో, మావిగన్ ప్రతిపాదన ఆ ముద్రను మరింత బలపరుస్తోంది. రాజకీయాల్లో టైమింగ్ చాలా ముఖ్యం. కేంద్రం అమరావతికి నిధులు ఇవ్వడమే కాకుండా చట్టబద్ధత కూడా కల్పిస్తున్నప్పుడు, దానికి క్రెడిట్ రాకుండా చూడటం లేదా ఆ క్రెడిట్‌లో భాగస్వామ్యం కావడం విజ్ఞత అనిపించుకుంటుంది. కానీ వైసీపీ వ్యూహకర్తలు జగన్ చేత చట్టాన్ని సవరించలేరా అనే వ్యాఖ్యలు చేయించడం ద్వారా తాము అభివృద్ధి నిరోధకులమనే సంకేతాలు పంపారు. పోతరాజు తనను తాను కొట్టుకున్నట్లుగా, కేవలం పంతం కోసమే రాష్ట్ర ప్రయోజనాలకు వ్యతిరేకంగా నిలబడుతున్నామనే అభిప్రాయం ప్రజల్లో కలిగేలా ఈ మావిగన్ రాజకీయం సాగుతోందన్న విమర్శలు ఎక్కువగా వినిపిస్తున్నాయి.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# రెండు మూడు వారాల్లో ఇరాన్‌పై అతి భీకర దాడులు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్‌తో కొనసాగుతోన్న యుద్ధంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. రానున్న రెండు, మూడు వారాల్లో ఆ దేశంపై భీకర దాడులు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇరాన్ కీలక నాయకత్వం అంతమైందని, ఆ దేశ నౌకాదళం, ఎయిర్‌ఫోర్స్ తుడిచిపెట్టుకుపోయాయన్నారు. ఇరాన్ తమతో ఒప్పందానికి రావాలని.. లేకపోతే ఆ దేశాన్ని రాతియుగానికి తీసుకెళ్తామని హెచ్చరించారు. యుద్ధం ఇప్పట్లో ఆగే పరిస్థితి లేదని, ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ కొనసాగుతోందన్నారు. ఇరాన్‌పై నిర్దేశించుకున్న అన్ని లక్ష్యాలను పూర్తి చేసే దిశగా తాము ముందుకుసాగుతున్నామని ట్రంప్ పేర్కొన్నారు. యుద్ధంలో ఇరాన్ భారీగా నష్టపోయిందన్నారు. వారి సైనిక సామర్థ్యాలు పూర్తిగా ధ్వంసమయ్యాయని తెలిపారు. ఆ దేశంలోని కీలక నాయకత్వాన్ని తొలగించామని పేర్కొన్నారు. ఇరాన్ అణ్వాయుధాలు కలిగిఉండేందుకు వీలులేదని పునరుద్ఘాటించారు. ఇరాన్ చమురును లక్ష్యంగా చేసుకొని ఇప్పటివరకు తాము దాడి చేయలేదని ట్రంప్ పేర్కొన్నారు. కానీ, అవసరమైతే తాము వాటిని కూడా లక్ష్యంగా చేసుకుంటామని హెచ్చరించారు. అమెరికా భద్రత కోసమే ఈ 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'ని ప్రారంభించామని వ్యాఖ్యానించారు. యూఎస్‌ను అంతం చేయాలని ఇరాన్ కోరుకుంటోందని ఆరోపించారు.

## ఇరాన్ పునర్నిర్మాణానికి నడుం బిగించండి

**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా– ఇజ్రాయెల్ తమపై అకారణంగా దాడులు చేస్తున్నాయని ఇరాన్ సుప్రీం నేత మొజ్తాబా ఖమేనీ మండిపడ్డారు. ఈ దాడుల కారణంగా దెబ్బతిన్న మౌలిక సదుపాయాలను తిరిగి పునరుద్ధరించడానికి నడుం బిగించాలని ఆయన పిలుపునిచ్చారు. ఇస్లామిక్ రిపబ్లిక్ డే సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ఆయన సందేశం విడుదల చేశారు. అమెరికా– ఇజ్రాయెల్ తమ దేశంపై కొనసాగిస్తోన్న నీచమైన, దురాక్రమణ దాడులను మొజ్తాబా ఖండించారు. ఈ దాడుల కారణంగా ఇరాన్‌లో మౌలిక సదుపాయాలతో పాటు పర్యావరణం కూడా దెబ్బతిందన్నారు. ఈ క్రమంలో ప్రస్తుతం దేశ అంతర్గత అభివృద్ధిపై దృష్టిసారించాలని ఆయన పిలుపునిచ్చారు. అభివృద్ధిని విస్తరించడం, ఇరాన్ ఉజ్వల భవిష్యత్తుకు ప్రయత్నాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా ఇరాన్‌లోని మినాబ్ పాఠశాలపై జరిగిన దాడి గురించి మొజ్తాబా ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ ఘటనలో 186 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరికి నివాళిగా పట్టణ, గ్రామీణప్రాంతాల్లో నిర్వహిస్తున్న మొక్కలు నాటే కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. యుద్ధంలో చనిపోయిన వారిని స్మరించుకుంటూ ఇరాన్ ప్రజలు మొక్కలు నాటనున్నట్లు తెలిపారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్రమవుతోన్న నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ అమెరికా ప్రజలను ఉద్దేశిస్తూ బహిరంగ లేఖ రాశారు. తమకు అమెరికన్లపై ఎలాంటి శత్రుత్వం లేదని స్పష్టంచేశారు. అనేకసార్లు ఒత్తిళ్లు, ఆంక్షలు ఎదురైనప్పటికీ.. తాము ఎన్నడూ యుద్ధానికి దిగలేదన్నారు. తమపై చేస్తోన్న దాడులను దృఢంగా, ధైర్యంగా తిప్పికొడుతున్నామన్నారు. 'అమెరికా ఫస్ట్' అనేది ప్రస్తుత పరిపాలనలో ఉందా అని ఆయన ప్రశ్నించారు.

## ఇరాన్‌లో సాధించాల్సింది ఏముంది?

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్‌పై అమెరికా– ఇజ్రాయెల్ కొనసాగిస్తోన్న యుద్ధం గురించి ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోని అల్బనీస్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌లో ఇంకా సాధించాల్సింది ఏముందని ప్రశ్నించారు. యుద్ధం ముగింపు ఎలా ఉంటుందనే దానిపై స్పష్టత ఉండాలన్నారు. నేషనల్ ప్రెస్ క్లబ్‌లో ప్రసంగిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ అణ్వాయుధాన్ని కలిగి ఉండకూడదు, దాని పొరుగుదేశాలకు హాని కలగకుండా ఉండేందుకు ఆ దేశ సైనిక సామర్థ్యాలను తగ్గించాలనే ప్రాథమిక లక్ష్యాలకు అమెరికాకు తాముకూడా మద్దతిచ్చినట్లు అల్బనీస్ (ంనిబిష్ట్రనీనిఎ ంశ్రీఎజీనివబవ) తెలిపారు. యుద్ధంలో ఆ లక్ష్యాలు నెరవేరాయన్నారు. అయినా.. యుద్ధం కొనసాగించడానికి ఇంకా అక్కడ సాధించాల్సింది ఏముందని ఆయన ప్రశ్నించారు. యుద్ధం ముగింపు ఎలా ఉంటుందనే దానిపై స్పష్టత లేదన్నారు. ఈ సంక్షోభం ఎంతకాలం కొనసాగితే.. ప్రపంచ ఆర్థికవ్యవస్థపై దాని ప్రభావం అంత తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా యుద్ధం ఎప్పుడు ముగుస్తుందనే ప్రశ్నకు.. ఇది ప్రారంభమవడానికి ముందు తమను ఎవరూ సంప్రదించలేదని అల్బనీస్ బదులిచ్చారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గాలని తాము కోరుకుంటున్నట్లు తెలిపారు. దీనికి ముందు అల్బనీస్ చేసిన మరో ప్రసంగంలో.. రానున్న నెలలు మరింత క్లిష్టంగా ఉండవచ్చని హెచ్చరించారు. ఈ యుద్ధంలో ఆస్ట్రేలియా భాగస్వామ్యం కాదన్నారు. కానీ, దీనివల్ల తాము అధిక మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోందన్నారు.

## ఇండోనేషియాలో భారీ భూకంపం

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండోనేషియాలోని ఉత్తర మలుకు సముద్ర ప్రాంతంలో గురువారం తెల్లవారుజామున సంభవించిన శక్తివంతమైన భూకంపం పసిఫిక్ తీర దేశాల్లో ఆందోళనకు దారితీసింది. రిక్టర్ స్కేలుపై 7.4 తీవ్రతతో నమోదైన ఈ భూకంపం కారణంగా పలు దేశాలకు సునామీ హెచ్చరికలు జారీ అయ్యాయి. అమెరికా జియోలాజికల్ సర్వే (యుఎస్జీఎస్యు) ప్రకారం, భూకంప కేంద్రం టెర్నాటే నగరానికి సుమారు 127 కిలోమీటర్ల దూరంలో, 35 కిలోమీటర్ల లోతులో నమోదైంది. ప్రారంభంలో దీని తీవ్రతను 7.8గా అంచనా వేయగా, అనంతరం 7.4గా సవరించారు. ఇండోనేషియా తీర ప్రాంతాల్లో సముద్ర అలలు ఒక మీటర్ వరకు ఎగిసే అవకాశముందని అధికారులు తెలిపారు. ఫిలిప్పీన్స్, మలేషియా దేశాలతో పాటు జపాన్, తైవాన్, గ్వామ్, పాపువా న్యూ గినియా ప్రాంతాల్లో సముద్ర మట్టం మార్పులు సంభవించే అవకాశం ఉండటంతో పర్యవేక్షణను పెంచారు. భూకంపం ప్రభావంతో ఉత్తర సులవేసి ప్రావిన్స్‌లో ప్రజలు భయాందోళనకు గురై ఇళ్ల నుంచి, పాఠశాలల నుంచి బయటకు పరుగులు తీశారు. అయితే ఇప్పటివరకు ప్రాణనష్టం లేదా భారీ ఆస్తినష్టం గురించి సమాచారం లేదు. తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. అత్యవసర పరిస్థితులకు స్పందించేందుకు ఇండోనేషియా విపత్తు నిర్వహణ బృందాలు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు.

## గుజరాత్‌లో భూకంపం

**హైదరాబాద్ పెన్ పవర్:** దక్షిణ గుజరాత్‌లోని నవసారి జిల్లాలో గురువారం ఉదయం స్వల్ప భూకంపం సంభవించింది. దీని తీవ్రతను రిక్టర్ స్కేలుపై 3.4గా నమోదు చేశారు. గురువారం ఉదయం 5.27 గంటలకు వాన్స్‌డాకు తూర్పు-ఆగ్నేయంగా 22 కిలోమీటర్ల దూరంలో ఈ భూకంపం సంభవించింది. ఇప్పటివరకు ఎలాంటి ఆస్తి నష్టం, మరణాలు సంభవించలేదని స్థానిక అధికారులు ధృవీకరించారు. గుజరాత్ రాష్ట్రం అధిక భూకంప సంభావ్యత ఉన్న జోన్‌లో ఉంది. గుజరాత్ రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ (జిఎస్డీఎంఎ) ప్రకారం, గత 200 సంవత్సరాలలో ఈ రాష్ట్రంలో 9 ప్రధాన భూకంపాలు సంభవించాయి. అత్యంత విధ్వంసకరమైన భూకంపాలలో ఒకటి 2001 కచ్ భూకంపం. 2001 జనవరి 26న భాచౌలో సంభవించిన 6.9 తీవ్రత గల ఈ భూకంపం వల్ల సుమారు 13,800 మంది మరణించగా, 1.67 లక్షల మంది గాయపడ్డారు.

# బ్రిక్స్ సదస్సు కోసం సెప్టెంబరులో భారత్‌కు పుతిన్!

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్‌లో సెప్టెంబరులో జరగనున్న బ్రిక్స్ సదస్సులో రష్యా అధ్యక్షులు వ్లాదిమిర్ పుతిన్ పాల్గొనే అవకాశం ఉంది. ఈ విషయాన్ని రష్యా విదేశాంగ శాఖ ఉపమంత్రి రుడెంకో ఆంద్రీ యురేవిచ్ కొలంబోలో వెల్లడించారు. బ్రిక్స్ సభ్య దేశాల మధ్య ఏకాభిప్రాయం సాధించడానికి భారత్ చేస్తున్న ప్రయత్నాలకు రష్యా మద్దతు ఇస్తుందని కూడా ఆయన తెలిపారు. 'సెప్టెంబరులో భారత్ ఆతిథ్యం ఇచ్చే బ్రిక్స్ సదస్సులో పాల్గొనాలని మా అధ్యక్షులు పుతిన్‌కు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నుంచి ఆహ్వానం అందింది. పుతిన్ రాకుండా నిరోధించే ఎలాంటి సమస్యలు మాకు ప్రస్తుతానికి కనిపించడం లేదు' అని రష్యా మంత్రి తెలిపారు. సమావేశం నాటికి ఏం జరుగుతుందో మనం చూడాలని, కానీ.. మేం మాత్రం మోడీ ఆహ్వానాన్ని తీవ్రంగానే పరిగణిస్తున్నామని తెలిపారు. శ్రీలంకకు చెందిన థింక్ ట్యాంక్ 'పాత్‌ఫైండర్ ఫౌండేషన్' నిర్వహించిన ఒక సమావేశం సందర్భంగా రుడెంకో మీడియాతో మాట్లాడారు. శ్రీలంక అనుభవిస్తున్న ఇంధన సంక్షోభాన్ని ఎదుర్కొవడానికి రష్యా తగిన మద్దతు ఇస్తుందని హామీ ఇచ్చారు. కాగా, రష్యా ఇంధన శాఖ ఉప మంత్రి రోమన్ మార్షవిన్ శ్రీలంకలో పర్యటించిన వారం రోజుల్లోనే రుడెంకో కూడా ఆ దేశంలో పర్యటించడం విశేషం. అలాగే, బ్రిక్స్‌ను విభిన్న విధానాలు, జాతీయ ప్రాధాన్యతలు కలిగిన దేశాలను ఒక చోట చేర్చే సంస్థగా రుడెంకో అభివర్ణించారు. కాగా, మేలో జరిగే బ్రిక్స్ విదేశాంగ మంత్రులు సమావేశానికి, సెప్టెంబరులో జరిగే బ్రిక్స్ 18వ శిఖరాగ్ర సమావేశానికి అన్ని సభ్య దేశాలకు భారత ప్రభుత్వం గత నెలలోనే ఆహ్వానాలు పంపింది.



# ఇరాన్‌లోని కేన్సర్ కంపెనీపై ఇజ్రాయిల్ దాడి

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని తోఫిగ్ దారు మందుల తయారీ కంపెనీపై అమెరికా, ఇజ్రాయిల్ సైన్యం దాడి చేసినట్లు స్థానిక మీడియా మంగళవారం తెలిపింది. తోఫిగ్ దారు పరిశోధన, ఉత్పత్తి కేంద్రం పలు కేన్సర్‌లకు చికిత్సను అందిస్తోందని, ఇది ఇరాన్ ఆరోగ్య సంరక్షణలో కీలకమైనదిగా పేర్కొంది. బాంబు దాడితో భవనంలోని పలు సదుపాయాలకు తీవ్ర నష్టం వాటిల్లిందని ప్రభుత్వ మీడియా ధ్రువీకరించింది. ఈ సైనిక దురాక్రమణ అనంతరం నష్టానికి సంబంధించిన చిత్రాలను స్థానిక మీడియా విడుదల చేసింది. వైద్య కేంద్రం లక్ష్యంగా దాడి చేయడం కొనసాగుతున్న యుద్ధంలో ప్రమాదకరమైన వైఖరిని సూచిస్తుందని పేర్కొంది. ఇది పౌరులకు అందుబాటులో ఉన్న ఆరోగ్య సంరక్షణపై నేరుగా ప్రభావం చూపుతుందని మీడియా తెలిపింది. ఈ దాడిని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరగ్చీ తీవ్రంగా ఖండించారు. ఇది మౌలిక సదుపాయాలపై జరిగిన ప్రత్యక్ష దాడిగా ఎక్స్‌లో పేర్కొన్నారు. ఇజ్రాయిల్‌లోని యుద్ధ నేరగాళ్లు నేడు బహిరంగంగా, అనైతికంగా ఔషధాల తయారీ కేంద్రంపై దాడి చేశారని, దీంతో వారి యుద్ధ ఉద్దేశ్యం స్పష్టమైందని అన్నారు. అయితే వారు నిస్సహాయులైన పాలస్తీనియా పౌరులతో వ్యవహరించడం లేదని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. అంతర్జాతీయ ఆంక్షలతో ప్రాథమిక వైద్య సామాగ్రి దిగుమతికి ఆటంకం కలుగుతుండటంతో .. మందుల తయారీలో టోఫిగ్ కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. ఈదురాక్రమణకు ఇరాన్ ప్రతీకారం తీర్చుకుంటుందని హెచ్చరించారు. ఆస్తులను ధ్వంసం చేయడమే కాకుండా, తమ ప్రజలకు ప్రాణరక్షక మందులను అందించే సామర్థ్యానికి ఆటంకం కలిగిస్తుందని, దీంతో ఇప్పటికే ఉన్న మానవతా సంక్షోభాన్ని తీవ్రతరం చేసిందని అన్నారు.

కేన్సర్ మందులను ఉత్పత్తి చేసే కేంద్రంపై జరిగిన దాడి, కేన్సర్ రోగులకు వైద్య సేవలు, కీలకమైన సామాగ్రి కొరతను ఆయుధంగా వాడుకుని, అత్యవసర ఆరోగ్య సంరక్షణను యుద్ధసాధనంగా మారుస్తోందని అన్నారు. ఈ చర్య అంతర్జాతీయ మానవతా చట్టాన్ని ఉల్లంఘించడమే కాకుండా, సంక్షోభాన్ని మరింత పెంచడం ద్వారా అంతర్జాతీయ భద్రతకు కూడా తీవ్రమైన ముప్పు కలిగిస్తోందని అన్నారు.

# బెంగాల్‌లో ఎన్నికలను అడ్డుకునే ఉద్దేశ్యపూర్వక చర్య




**హైదరాబాద్ పెన్ పవర్:** పశ్చిమబెంగాల్‌లో ఏడుగురు న్యాయాధికారులను నిర్బంధించడం ఎన్నికలను అడ్డుకునేందుకు జరిగిన ఉద్దేశ్యపూర్వక చర్యగా సుప్రీంకోర్టు గురువారం పేర్కొంది. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం శోచనీయమని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. ఈ ఘటనను సుమోటోగా స్వీకరించినట్లు తెలిపింది. పశ్చిమబెంగాల్‌లో ఉన్నటువంటి రాజకీయ ధ్రువణత తాను ఎన్నడూ చూడలేదని సిజెఐ పేర్కొన్నారు. గురువారం తెల్లవారుజామున 2.00గంటల వరకు తాను మేల్కొని, వివరాలు తెలుసుకుంటున్నానని అన్నారు. సీనియర్ పోలీస్ అధికారులు, పరిపాలనా అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వారిపై భాధ్యతాయుతమైన చర్యలు ఎందుకు తీసుకోకూడదో వివరణనివ్వాలని నోటీసుల్లో పేర్కొన్నారు. మాల్డా జిల్లాలోని కాలియాచక్ సమీపంలో ముగ్గురు మహిళలు సహా ఏడుగురు అధికారులను మధ్యాహ్నం ఓమూక చట్టుముట్టి తొమ్మిదిగంటలకు పైగా నిర్బంధించిన సంగతి తెలిసిందే. అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో పోలీసులు, పారామిలటరీ బృందం వారిని రక్షించింది. ఈ ఘటనకు సంబంధించి స్థానిక అధికారులు బదిలీ చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. న్యాయాధికారులను నిర్బంధిస్తారని ఎవరూ ఊహించలేదని భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) తెలిపింది. పశ్చిమబెంగాల్‌లో జంగిల్ రాజ్ పాలన ఉందని మండిపడింది. ఎస్ఐఆర్ నిర్వహిస్తున్న న్యాయాధికారులకు, ప్రభుత్వ కార్యాలయాలకు రక్షణ కల్పించేందుకు కేంద్ర బలగాలను మోహరించాలని న్యాయస్థానం ఇసిఐని ఆదేశించింది. న్యాయాధికారుల కుటుంబాలకు రక్షణ కల్పించాలని హెచ్చరించింది. ఈ ఘటనపై సిబిఐ లేదా స్వతంత్ర దర్యాప్తుకు ఇసిఐని అనుమతించినట్లు తెలిపింది.

# కేరళ విజయాలు దేశానికి ఆదర్శాలు

**హైదరాబాద్ పెన్ పవర్:** విద్య, ఆరోగ్య రంగాలలో కేరళ సాధించిన అద్భుత విజయాలు దేశానికి ఒక ఆదర్శమని ఆర్‌జెడి నాయకులు, బీహార్‌లో ప్రతిపక్ష నేత తేజస్వి యాదవ్ ప్రశంసించారు. కేరళ నుంచి బీహార్ చాలా నేర్చుకోవాలని కోరుకుంటుందని వ్యాఖ్యానించారు. కేరళలో అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రచారంలో పాల్గొన్న తేజస్వి యాదవ్ ఈ వ్యాఖ్యలు చేశారు. పొన్నాని నియోజకవర్గం నుంచి ఎల్‌డిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అడ్వకేట్ ఎంకే జాకిర్ ఎన్నికల ప్రచారం కోసం నిర్వహించిన భారీ బహిరంగ సభలో తేజస్వి యాదవ్ ప్రసంగించారు. 'కుల, మత భేదాలకు అతీతంగా కేరళ పాటిస్తున్న సామరస్యం ప్రపంచానికి ఒక ఉదాహరణ. బీహార్ ఒక పేద రాష్ట్రంగా కొనసాగుతుండగా, కేరళ తీవ్ర పేదరికం లేని రాష్ట్రంగా మారడం దేశానికి గర్వకారణం. వామపక్ష ప్రభుత్వం కేరళను ఈ అభివృద్ధి పథంలో నడిపించిందని, దేశానికి ఇదే ప్రభుత్వం కొనసాగడం అవసరం' అని ఆయన అన్నారు. పొన్నాని నగర, పొన్నాని దక్షిణ స్థానిక ఎల్‌డిఎఫ్ కమిటీలు నిర్వహించిన భారీ ర్యాలీ అనంతరం ఈ బహిరంగ సభ నిర్వహించారు. ఎమ్మెల్యే పి. నందకుమార్ ఈ సమావేశాన్ని ప్రారంభించారు. ఏకే జబ్బార్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం. స్వరాజ్ కీలకోపన్యాసం చేశారు. ఆర్‌జెడి రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వి. శ్రేయంకుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. టి సత్యన్, అడ్వకేట్ ఇ సింధు, సిపి ముహమ్మద్ కుంజి, సివి సుధ, కెకె బాబు, యుకె అబూబక్కర్, రఫీక్ మారంచేరి వంటి ప్రముఖ నాయకులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఎంఎ హమీద్ సభికులకు స్వాగతం పలికారు. ఎల్‌డిఎఫ్ కార్యకర్తలు భారీగా హజరైన ఈ అద్భుతమైన ర్యాలీ పొన్నాని నగరాన్ని ఎర్రగా మార్చేసింది.



# పౌరసత్వం తనిఖీ ఈసీ పని కాదు



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత ఎన్నికల సంఘం (ఈసీ) చేపడుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై (సర్) ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అభ్యంతరం వ్యక్తం చేశారు. పౌరసత్వాన్ని తనిఖీ చేయడం ఈసీ పరిధిలో లేదని, అది హోం మంత్రిత్వశాఖ బాధ్యతని స్పష్టం చేశారు. ఈ అంశంపై ఇప్పటికే సుప్రీం కోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసినట్లు తెలిపారు. బెంగాల్‌లో ఎన్నికల ప్రచారానికి వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. 'సర్ ప్రక్రియకు మేం వ్యతిరేకం. సుప్రీం కోర్టులో మా రిట్ పిటిషన్ ప్రస్తుతం పెండింగ్‌లో ఉంది. పౌరసత్వాన్ని తనిఖీ చేసే అధికారం ఎన్నికల సంఘానికి లేదు. ఇది హోం మంత్రిత్వశాఖ బాధ్యత. మేం చెప్పేది ఇంతే. బెంగాల్‌లో ఓటర్ల జాబితా తుది ప్రకటన ఆలస్యమవుతోంది. వివాదాస్పద జాబితాలో ఉన్న పేర్లను వెంటనే ఖరారు చేయాలి. ఇప్పటికే ఎన్నికల ప్రక్రియ మొదలైంది. ఇలాంటి ఆలస్యం తగదు. దీనిని సరిదిద్దాల్సిన అవసరం ఉంది' అని ఒవైసీ స్పష్టం చేశారు. నౌడాలో ఏజేయూపీ అభ్యర్థికి మద్దతుగా ఒవైసీ ప్రచారం చేశారు. గత 50 ఏళ్లలో ముస్లింలను కాంగ్రెస్, లెఫ్ట్, తృణమూల్ మోసం చేశాయని ఆరోపించారు. వారి పరిస్థితి ఏ మాత్రం మెరుగుపడలేదని పేర్కొన్నారు.

'సర్'పై 47 లక్షల అభ్యంతరాల పరిష్కారం

# బెంగాల్‌లో ఆ ప్రక్రియ పురోగతిపై సుప్రీంకోర్టు సంతృప్తి

**హైదరాబాద్ పెన్ పవర్:** పశ్చిమ బెంగాల్‌లో ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కసరత్తులో భాగంగా కొనసాగుతున్న అభ్యంతరాల పరిష్కార ప్రక్రియ పురోగతిపై సుప్రీంకోర్టు సంతృప్తి వ్యక్తం చేసింది. ఓటరు జాబితాలో పేర్ల తొలగింపు, జాబితాలో చేర్చకపోవడానికి సంబంధించి మొత్తం 60 లక్షల అభ్యంతరాలు రాగా వాటిలో మార్చి 31నాటికి సుమారు 47.4 లక్షల అభ్యంతరాలు పరిష్కారమైన విషయాన్ని సర్వోన్నత న్యాయస్థానం గుర్తించింది. ఇదే అంశమై కలకత్తా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి పంపిన రెండు నివేదికలను సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం.పంచోలితో కూడిన త్రిసభ్య ధర్మాసనం పరిశీలించింది. రోజుకు దాదాపు 1.75 లక్షల నుంచి 2 లక్షల అభ్యంతరాలను పరిష్కరిస్తుండడంపై సంతృప్తి వ్యక్తం చేసింది. పెండింగ్‌లో ఉన్న అభ్యంతరాలన్నీ ఏప్రిల్ 7 నాటికి పరిష్కారమయ్యే అవకాశం ఉందని హైకోర్టు చీఫ్ జస్టిస్ తన నివేదికలో పేర్కొన్నారు. దీంతో బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ దాఖలు చేసిన పిటిషన్లతో సహా అన్ని పిటిషన్లపై తదుపరి విచారణను ఈ నెల 9వ తేదీకి సుప్రీంకోర్టు వాయిదా వేసింది.

# యుద్ధం వేళ కేంద్రం మరో నిర్ణయం..
# పెట్రోకెమికల్స్ దిగుమతులపై ఊరట

పశ్చిమాసియా ఉద్రిక్తతల ప్రభావం దేశ ప్రజలపై పడకుండా ఉండేందుకు కేంద్రం చర్యలు ముమ్మరం చేస్తోంది. ఇప్పటికే పెట్రోల్, డీజిల్‌పై విధిస్తున్న అదనపు ఎక్సైజ్ డ్యూటీని తగ్గించిన సంగతి తెలిసిందే. తాజాగా కొన్ని కీలక పెట్రో కెమికల్ ఉత్పత్తులకు దిగుమతి సుంకాన్ని మినహాయించింది. నేటి (ఏప్రిల్ 2) నుంచి జూన్ 30 వరకు ఈ మినహాయింపు అమల్లో ఉండనుంది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ ఓ ప్రకటన విడుదల చేసింది."దేశీయ పరిశ్రమకు కీలకమైన పెట్రో కెమికల్ ముడిసరకుల లభ్యతకు ఆటంకం కలగకుండా చూడటం, దీనిపై ఆధారపడిన రంగాలపై వ్యయ ఒత్తిళ్లను తగ్గించడం, దేశంలో సరఫరా స్థిరత్వాన్ని కాపాడటం కోసం ఈ చర్యలు చేపట్టాం. అయితే, ఈ కస్టమ్స్ డ్యూటీ మినహాయింపు తాత్కాలికమే. దీనివల్ల తుది ఉత్పత్తులను కొనుగోలు చేసే వినియోగదారుల పైనా అదనపు భారం పడకుండా ఉపశమనం లభిస్తుంది" అని ఆర్థిక మంత్రిత్వశాఖ తమ ప్రకటనలో వెల్లడించింది. మిథనాల్, అన్‌హైడ్రస్ అమోనియా, డైక్లోరోమిథేన్, వినైల్ క్లోరైడ్ మోనోమర్, స్టిరేన్, పాలీ బ్యుటడిన్, స్టీరేన్ బ్యుటడిన్, అన్‌శాచురేటెడ్ పాలిస్టర్ రెసిన్స్ వంటి పెట్రో కెమికల్స్‌కు దిగుమతి సుంకాన్ని మినహాయించారు. ఈ నిర్ణయంతో ప్లాస్టిక్, టెక్స్‌టైల్స్, ఫార్మా, ఆటో, కెమికల్ రంగాలకు లాభం చేకూరనుందని కేంద్రం పేర్కొంది. పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా హర్మూజ్ మీదుగా సరకు రవాణాకు అంతరాయం ఏర్పడిన సంగతి




తెలిసిందే. దీంతో ముడిచమురు, గ్యాస్, ఎరువులు, ఇతర ఫెర్టిలైజర్స్, పెట్రోలియం ఉత్పత్తులకు భారత్ ప్రధాన రసాయనాల దిగుమతులపై ఆందోళనలు నెలకొన్నాయి. దిగుమతిదారుగా ఉంది.

# పాత పెట్టుబడులపై పన్ను ఉండదు: సీబీడీటీ




పాత పెట్టుబడులపైనా పన్ను విధిస్తారనే పరిశ్రమ వర్గాల దీర్ఘకాలిక ఆందోళనలకు కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) పరిష్కారం చూపింది. 2017 ఏప్రిల్ 1కి ముందు చేసిన పెట్టుబడుల బదిలీ ద్వారా వచ్చే ఆదాయానికి 'గార్' (జనరల్ యాంటీ అవాయిడెన్స్ రూల్స్) వర్తించవని ఆదాయపు పన్ను విభాగం స్పష్టం చేసింది. ఈ మేరకు ఆదాయపు పన్ను నిబంధనలు-2026ని సీబీడీటీ సవరించింది. విదేశీ మదుపర్లు పన్ను ఎగవేతలకు పాల్పడకుండా నిరోధించే లక్ష్యంతో 2012-13 కేంద్ర బడ్జెట్‌లో గార్ విధానాన్ని ప్రకటించారు. వాణిజ్యపరమైన వాస్తవికత లేని లావాదేవీల ద్వారా పన్ను ఎగవేతను అరికట్టేందుకు ఉద్దేశించిన ఈ నిబంధనలు 2017 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చాయి. ఆ తేదీకి ముందు కొనుగోలు చేసిన పెట్టుబడులు, లావాదేవీలకు పన్నుల నుంచి మినహాయింపు (గ్రాండ్‌ఫాదరింగ్) కల్పించారు. రూల్ 128కి చేసిన తాజా సవరణతో గార్ గ్రాండ్‌ఫాదరింగ్ కింద ఉన్న అస్పష్టత తొలగిపోయిందని, 2017 తర్వాత వచ్చే పన్ను ప్రయోజనాల అన్వయంపై ఉన్న అనుమానాలు తీరి పెట్టుబడిదారులకు భరోసా లభిస్తుందని ఏకేఎం గ్లోబల్ పార్ట్‌నర్-ట్యాక్స్ సందీప్ సెహగల్ తెలిపారు. 2017 ఏప్రిల్ 1కు ముందు చేసిన పెట్టుబడుల బదిలీపై వచ్చే ఆదాయాన్ని గార్ పరిధి నుంచి మినహాయించినట్లు సీబీడీటీ ఇప్పుడు స్పష్టంగా పేర్కొనడంతో, పరిశ్రమల ఆందోళన తీరిందని ఏఎంఆర్‌జీ గ్లోబల్ మేనేజింగ్ పార్ట్‌నర్ రజత్ మోహన్ చెప్పారు.

# రూ.2 లక్షల కోట్లు దాటిన జిఎస్‌టి వసూళ్లు

ఆర్థిక సంవత్సరం 2025-26 ముగింపు నెల మార్చిలో దేశంలో స్థూల వస్తు, సేవల పన్ను వసూళ్లు (జిఎస్‌టి) భారీగా నమోదయ్యాయి. గడిచిన నెలలో 8.8 శాతం పెరిగి రూ.2 లక్షల కోట్ల మేర వసూళ్లు జరిగాయి. అత్యధిక పన్ను వసూళ్లు నమోదవడం ఇది మూడో సారి. ఇంతక్రితం 2025 ఏప్రిల్‌లో రికార్డ్ స్థాయిలో రూ.2.36 లక్షల కోట్లు, మేలో రూ.2.01 లక్షల కోట్ల చొప్పున భారీగా వసూళ్లయ్యాయి. 2025 మార్చిలోని జిఎస్‌టి వసూళ్లు రూ.1.83 లక్షల కోట్లతో పోల్చితే దాదాపు 9 శాతం పెరుగుదల చోటు చేసుకుంది. గడిచిన ఆర్థిక సంవత్సరం 2025-26లో స్థూలంగా 8.3 శాతం పెరిగి రూ.22.27 లక్షల కోట్ల జిఎస్‌టి వసూళ్లు నమోదయ్యాయి. గడిచిన మార్చి మాసంలో దేశీయంగా విక్రయాలు పెరగడం, దిగుమతుల కారణంగా పన్ను వసూళ్లు భారీగా పెరిగాయని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. దేశీయంగా విక్రయాల ద్వారా 5.8 శాతం వృద్ధితో రూ.1.46 లక్షల కోట్ల మేర జిఎస్‌టి ఆదాయం సమకూరగా.. దిగుమతుల రూపంలో 17.8 శాతం పెరుగుదలతో రూ.53,861 కోట్ల వసూళ్లు చోటు చేసుకున్నాయి. రిఫండ్ల సర్దుబాటు అనంతరం నికరంగా జిఎస్‌టి వసూళ్లు రూ.1.78 లక్షల కోట్లుగా నమోదయ్యాయి.




# ఒరాకిల్‌లో ఉద్యోగం పోయిందని ఏడుస్తూ కూర్చోవద్దు..
# కొత్త ఉత్సాహంతో అడుగులు వేయండి: బెంగళూరు సీఈఓ




టెక్ ప్రపంచంలో లేఆఫ్స్ కొన్నాళ్లుగా సర్వ సాధారణంగా మారాయి. ఒరాకిల్ ఇండియాలో 12వేల మంది ఉద్యోగులను తొలగించటం దేశంలోని ఐటీ కారిడార్లలో కలకలం రేపింది. అయితే ఉద్యోగం పోయిందనే ఆందోళనలో దిగులుగా ఉన్న టెక్కీలకు ధైర్యం చెబుతూ.. భవిష్యత్తులో కొత్త అవకాశాలను ఎలా అందిపుచ్చుకోవాలనే మెసేజ్ బెంగళూరుకు చెందిన ప్రముఖ సీఈఓ ప్రదీప్ సౌందరరాజన్ పంచుకున్నారు. ఆయన తన లింక్డ్‌ఇన్ పోస్ట్‌లో షేర్ చేసిన విషయాలు ప్రతి టెక్కీ కచ్చితంగా చదవాల్సిన అవసరం ఉంది. లేఆఫ్ కారణంగా జరిగిన నష్టం నుంచి ఎలా ముందుకెళ్లాలో టెక్కీలకు నేర్పిస్తోంది.

**గతాన్ని గౌరవించండి.. భవిష్యత్తు వైపు వెళ్లండి**

ఉద్యోగం పోవడం అనేది పర్సనల్ ఫెయిల్యూర్ కాదని.. అది కేవలం కంపెనీ నాయకత్వ మార్పులు, వ్యాపార వ్యూహాల వల్ల జరిగే ప్రక్రియన్నారు ప్రదీప్. అందువల్ల టెక్కీలు పాత కంపెనీలో గడిపిన సమయానికి కృతజ్ఞతగా ఉండాలని సూచించారు. అక్కడ నేర్చుకున్న పాఠాలను గుర్తుంచుకోవాలని.. కానీ ఆ ఆలోచనల్లోనే మిగిలిపోకూడదని అన్నారు. ఎమోషనల్ అయ్యి టైమ్ వేస్ట్ చేసుకోకుండా.. జరిగిన దాన్ని తీసుకుని రెట్టింపు ఉత్సాహంతో ముందుకు సాగడమే అసలైన గెలుపని గుర్తుచేశారు.

**సరికొత్త సీవీకి శ్రీకారం..**

సాధారణంగా ఉద్యోగులు జాబ్ సెర్చ్ కోసం తమ పాత సీవీలనే అప్డేట్ చేస్తుంటారు. లేఆఫ్స్ వల్ల జాబ్ పోగొట్టుకున్న టెక్కీలు తమ అనుభవం గురించి 10 పేజీల సెల్ఫ్ రివ్యూ రాసుకోవాలని ప్రదీప్ చెబుతున్నారు. గత ఉద్యోగంలో మీరు సాధించినవి ఏంటి? ఎక్కడ ఫెయిల్ అయ్యారు? కొత్త జాబ్ వస్తే మీరు చేయబోయే మార్పులేంటి? అనే అంశాలను అక్కడ రాయాలన్నారు. ఇంటర్వ్యూ సమయంలో కేవలం రెజ్యూమ్ మాత్రమే కాకుండా.. ఇలాంటి వివరాలు పంచుకోవటం వల్ల మీ పట్ల కంపెనీలకు నమ్మకం పెరుగుతుందని చెప్పారు.

**చిన్న కంపెనీలే పెద్ద అవకాశాలు..**

పెద్ద పెద్ద కంపెనీల్లో సిస్టమ్స్ నెమ్మదిగా ఉంటాయని, అందుకే అక్కడ వృద్ధి మందగిస్తుందని అభిప్రాయపడ్డారు ప్రదీప్. ప్రస్తుతం మీకున్న స్కిల్స్ గుర్తించే
చిన్న మధ్య తరహా కంపెనీలు, స్టార్టప్స్ వైపు వెళ్లటం బెటర్ అన్నారు. అక్కడ మంచి హోదా, శాలరీతో పాటు ఈక్విటీలు పొందే అవకాశం కూడా ఉంటుందని సూచించారు. అలాగే డెవలపర్లు, టెస్టింగ్ టీమ్స్, సేల్స్ టీమ్ వారు మిగిలిన పనులు నేర్చుకుంటూ మల్టీ-టాలెంటెడ్ గా మారొచ్చని చెప్పారు.

**పాత కష్టాలే కొత్త విజయాలు..**

ప్రదీప్ తన పర్సనల్ మెమట్నరీస్ పంచుకుంటూ.. తాను కూడా ఒకప్పుడు ఉద్యోగం పోయినప్పుడు ఇంటర్వ్యూలకు వెళ్లడానికి డబ్బులు లేక అప్పులు చేసిన రోజులను గుర్తు చేసుకున్నారు. అవే కష్టాలు తనను ప్రస్తుతం ఒక కంపెనీకి సీఈఓగా నిలబెట్టాయని చెబుతూ.. మార్కెట్ పరిస్థితులు మారవచ్చు కానీ అవకాశాలు మాత్రం ఎప్పుడూ ఉంటాయని భరోసా ఇచ్చారు. ప్రతి ముగింపు ఒక కొత్త ఆరంభానికే అని అధైర్య పడొద్దంటూ సోషల్ మీడియాలో టెక్కీలకు బూస్టప్ ఇచ్చారు బెంగళూరు కంపెనీ సీఈఓ ప్రదీప్.

## మళ్లీ గోల్డ్ రేటు క్రాష్..
## ట్రంప్ ప్రకటనతో బులియన్ మార్కెట్ షేక్




వారం రోజులుగా పెరుగుతూ వస్తున్న బంగారం ధరలకు మళ్లీ బ్రేక్ పడింది. అంతర్జాతీయ రాజకీయ పరిణామాల నేపథ్యంలో దేశీయ మార్కెట్‌లో పసిడి, వెండి ధరలు భారీగా పతనమయ్యాయి. ఇరాన్‌పై భీకర యుద్ధం తప్పదని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేసిన సంచలన ప్రకటన బులియన్ మార్కెట్‌ను ఒక్కసారిగా కుదిపేసింది. ఈ మేరకు ఇవాళ హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల బంగారంపై ఏకంగా రూ.1,530 తగ్గింది. దీంతో 10 గ్రాముల స్వచ్ఛమైన బంగారం ధర రూ. 1,51,420కు చేరింది. ఆభరణాల తయారీకి వాడే పసిడి ధర రూ.1,400 మేర పతనమై రూ.1,38,800 వద్ద కొనసాగుతోంది. బంగారం బాటలోనే వెండి కూడా భారీగా క్షీణించింది. కేజీ వెండి ధరపై ఏకంగా రూ.10,000 మేర కోత పడింది. దీంతో ప్రస్తుతం కేజీ వెండి ధర రూ.2,55,000 వద్ద ట్రేడ్ అవుతోంది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై దాడులు కొనసాగుతాయని చేసిన హెచ్చరికలతో ప్రపంచవ్యాప్తంగా మార్కెట్లలో అనిశ్చితి నెలకొంది. యుద్ధ భయాల నేపథ్యంలో డాలర్ ఇండెక్స్, బాండ్ ఈల్డ్స్‌లో మార్పులు రావడం, ఇన్వెస్టర్లు ప్రాఫిట్ బుకింగ్‌కు మొగ్గు చూపడం వంటి కారణాలతో బంగారం ధరలు దిగివచ్చాయని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. మరోవైపు పెళ్లిళ్ల సీజన్ కావడంతో బంగారం ధర తగ్గడంతో సామాన్య ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## భారత టెలికాం సంచలనం..
## 132 కోట్లకు చేరిన చందాదారుల సంఖ్య




భారతదేశ టెలికాం రంగం పరుగులు కొనసాగుతూనే ఉన్నాయి. ట్రాయ్ నివేదిక ప్రకారం.. ఫిబ్రవరి 2026 చివరి నాటికి దేశంలోని మొత్తం టెలిఫోన్ వినియోగదారుల సంఖ్య 1,321.31 మిలియన్లకు (132.13 కోట్లు) చేరుకుంది. కేవలం ఫిబ్రవరి నెలలోనే రికార్డు స్థాయిలో 7.31 మిలియన్ల కొత్త చందాదారులు నెట్‌వర్క్‌లో చేరారు. బ్రాడ్‌బ్యాండ్ విభాగంలో చోటుచేసుకున్న భారీ వృద్ధి ఈ విజయానికి ప్రధాన కారణంగా నిలిచినట్లు తెలుస్తుంది. దేశంలో బ్రాడ్‌బ్యాండ్ వినియోగదారుల సంఖ్య జనవరిలో 1,052.72 మిలియన్లు ఉండగా, ఫిబ్రవరి నాటికి అది 1,059.05 మిలియన్లకు పెరిగినట్లు సమాచారం. బ్రాడ్‌బ్యాండ్ మార్కెట్‌లో రిలయన్స్ జియో 519.64 మిలియన్ల చందాదారులతో తన అగ్రస్థానాన్ని సుస్థిరం చేసుకున్నట్లు ట్రాయ్ నివేదిక స్పష్టం చేసింది. దీని తర్వాత భారతీ ఎయిర్‌టెల్ 364.14 మిలియన్లతో రెండో స్థానంలో ఉండగా, వొడాఫోన్ ఐడియా (129.36 మిలియన్లు), బీఎస్ఎన్ఎల్ (28.70 మిలియన్లు) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఇక వైర్డ్ బ్రాడ్‌బ్యాండ్ విభాగంలో కూడా జియో (14.10 మిలియన్లు), ఎయిర్‌టెల్ (10.54 మిలియన్లు) ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తున్నాయి. దేశవ్యాప్త టెలి-డెన్సిటీ92.66 శాతానికి చేరుకోగా, పట్టణ ప్రాంతాల్లో ఇది అత్యధికంగా 142.32 శాతంగా నమోదైంది. వినియోగదారులు తమకు నచ్చిన నెట్‌వర్క్‌కు మారే ప్రక్రియ కూడా వేగంగా సాగుతోంది. ఫిబ్రవరి నెలలో ఏకంగా 14.47 మిలియన్ల మంది మొబైల్ నెంబర్ పోర్టబిలిటీ కోసం దరఖాస్తు చేసుకోవడం విశేషం. ప్రైవేట్ టెలికాం సంస్థలు మార్కెట్‌లో 92.59 శాతం వాటాతో ఆధిపత్యం చెలాయిస్తుండగా, ప్రభుత్వ రంగ సంస్థలైన బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్ వాటా 7.41 శాతానికి పరిమితమైంది. గ్రామీణ ప్రాంతాల్లో కూడా కనెక్టివిటీ పెరుగుతుండటం టెలికాం రంగ విస్తరణకు నిదర్శనంగా కనిపిస్తుంది.

## 98.45 శాతం రూ. 2 వేల నోట్లు వెనక్కి




చలామణీలో ఉన్న 98.45 శాతం రూ.2 వేల నోట్లు తిరిగి బ్యాంకులకు చేరాయని భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) బుధవారం ప్రకటనలో వెల్లడించింది. ఈ ఏడాది మార్చి 31 నాటికి ఇంకా రూ. 5,501 కోట్ల విలువ పెద్ద నోట్లు ప్రజల వద్దే ఉన్నాయని తెలిపింది. 2023, మే 19న రూ. 2,000 నోట్ల ఉపసంహరణ ప్రకటన వెలువడే సమయానికి వ్యవస్థలో మొత్తం రూ. 3.56 లక్షల కోట్ల విలువైన నోట్లు ఉన్నాయి. ఈ నోట్లను ఆర్‌బీఐ చలామణి నుంచి ఉపసంహరించుకున్నప్పటికీ అవి చట్టబద్ధంగా చెల్లుబాటు అవుతాయి. ఎవరి వద్దనైనా ఆ నోట్లు ఉంటే ఆర్‌బీఐ కార్యాలయాల్లో డిపాజిట్ చేయవచ్చు లేదా మార్చుకోవచ్చు. 2023, అక్టోబర్ 9వ తేదీ నుంచి ఆయా నోట్లను వ్యక్తులు, సంస్థలు ఆర్‌బీఐ ఆఫీసుల్లో అందజేస్తే, ఆ మొత్తాన్ని వారి అకౌంట్లలో డిపాజిట్ చేసే అవకాశం కల్పించింది. అదేవిధంగా దేశవ్యాప్తంగా ఉన్న పోస్టాఫీసుల నుంచి కూడా ప్రజలు తమ వద్ద రూ. 2,000 నోట్లను ఆర్‌బీఐకి పోస్టల్ రూపంలో పంపి, తమ అకౌంట్లలో క్రెడిట్ చేయించుకొనే వీలు కల్పించింది.

# ఎండా కాలంలో ఇంటిని చల్లగా ఉంచుకోవాలా?

**హైదరాబాద్ పెన్ పవర్:** భారీ కరెంట్ బిల్లుల భయం లేకుండా, మన పూర్వీకులు పాటించిన సహజ పద్ధతులు మరియు ఆధునిక ఇంటీరియర్ చిట్కాలతో మీ ఇంటిని చల్లని నందనవనంలా మార్చుకోవచ్చు. వేసవి కాలం రానే వచ్చింది. ఏప్రిల్ నుంచి ఎండలు మరింత తీవ్రమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఎండ వేడి పెరగగానే మనందరి దృష్టి ఏసీలు, కూలర్లపై పడుతుంది. అయితే, ఏసీలు కొనే శక్తి అందరికీ ఉండకపోవచ్చు, ఒకవేళ కొన్నా భారీగా వచ్చే కరెంట్ బిల్లులు సామాన్యుడిని భయపెడుతున్నాయి. ఈ నేపథ్యంలో, ఏసీ లేదా కూలర్ అవసరం లేకుండానే ఇంటిని సహజంగా చల్లగా ఉంచుకునే అద్భుతమైన మార్గాలు మన పూర్వీకుల కాలం నుంచే ఉన్నాయి. అవేంటో వివరంగా తెలుసుకుందాం.



ఇంటిని చల్లగా ఉంచడంలో కిటికీలు కీలక పాత్ర పోషిస్తాయి. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు కిటికీలు మూసి ఉంచాలి. ఎందుకంటే ఈ సమయంలో బయట వేడి గాలి ఎక్కువగా ఉంటుంది. సాయంత్రం 6 గంటల తర్వాత కిటికీలు తెరిస్తే రాత్రంతా చల్లని గాలి లోపల సర్క్యులేట్ అవుతుంది. కిటికీల బయట వెదురు లేదా వట్టివేళ్ల తడకలు కట్టడం వల్ల ఎండ నేరుగా అద్దాలపై పడకుండా అడ్డుకోవచ్చు. వేసవిలో ముదురు రంగు కర్టెన్లు సూర్యరశ్మిని పీల్చుకుని గదిని వేడెక్కిస్తాయి. వీటికి బదులుగా తెల్లటి లేదా లేత రంగు కర్టెన్లు వాడాలి. ఇవి సూర్యరశ్మిని పరావర్తనం చెందించి, ఇంటి లోపల ప్రశాంతమైన వెలుతురును, చల్లదనాన్ని ఇస్తాయి.మన పూర్వీకులు వాడిన అత్యంత ప్రభావవంతమైన పద్ధతి తడకలు. ముఖ్యంగా వట్టివేళ్ల తడకలపై నీళ్లు చల్లడం వల్ల అవి గాలిని శుద్ధి చేసి, సహజమైన చల్లదనాన్ని ఇస్తాయి. వీటి నుంచి వచ్చే మట్టి వాసన మానసిక ప్రశాంతతకు కూడా దోహదపడుతుంది.అలోవెరా, స్నేక్ ప్లాంట్, మనీ ప్లాంట్ వంటి మొక్కలు కేవలం అందం కోసమే కాదు, ఇవి గాలిలోని వేడిని పీల్చుకుని తేమను పెంచుతాయి. ఫలితంగా గది ఉష్ణోగ్రత తగ్గుతుంది. ఇవి హానికర వాయువులను పీల్చుకుని స్వచ్ఛమైన ఆక్సిజన్‌ను అందిస్తాయి.సాధారణ బల్బులు ఎక్కువ వేడిని విడుదల చేస్తాయి. వీటికి బదులుగా ఎల్‌ఈడీ లైట్లు వాడటం వల్ల ఉష్ణోగ్రత తగ్గడమే

కాకుండా కరెంట్ బిల్లు కూడా ఆదా అవుతుంది.బెర్కిలీ ల్యాబ్ అధ్యయనం ప్రకారం, ఇంటి డాబాపై 'కూల్ రూఫ్ పెయింట్' వేయడం వల్ల సూర్యకిరణాలు ఆకాశంలోకి పరావర్తనం చెందుతాయి. దీనివల్ల ఇంటి స్లాబ్ వేడెక్కదు. వేసవి తాపం నుండి తప్పించుకోవడానికి ఏసీ ఒక్కటే మార్గం కాదు. ప్రకృతికి అనుకూలమైన జీవనశైలిని అలవరచుకుంటే ఏసీలు లేకపోయినా మన ఇల్లు హాయిగా ఉంటుంది. పైన చెప్పిన సహజ పద్ధతులను పాటించి ఈ వేసవిని చల్లగా గడపండి.

# రాత్రి ఫ్రిజ్‌లో పెట్టిన నాన్‌వెజ్ కర్రీ తింటున్నారా..?



మనలో చాలా మంది చికెన్ కూర, ఫ్రై మిగిలితే ఫ్రిజ్‌లో పెట్టి మరుసటి రోజు తింటుంటారు. కానీ నిపుణుల సూచన ప్రకారం.. ఇది ఆరోగ్యానికి హానికరం. ఫ్రిజ్‌లో నిల్వ చేసిన చికెన్ వంటకాలలో బ్యాక్టీరియా వేగంగా పెరిగి ఆహార విషబాధకు దారితీయవచ్చు. అత్యంత సురక్షితం కావాలంటే, వంటకాన్ని వెంటనే తినడమే మంచిది. సాధారణంగా చాలా మంది ఇంట్లో రాత్రిపూట మిగిలిపోయిన చికెన్ కర్రీ లేదా నాన్ వెజ్ కర్రీ, ఫ్రైలను ఫ్రిజ్‌లో పెట్టి మరుసటి రోజు తింటుంటారు. దీని వల్ల ఆహారం వృథా కాకుండా ఉంటుంది అని అనుకుంటారు. కానీ వైద్య నిపుణుల ప్రకారం, ఇది ఆరోగ్యానికి ప్రమాదకరం. ఎందుకంటే.. చికెన్‌లో ప్రోటీన్ ఎక్కువగా ఉంటుంది. వండిన తర్వాత ఎక్కువసేపు గది ఉష్ణోగ్రతలో ఉంచితే లేదా ఫ్రిజ్‌లో పెట్టి మళ్లీ వేడి చేసినా, బ్యాక్టీరియా వేగంగా పెరుగుతుంది. వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి, తలనొప్పి, జ్వరం, నీరసం, ఈ సమస్యలు ముఖ్యంగా పిల్లలు, గర్భిణీలు, వృద్ధులు, రోగనిరోధక శక్తి తక్కువవారు లోతుగా తీవ్రత చెందవచ్చు. చాలామంది ఫ్రిజ్‌లో ఉంచితే సురక్షితం అని అనుకుంటారు. కానీ నిజం ఇదే: ఫ్రిజ్‌లో బ్యాక్టీరియా పూర్తిగా చనిపోదు; పెరుగుదల మాత్రమే నెమ్మదీ అవుతుంది. ఆహారాన్ని మళ్లీ వేడి చేసినా, బ్యాక్టీరియా ఉత్పత్తి చేసిన విష పదార్థాలు నిర్జీవంగా ఉంటాయి. ఇవే ఫుడ్ పాయిజనింగ్‌కు ప్రధాన కారణం.

# ఉదయం ఖాళీ కడుపుతో కాఫీ తాగడం మంచిదా?



చాలా మంది ఉదయాన్నే ఖాళీ కడుపుతో కాఫీతో ప్రారంభిస్తారు. దీనిని ఒక సాధారణ అలవాటుగా విస్మరించకూడదు. ఎందుకంటే ఇది ఆరోగ్యానికి హానికరం కావచ్చు. చాలామందికి ఉదయం తమ రోజును కాఫీతో ప్రారంభించడం అలవాటు. ఎందుకంటే కాఫీ తక్షణ శక్తి, తాజాదనాన్ని అందిస్తుంది. ఇందులో ఉండే కెఫీన్ మెదడును ఉత్తేజపరుస్తుంది, మేల్కొనడానికి, పని చేయడానికి ప్రేరేపిస్తుంది. అలసటభరితమైన జీవనశైలి, ఉదయం పని ప్రారంభించడం వంటి కారణాల వల్ల చాలా మంది అల్పాహారానికి ముందే కాఫీ తాగుతారు.

ఉదయం ఖాళీ కడుపుతో కాఫీ తాగితే శరీరంపై ప్రభావం పడుతుంది. ఎందుకంటే ఖాళీ కడుపులో కెఫీన్, ఆమ్ల పదార్థాలు వేగంగా పనిచేస్తాయి. ఇది ఒత్తిడి హార్మోన్లను పెంచి శరీర సమతుల్యాన్ని ప్రభావితం చేస్తుంది. అందువల్ల, కాఫీ తాగిన తర్వాత కొందరికి ఆందోళన, చంచలత్వం, గుండె వేగంగా కొట్టడం వంటి లక్షణాలు కనిపించవచ్చు. డాక్టర్ అనామిక గౌర్ (మాజీ డైటీషియన్, ఉః హాస్పిటల్, ఢిల్లీ) తెలిపినట్టుగా.. ఖాళీ కడుపుతో కాఫీ తాగడం కడుపులో మంట, అసౌకర్యం, జీర్ణ సమస్యలు, గ్యాస్ లేదా ఎసిడిటీకి దారితీస్తుంది. అలాగే, రక్తంలో చక్కెర స్థాయిలలో హెచ్చుతగ్గులు, నిద్ర సమస్యలు, రోజంతా అలసట ఏర్పడే అవకాశం ఉంటుంది.

# పడుకునే ముందు ముఖానికి కొబ్బరి నూనె రాస్తే..



దుమ్ము, కాలుష్యం చర్మాన్ని దెబ్బతీస్తాయి. రోజువారీ ఒత్తిడి ప్రభావాలు చర్మంపై కనిపిస్తాయి. అందువల్ల చర్మ సంరక్షణ కోసం ఖరీదైన చర్మ సంరక్షణ ఉత్పత్తులను ఆశ్రయించాల్సిన అవసరం లేదు. నిద్రపోయే ముందు కొబ్బరి నూనెతో ముఖానికి మర్దన చేసుకుంటే సరిపోతుంది. కొబ్బరి నూనెలో ఉండే యాంటీఆక్సిడెంట్లు, ఫ్యాటీ యాసిడ్లు, తేమను అందించే గుణాలు. దుమ్ము, కాలుష్యం చర్మాన్ని దెబ్బతీస్తాయి. రోజువారీ ఒత్తిడి ప్రభావాలు చర్మంపై కనిపిస్తాయి. అందువల్ల చర్మ సంరక్షణ కోసం ఖరీదైన చర్మ సంరక్షణ ఉత్పత్తులను ఆశ్రయించాల్సిన అవసరం లేదు. నిద్రపోయే ముందు కొబ్బరి నూనెతో ముఖానికి మర్దన చేసుకుంటే సరిపోతుంది. కొబ్బరి నూనెలో ఉండే యాంటీఆక్సిడెంట్లు, ఫ్యాటీ యాసిడ్లు, తేమను అందించే గుణాలు చర్మానికి లోతైన పోషణను అందించడంలో సహాయపడతాయి. కొబ్బరి నూనె ఒక అద్భుతమైన సహజ మాయిశ్చరైజర్. రాత్రి పడుకునే ముందు దీనిని మీ ముఖానికి రాసుకోవడం వల్ల చర్మం రాత్రంతా తేమగా ఉండి, పొడిబారడాన్ని నివారించడంలో సహాయపడుతుంది. కొబ్బరి నూనె మృత చర్మ కణాలను తొలగించి, చర్మం కాంతిని పెంచి, తేమను నిలుపుకోవడంలో సహాయపడుతుంది. కాబట్టి చర్మాన్ని కాంతివంతంగా ఉంచుకోవడానికి ప్రతి రాత్రి పడుకునే ముందు ముఖానికి కొబ్బరి నూనెను రాసుకోవాలి. కొబ్బరి నూనెలో ఉండే లారిక్ యాసిడ్ వంటి యాంటీ బాక్టీరియల్, యాంటీ ఫంగల్ గుణాలు, మొటిమలకు కారణమయ్యే సూక్ష్మక్రిములతో పోరాడటానికి, చర్మాన్ని తేమగా ఉంచడానికి సహాయపడతాయి. ఇది ముడతలు, పొడిదనాన్ని కూడా తగ్గిస్తుంది. కళ్ల కింద నల్లటి వలయాలను తొలగించడానికి కొబ్బరి నూనె ఒక అద్భుతమైన పరిష్కారం. రాత్రి పడుకునే ముందు కళ్ల చుట్టూ ఉన్న ప్రాంతంలో కొబ్బరి నూనెను సున్నితంగా మర్దనా చేయడం వల్ల అలసట తగ్గి, నల్లటి వలయాలు తగ్గుతాయి. అంతేకాకుండా ఇది చర్మానికి సహజమైన మెరుపును ఇస్తుంది.

# సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉన్న 'ఓట్రోవర్ట్' అంటే ఏంటి

అమెరికాకు చెందిన సైకియాట్రిస్ట్ ఒకరు ఈ 'ఓట్రోవర్ట్' అనే పదాన్ని సృష్టించారు. తన దగ్గరకు వచ్చే రోగుల ప్రవర్తనను, తన స్వంత వ్యక్తిత్వాన్ని విశ్లేషించిన తర్వాత ఆయన ఈ ముగింపుకు వచ్చారు. సంప్రదాయ వర్గీకరణలకు అందని వ్యక్తులను వివరించడానికి ఇది ఒక సరికొత్త నిర్వచనం. ప్రస్తుత డిజిటల్ యుగంలో మన వ్యక్తిత్వాలను, భావోద్వేగాలను వివరించడానికి రకరకాల కొత్త పదాలు పుట్టుకొస్తున్నాయి. ఇప్పటివరకు మనకు 'ఇంట్రోవర్ట్' ( అంతర్ముఖుడు), 'ఎక్స్‌ట్రోవర్ట్' ( బహిర్ముఖుడు) అనే పదాలు మాత్రమే తెలుసు. కానీ, ఇటీవల సోషల్ మీడియాలో 'ఓట్రోవర్ట్' అనే కొత్త పదం విపరీతంగా ట్రెండ్ అవుతోంది. చాలామంది తమ గురించి తాము ఇన్నాళ్లు వివరించలేకపోయిన ఒక విలక్షణమైన స్థితిని ఈ పదం ఖచ్చితంగా ప్రతిబింబిస్తోందని అభిప్రాయపడుతున్నారు.

ఓట్రోవర్ట్ అంటే.. పైకి చూస్తే ఓట్రోవర్టులు అందరితో కలిసినట్లు, సంభాషణల్లో చురుగ్గా పాల్గొంటున్నట్లు కనిపిస్తారు. వారు ఏ గుంపులోనైనా సులభంగా కలిసిపోగలరు. కానీ, లోపల మాత్రం వారు ఆ సమూహానికి చెందని వారిలా భావిస్తుంటారు. వీరిని "ఇన్‌సైడర్లలా పరిగణించబడే అవుట్‌సైడర్లు" అని ప్రముఖ డాక్టర్ వర్ణించారు. ఎక్స్‌ట్రోవర్టుల్లా వీరు ఇతరులతో కలవడం వల్ల శక్తిని పొందరు. అలాగని ఇంట్రోవర్టుల్లా ఒంటరిగా ఉండాలని కూడా అనుకోరు. వీరు ఆ రెండింటికీ మధ్యలో ఒక విభిన్నమైన ప్రపంచంలో నివసిస్తారు.వీరు ఒక సమూహంలో 'ఫిట్' అవ్వడానికి ప్రయత్నించరు. అందరి మెప్పు పొందడం కంటే, తమకు తాముగా నిజాయితీగా ఉండటానికే ప్రాధాన్యత ఇస్తారు.వీరు సమాజంలో జరిగే చిన్న చిన్న విషయాలను



కూడా చాలా సునిశితంగా గమనిస్తారు. ఇతరుల పట్ల ఎక్కువ సానుభూతిని కలిగి ఉంటారు.

ఓట్రోవర్ట్ అనేది ఒక వ్యక్తిత్వం కాదు. మనుషులను ఏదో ఒక కేటగిరీకి పరిమితం చేయడం వల్ల వారిలోని సహజత్వాన్ని కోల్పోతాం. ఓట్రోవర్టులు తమ స్వేచ్ఛను, స్వతంత్రతను అమితంగా ప్రేమిస్తారు. వీరు ఇతరుల గుర్తింపు కోసం ఆరాటపడరు, తమకంటూ ఒక ప్రత్యేకమైన దారిని ఎంచుకుంటారు. "నేను ఎవరికీ తక్కువ కాదు.. అలాగని అందరితో ఒకరిని కాదు" అని భావించే వారికి 'ఓట్రోవర్ట్' అనేది ఒక చక్కని నిర్వచనం. మీరు కూడా ఒకరితో మనస్ఫూర్తిగా కనెక్ట్ అవుతూనే, మీ అంతర్గత స్వేచ్ఛను కాపాడుకోవాలనుకుంటే.. మీరు ఖచ్చితంగా ఒక 'ఓట్రోవర్ట్' కావొచ్చు. ఈ సంక్లిష్టమైన ప్రపంచంలో మన వ్యక్తిత్వాన్ని మనం అర్థం చేసుకోవడం అనేది మానసిక ఎదుగుదలకు మొదటి అడుగు.

# ఎండాకాలంలో జుట్టుకు రోజూ షాంపూ పెడితే ఏమవుతుంది?

భానుడి భగభగలకు కేవలం చర్మమే కాదు, మన కేశాలూ విలవిల్లాడుతున్నాయి. బయట అడుగుపెడితే చాలు, ముంచెత్తే చెమటతో తలంతా జిడ్డుగా మారుతోంది. ఈ క్రమంలో జుట్టును రోజూ కడగాలా? లేక అలా వదిలేయాలా? అనే అయోమయం అందరిలోనూ నెలకొంది.ఎండలు ముదురుతున్నాయి. బయట అడుగుపెడితే చాలు చెమటతో తలంతా జిడ్డుగా, చిరాకుగా మారుతోంది. దీంతో ప్రతిరోజు లస్నానం చేయాలని అనుకుంటారు. అయితే, అందరికీ ఒకే రకమైన పద్ధతి పనికిరాదని, జుట్టు రకాన్ని బట్టి సంరక్షణ మార్చుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ముందుగా మీ జుట్టు ఏ రకానికి చెందినదో గుర్తించడం ముఖ్యం. మీకు సన్నని లేదా నిటారుగా ఉండే జుట్టు ఉంటే, చెమట, నూనె త్వరగా జుట్టు చివర్ల వరకు పాకుతాయి. దీనివల్ల జుట్టు త్వరగా జిడ్డుగా కనిపిస్తుంది. ఇలాంటి వారు జుట్టు కుదుళ్లు మూసుకుపోకుండా ఉండటానికి ప్రతిరోజూ లేదా ఒక రోజు విడిచి ఒక రోజు తలస్నానం చేయడం మంచిది. దీనివల్ల జుట్టు శుభ్రంగా ఉంటుంది. ఉంగరాల జుట్టు లేదా సాధారణ జుట్టు ఉన్నవారికి కాస్త వెసులుబాటు ఉంటుంది. వీరు వారానికి రెండు లేదా మూడు సార్లు షాంపూ చేస్తే సరిపోతుంది. ఇది జుట్టులోని సహజ సిద్ధమైన నూనెలను తొలగించకుండా.. పేరుకుపోయిన మురికిని వదిలిస్తుంది. అదేవిధంగా మీ జుట్టు చాలా దట్టంగా లేదా గరుకుగా ఉంటే అసలు షాంపూని ఎక్కువగా వాడకూడదు.

ఈ రకమైన జుట్టుకు తేమ చాలా అవసరం. వారానికి ఒకసారి లేదా పది రోజులకు ఒకసారి కడిగితే సరిపోతుంది. లేదంటే జుట్టు బాగా పొడిబారిపోయి చిక్కుబడిపోతుంది.చాలా మందిలో ఉన్న ఒక పెద్ద అపోహ ఏమిటంటే.. చుండ్రు ఉంటే జుట్టును తక్కువగా కడగాలని అనుకుంటారు. కానీ వాస్తవానికి ఇది తప్పు. తల చర్మంపై చెమట, నూనె పేరుకుపోవడం వల్ల చుండ్రును కలిగించే బ్యాక్టీరియా మరింత వేగంగా పెరుగుతుంది. దీనివల్ల దురద, వాపు వచ్చి జుట్టు ఎక్కువగా రాలుతుంది. చుండ్రు సమస్య ఉన్నవారు వేసవిలో వారానికి కనీసం మూడు నుండి నాలుగు సార్లు తలస్నానం చేయడం వల్ల జుట్టును కాపాడుకోవచ్చు. మీరు వ్యాయామం లేదా స్విమ్మింగ్ చేసేవారైతే ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. రోజూ జిమ్‌లో కష్టపడి వ్యాయామం చేసి చెమట పట్టినప్పుడు ప్రతిసారీ షాంపూ వాడాల్సిన అవసరం లేదు. కేవలం మంచి నీటితో తలని మసాజ్ చేస్తూ కడిగితే చెమట వెళ్ళిపోతుంది. అలాగే స్విమ్మింగ్ పూల్‌లోని క్లోరిన్ నీరు జుట్టును పాడు చేస్తుంది కాబట్టి ఈత కొట్టిన వెంటనే ఖచ్చితంగా మంచి నీటితో స్నానం చేసి కండిషనర్ వాడాలి. మీ జుట్టు అవసరాలను బట్టి సరైన నిర్ణయం తీసుకోవడమే ఆరోగ్యకరమైన జుట్టుకు రహస్యం.

# అప్పుడేమో కేఎల్ రాహుల్, ఇప్పుడు రిషబ్ పంత్‌ను ఘోరంగా అవమానించిన లక్నో ఓనర్




**హైదరాబాద్ పెన్ పవర్:** లక్నో సూపర్ జెయింట్స్ ఓనర్ సంజీవ్ గోయెంకా, తన జట్టు ఆటగాళ్లతో వ్యవహరించే తీరు మొదటి నుంచి వివాదస్పదంగా మారింది. రైజింగ్ పూణే సూపర్ జెయింట్స్ ఉన్నప్పుడు ధోనీని కెప్టెన్సీ నుంచి తప్పించి, స్టీవ్ స్మిత్‌కి సారథ్య బాధ్యతలు అప్పగించిన సంజీవ్ గోయెంకా. ఆ తర్వాత 2024 సీజన్‌లో స్టేడియంలోనే కేఎల్ రాహుల్‌ని తిట్టడంతో వివాదాల్లో నిలిచాడు. అయినా అతని పద్ధతిని ఏ మాత్రం మార్చుకోలేదు. ఏప్రిల్ 1న ఢిల్లీ క్యాపిటల్స్ చేతిలో లక్నో ఓడిపోయిన తర్వాత కెప్టెన్ రిషబ్ పంత్‌పై అతడు సీరియస్ అయ్యాడు. ఢిల్లీ క్యాపిటల్స్ తో జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన లక్నో సూపర్ జెయింట్స్ 18.4 ఓవర్లలో 141 పరుగులకి ఆలౌట్ అయ్యింది. సమీర్ రిజ్వీ హాఫ్ సెంచరీతో ఈ లక్ష్యాన్ని 17.1 ఓవర్లలోనే

ఢిల్లీ ఛేదించింది. ఆరంభంలో లక్నో బౌలర్లు వెంటవెంటనే 4 వికెట్లు తీసినప్పటికీ.. సమీర్ రిజ్వీ ( 47 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సులతో 70 పరుగులు) , ట్రిస్టన్ స్టబ్స్ ( 32 బంతుల్లో 3 ఫోర్లు 1 సిక్సులతో 39 పరుగులు) కలిసి 119 పరుగుల భాగస్వామ్యంతో మ్యాచ్‌ని సక్సెస్ ఫుల్ గా ముగించేశారు.

**రిషబ్ పంత్‌తో సీరియస్ చర్చలు:**

ఈ ఓటమి తర్వాత లక్నో సూపర్ జెయింట్స్ ఓనర్ సంజీవ్ గోయెంకా, కెప్టెన్ రిషబ్ పంత్‌తో గ్రౌండ్‌లో సీరియస్‌గా చర్చించడం కెమెరాల్లో కనిపించింది. వాళ్లేం మాట్లాడుకున్నారో వినిపించకపోయినా సంజీవ్ , రిషబ్ పంత్‌కి ఏదో చూపిస్తూ సీరియస్‌గా చెప్పడం, దానికి అతను ముఖం చిన్నబుచ్చుకోవడం నెట్టింట వైరల్ గా మారిన వీడియోల్లో కనిపిస్తుంది. జట్టు పర్ఫామెన్స్ కారణంగా సంజీవ్ గోయెంకాకి కోపం రావడంలో తప్పు లేదు, కానీ ఇలా గ్రౌండ్‌లోకి వచ్చి మరీ ఇంటర్నేషనల్ క్రికెటర్‌ని ఘోరంగా అవమానించడం మాత్రం కరెక్ట్ కాదని నెటిజన్స్ కామెంట్లు చేస్తున్నారు. రూ.27 కోట్లు పెట్టి కొనుగోలు చేశామని.. ఎన్ని తిట్టినా భరించాలని అనుకునే కార్పరేట్ పద్ధతి, జెంటిల్మెన్ గేమ్ క్రికెట్‌కి సెట్ కాదనే విషయాన్ని సంజీవ్ గోయెంకా గుర్తు పెట్టుకోవాలని సూచిస్తున్నారు.

**గతంలో కేఎల్ రాహుల్‌ని తిట్టిన సంజీవ్:**

2024 ఐపీఎల్ సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ 10 వికెట్ల తేడాతో ఓడిపోయింది. మొదట బ్యాటింగ్ చేసిన లక్నో, 165 పరుగులు చేసింది. అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్ కొట్టిన కొట్టుడికి ఈ లక్ష్యాన్ని 9.4 ఓవర్లలోనే ఊదేసింది సన్‌రైజర్స్. ఈ మ్యాచ్ అనంతరం లక్నో సూపర్ జెయింట్స్ ఓనర్ సంజీవ్ గోయెంకా, స్టేడియంలోనే అప్పటి లక్నో టీమ్ కెప్టెన్ కేఎల్ రాహుల్‌ని తిట్టడం సంచలనంగా మారింది.

**సంజీవ్ గోయెంకా తీరుపై విమర్శలు:**

ఈ ఘటన తర్వాత క్రికెట్ అభిమానులు, మాజీ క్రికెటర్లు అందరూ కూడా సంజీవ్ గోయెంకా తీరుని తీవ్రంగా తప్పుబట్టారు. డబ్బులు పెట్టినంత మాత్రాన, అంతర్జాతీయ క్రికెట్ ఆడే ప్లేయర్‌ని ఇలా మైదానంలో ప్రేక్షకులందరి ముందు చివాట్లు పెట్టి, అవమానించడం మంచి పద్ధతి కాదని విమర్శలు వచ్చాయి. సోషల్ మీడియాలో బ్యాడ్ అయిపోవడంతో కేఎల్ రాహుల్‌ని ఇంటికి పిలిచి, డిన్నర్ ఏర్పాటు చేసి సంజీవ్ గోయెంకా 'సారీ' చెప్పగా.. అందరి ముందు తిట్టి, ప్రైవేటుగా సారీ చెబితే చెల్లిపోతుందా? అందుకే ఐపీఎల్ 2025 మెగా వేలంలో లక్నో సూపర్ జెయింట్స్‌ని వీడి, ఢిల్లీ క్యాపిటల్స్‌లో చేరాడు.

ఇక ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు కెప్టెన్సీ ఆఫర్ చేసినా గత అనుభవం కారణంగానే సారథ్య బాధ్యతలు తీసుకోవడానికి కేఎల్ రాహుల్ ఇష్టపడలేదు. 2025 సీజన్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌తో మ్యాచ్‌లో 57 పరుగులు చేసి, ఢిల్లీ క్యాపిటల్స్‌ని విజయం అందించాడు. మ్యాచ్ తర్వాత సంజీవ్ గోయెంకా మాట్లాడడానికి ప్రయత్నించినా.. రాహుల్ పట్టించుకోకపోవడం కెమెరాల్లో కనిపించింది. కానీ ఈసారి సంజీవ్ గోయెంకా తీరు మార్చుకోకపోతే రిషబ్ పంత్ కూడా లక్నో సూపర్ జెయింట్స్ నుంచి జంప్ కావడం ఖాయమంటూ ఐపీఎల్ ఫ్యాన్స్ కామెంట్లు పెడుతున్నారు.

# అంతర్జాతీయ క్రికెట్‌కు దక్షిణాఫ్రికా స్టార్ క్రికెటర్ వీడ్కోలు.. వన్డేల్లో ఏబీడీ తర్వాత అతడే!




**హైదరాబాద్ పెన్ పవర్:** దక్షిణాఫ్రికా క్రికెట్‌లో నమ్మకమైన వైట్-బాల్ బ్యాటర్‌గా పేరుగాంచిన రాసీ వాన్ డర్ డస్సెన్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని సోషల్ మీడియా వేదికగా ఒక సుదీర్ఘ ప్రకటన ద్వారా వెల్లడించాడు. దేశం తరఫున ఆడటం తన జీవితంలో దక్కిన గొప్ప గౌరవమని, ఈ ప్రయాణంలో సహకరించిన ప్రతీ ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతూ ఆయన భావోద్వేగానికి గురయ్యాడు. "గర్వంతో, కృతజ్ఞతాభావంతో నేను నా అంతర్జాతీయ క్రికెట్ రిటైర్మెంట్‌ను ప్రకటిస్తున్నాను. ప్రొటీస్ జెర్సీ ధరించడం ఒక ప్రత్యేకమైన అనుభూతి. నా దేశానికి ప్రాతినిధ్యం వహించడం నా జీవితంలో దక్కిన అతిపెద్ద గౌరవం. ఈ ప్రయాణం కోసం ఎన్నో త్యాగాలు చేశాను. కానీ దక్షిణాఫ్రికా తరఫున ఆడిన ప్రతీ క్షణం ఎంతో విలువైనది" అని తన ప్రకటనలో పేర్కొన్నాడు.

దేశవాళీ క్రికెట్, వివిధ టీ20 లీగ్‌లలో రాణించిన తర్వాత 29 ఏళ్ల వయసులో లేటుగా వాన్ డర్ డస్సెన్ దక్షిణాఫ్రికా జట్టులోకి అరంగేట్రం చేశాడు. 2019లో ఇంగ్లండ్‌పై టెస్టుల్లో అడుగుపెట్టినా, అతడు వన్డే ఫార్మాట్‌లో అత్యద్భుతంగా రాణించాడు. దక్షిణాఫ్రికా మిడిల్ ఆర్డర్‌లో కీలక ఆటగాడిగా ఎదిగాడు. మొత్తం 71 వన్డే మ్యాచ్‌లలో 50కి పైగా సగటుతో 2,657 పరుగులు చేశాడు. ఈ ఫార్మాట్‌లో దక్షిణాఫ్రికా తరఫున అత్యధిక సగటు కలిగిన ఆటగాళ్ల జాబితాలో ఏబీ డివిలియర్స్ తర్వాత రెండో స్థానంలో నిలిచాడు. తన కెరీర్‌లో 18 టెస్టులు, 57 టీ20లు కూడా ఆడాడు. ఈ ప్రయాణంలో తనకు అండగా నిలిచిన వారిని రాసీ గుర్తుచేసుకున్నారు. "క్రికెట్ దక్షిణాఫ్రికా, కోచ్‌లు, మేనేజర్‌లకు నా ధన్యవాదాలు. నా భార్య లారా ప్రతీ అడుగులో నాకు తోడుగా నిలిచింది. అభిమానులు నన్ను 'మా థౌజండ్' అని పిలవడం, వాండరర్స్ స్టేడియంలో బ్యాటింగ్‌కు వెళ్తున్నప్పుడు ప్రేక్షకుల కేరింతలు ఎప్పటికీ మర్చిపోలేను" అని తెలిపాడు. అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికినా, తన ప్రయాణం ముగియలేదని వాన్ డర్ డస్సెన్ స్పష్టం చేశాడు. దేశవాళీ క్రికెట్‌లో తన జట్టు 'లయన్స్' తరఫున ఆడటాన్ని కొనసాగిస్తానని, భవిష్యత్ తరాల దక్షిణాఫ్రికా క్రికెటర్లకు మార్గనిర్దేశం చేస్తానని పేర్కొన్నాడు. యువ ఆటగాళ్లు పెద్ద కలలు కనాలని, వాటిని సాకారం చేసుకోవడానికి సర్వశక్తులు ఒడ్డాలని రాసీ సూచించాడు.

## 15 ఏళ్లయినా ఆ రాత్రిని మర్చిపోలేం.. 2011 ప్రపంచకప్ ఫైనల్‌పై సచిన్ ఎమోషనల్ పోస్ట్




**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించిన 2011 ప్రపంచకప్ విజయాన్ని సాధించి నేటికి 15 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ ఆనాటి మధుర స్మృతులను గుర్తుచేసుకున్నాడు. ఆ ఫైనల్ మ్యాచ్‌లోని ఉత్కంఠను, విజయం తర్వాత కలిగిన ఆనందాన్ని పంచుకుంటూ సోషల్ మీడియాలో ఓ భావోద్వేగ పోస్ట్ పెట్టాడు. "మొదటి బంతి ఎప్పుడూ గుండె వేగాన్ని పెంచుతుంది. కానీ ఆ రాత్రి, ఆ వేగం అస్సలు తగ్గలేదు. 15 ఏళ్ల తర్వాత కూడా ఆ జ్ఞాపకాలు మాతోనే ఉన్నాయి. భారత్ కోసం ప్రపంచకప్ గెలవాలనే ఒకే ఒక్క కలతో మేమంతా పెరిగాం. ఈ ప్రయాణంలో భాగమైన ప్రతీ ఒక్కరికీ, అభిమానులందరికీ ధన్యవాదాలు" అంటూ సచిన్ తన ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు. తన కెరీర్‌లో చివరి ప్రపంచకప్‌ను సొంత గడ్డపై గెలవడం సచిన్‌కు మరపురాని అనుభూతిని మిగిల్చింది. 2011 ఏప్రిల్ 2న ముంబైలోని వాంఖడే స్టేడియంలో జరిగిన ఈ ఫైనల్ మ్యాచ్‌లో భారత్, శ్రీలంక జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న శ్రీలంక, మహేల జయవర్ధనే అద్భుతమైన సెంచరీతో (103 నాటౌట్) రాణించడంతో నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 274 పరుగుల భారీ స్కోరు సాధించింది. 275 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ డకౌట్‌గా వెనుదిరిగాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన గౌతమ్ గంభీర్, బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్‌తో జట్టును ఆదుకున్నాడు. కేవలం 3 పరుగుల తేడాతో సెంచరీ చేజార్చుకున్నప్పటికీ, 97 పరుగులతో విజయానికి బలమైన పునాది వేశాడు. అనంతరం కెప్టెన్ ఎంఎస్ ధోనీ క్రీజులో నిలబడి మ్యాచ్‌ను తన చేతుల్లోకి తీసుకున్నాడు. యువరాజ్ సింగ్‌తో (21 నాటౌట్) కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పిన ధోనీ, కేవలం 79 బంతుల్లో 91 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. చివరిలో సిక్సర్ బాది భారత్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. ఈ గెలుపుతో 28 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. 1983 తర్వాత భారత్ రెండోసారి వన్డే ప్రపంచకప్‌ను ముద్దాడి, దేశవ్యాప్తంగా సంబరాల్లో మునిగిపోయింది.



నేహా శర్మ లుక్ మిస్ అవ్వడం చాలా బాగుంది

# నిర్మాతగా దూసుకుపోతున్న సుకుమార్!





శ్రేయా ధన్వంతరి కాన్ఫిడెంట్ న్యూ లుక్‌లో టోన్డ్ అబ్స్‌ని ప్రదర్శించింది

దర్శకుడిగా సుకుమార్ ఎలాంటి విజయాలు అందించారు? అన్నది చెప్పాల్సిన పనిలేదు. -ఆర్య- నుంచి -పుష్ప 2- వరకూ ఎన్నో వైవిధ్యమైన చిత్రాల్ని అందించారు. ప్రత్యేకించి -పుష్ప- విజయంతో స్టార్ డైరెక్టర్ గా ఇండియాలోనే ప్రత్యేకమైన గుర్తింపును దక్కించుకున్నారు. ప్రస్తుతం ఇండియాన్ టాప్ 5 డైరెక్టర్లలో ఆయన ఒకరు. ఇప్పుడా యనతో సినిమాలు చేయడానికి బాలీవుడ్ సహా స్టార్ హీరోలంతా క్యూలో ఉన్నారు. అలాగే తెలివైన శిష్యులను అందించడంలోనూ ఆయనే ముందున్నారు. ఇప్పటికే ఆయన స్కూల్ నుంచి కొంత మంది శిష్యులు డైరెక్టర్లగా రాణిస్తోన్న సంగతి తెలిసిందే. అలాగే నిర్మాతగానూ సుకుమార్ మరింత బిజీ అవుతున్నారు. ఈ విషయంలో ఏ స్టార్ డైరెక్టర్ లేనంత బిజీగా సుకుమార్ కనిపిస్తున్నారు. వరుసగా తన సొంత బ్యానర్ సుకుమార్ క్రియేటివ్ వర్క్స్ లో సినిమాలు నిర్మిస్తూ హైలైట్ అవుతున్నారు. -కుమారి 21 ఎఫ్- తో నిర్మాతగా తెరంగేట్రం చేసిన లెక్కలు మాస్టారు అనంతరం అదే సినిమా రీమేక్ కు సమర్పకుడిగా వ్యవహరించారు. -100 పర్సంట్ కాదల్- ను సమర్పించారు. అటుపై బుచ్చి బాబు దర్శకత్వం వహించిన -ఉప్పెన- కు నిర్మాతగా పని చేసారు. -విరూపాక్ష- చిత్ర నిర్మాణంలోనూ భాగమయ్యారు. -మంజుమ్మల్ బోయ్స్- లాంటి మలయాళ చిత్రాన్ని తెలుగు అనువాదంలో ఆయన హస్తం ఉంది. ప్రస్తుతం మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు తెరకెక్కిస్తోన్న -పెద్ది- సినిమాకు నిర్మాతగా కొనసాగుతున్నారు. మరో రెండు బ్యానర్లతో కలిసి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. అలాగే నాగ చైతన్య హీరోగా కార్తీక్ దండు తెరకెక్కిస్తోన్న -వృషకర్మ- సినిమా నిర్మాణంలో భాగమయ్యారు. అసలు విషయం ఏంటంటే ఈ సినిమాలన్నింటినీ తన శిష్యులు డైరెక్ట్ చేయడం ఇంట్రెస్టింగ్. ఆ కథల్లో సుకుమార్ హస్తం కూడా ఉంది. రచన విభాగంలో ఆయన ఇన్వాల్వ్ అవుతూ అవసరమైన ఇన్ పుట్స్ ఇస్తున్నారు. ఆ రకంగా తన బ్రాండ్ ను, పేరునే పెట్టుబడి పెడుతున్నారు. తాజాగా ప్రియదర్శి హీరోగా కూడా ఓ సినిమా నిర్మిస్తున్నారు. తెలంగాణ నేపథ్యంలో సాగే చిత్రమిది. బన్నీ వాసుతో కలిసి సుకుమార్ ఈ చిత్రాన్ని నిర్మించడం విశేషం. ఇవిగాక మరో రెండు..మూడు చిత్రాలకు సంబంధించి చర్చలు జరుగుతున్నాయి. ఓ స్టార్ డైరెక్టర్ నిర్మాతగా ఇంత బిజీగా ఉండటం అన్నది సుకుమార్ కే చెల్లింది. -పుష్ప 2- రిలీజ్ అయిన దగ్గర నుంచి సుకుమార్ నిర్మాణంలోనే బిజీగా ఉంటున్నారు. త్వరలోనే మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా కొత్త చిత్రం ప్రారంభించాలని సన్నాహాలు చేస్తున్నారు. -పెద్ది- రిలీజ్ అనంతరం చిత్రాన్ని పట్టాలెక్కించనున్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965